ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 17.07.2025 | సంపుటి :11 సంచిక : 359 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

# జలవివాదాల పరిష్కారానికి కమిటీ

**ఆంధ్రా,తెలంగాణ సీఎంల సమావేశంలో మరో ముందడుగు**

**కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన గంటన్నరపాటు జరిగిన భేటీ**


కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన భేటీలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు

## నెలరోజుల్లో వివాదాలను కొలిక్కితేవాలి

**బనకచర్లపై చర్చ జరగలేదు • అపెక్స్ కమిటీ కాదు కనక ప్రస్తావించలే..**


సీఎంల భేటీ అనంతరం వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్, ఎంపీ చామల తదితరులు

- కృష్ణా, గోదావరి జలాలపై ఉన్నతస్థాయి కమిటీ
- నిపుణులు, అధికారులతో వారంలోగా ఏర్పాటవుతుంది.. నెల రోజుల్లో నివేదిక ఇస్తుంది
- టెలిమెట్రీల ఏర్పాటుకు, శ్రీశైలం మరమ్మతులకు ఏపీ అంగీకరించింది
- కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును అమరావతిలో ఏర్పాటు చేసుకునేందుకు ఏకాభిప్రాయానికి వచ్చాం
- ఈ భేటీ కచ్చితంగా తెలంగాణ విజయంగానే భావిస్తున్నాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం
- సీఎంల భేటీ అనంతరం మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

**చర్చల్లో కేంద్రం కేవలం నిర్వాహక పాత్ర మాత్రమే పోషించింది: సీఎం రేవంత్ రెడ్డి**

**ఇచ్చిపుచ్చుకునే వాతావరణంలో చర్చలు జరిగాయి : ఏపీ మంత్రి నిమ్మల**

న్యూఢిల్లీ,జూలై16(జనంసాక్షి): ఇరు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి అడుగు పడింది. చర్చల ద్వారా పరిష్కరించుకోవడంతో పాటు కమిటీ ఏర్పాటు చేసి ముందుకు సాగాలని నిర్ణయించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగింది.. జలశక్తి మిగతా 2లో..

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు కడుతమంటే కదా మేము ఆపమని చెప్పడానికి, అజెండాలో బనకచర్ల ప్రాజెక్టే చర్చకు రానప్పుడు, ఆపమనే చర్చ రాదు. గోదావరి, కృష్ణా నదులపై ఉన్న సమస్యలపై చర్చ జరిగింది. ఈ సమస్యలపై ఒక కమిటీ వేసి నివేదికల ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందనే విషయాలు చర్చించాం. ఈ సమావేశంలో ప్రధానంగా 4 అంశాలనే తీసుకున్నాం" – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**పెద్దధన్వాడ ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్**

# సీరియస్


న్యాయవాది రామరావు ఇమ్మానేని

- రైతులపై పెట్టిన అక్రమ కేసులపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ
- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ డాక్టర్ జితేందర్‌పై ఆగ్రహం
- 28న హైదరాబాద్‌లో బహిరంగ విచారణ చేపట్టనున్న కమిషన్ బృందం
- రైతుల ప్రయాణ ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఆదేశం

హైదరాబాద్, (జనంసాక్షి) : పెద్ద ధన్వాడ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కీలక ఆదేశాలు జారీచేసింది. ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె రామ కృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేం దర్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది. వారం లోపల రైతు లపై పెట్టిన అక్రమ కేసులపై నివేదిక ఇవ్వాలని సూ చించింది. పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతు న్న రైతులపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధానికి గురి


(ఫైల్ ఫోటో)

చేశారంటూ న్యాయవాది రామారావు పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం జూల్కై 28న హైదరాబాద్‌లో బహిరంగ విచారణ చేపట్టనుంది. ఉదయం 10 గంటలనుండి విచారణ చేపట్టనున్నామని మిగతా 12లో..

## బనకచర్లపై చర్చించారు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రుల భేటీలో మొదటి అంశమే బనకచర్ల అని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ.. బనకచర్ల ప్రస్తావనే రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. ఆయన మాటలు, మిగతా 12లో..

## స్థానిక పోరుకు సర్కారు సై

**జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన ప్రభుత్వం**

హైదరాబాద్(జనంసాక్షి): జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపింది. 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది.

## సవాళ్లు విసరడం...పారిపోవడం సీఎంకు అలవాటే

**దళితబంధు సాధనసమితి సమావేశంలో కేటీఆర్**



హైదరాబాద్(జనంసాక్షి):చర్చలకు రమ్మని సవాళ్లు విసరడం..పారిపోవడం రేవంత్‌కు అలవాటు అయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష, అధికార పార్టీల నడుమ సవాళ్ల పర్వం కొనసాగుతోంది. మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపైకేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన దళిత బంధు సాధనసమితి సమావేశంలో రేవంత్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ మిగతా 2లో..

## పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ అరెస్టు

**రూ. 50వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు**



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం ఏసీబీ వలలో చిక్కారు. డీఈ బదిలీ విషయంలో ఆయన రూ. 50వేలు డిమాండ్ చేశారు. లంచం డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి 31న కనకరత్నం పదవీవిరమణ పొందారు. అయితే, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని మరో మిగతా 2లో..

## బీసీ రిజర్వేషన్లలో తెలంగాణ రోల్ మోడల్



**ఈ చారిత్రక ఘట్టంలో నేను భాగస్వామ్యం కావడం అదృష్టం**

**అక్టోబరులో హైదరాబాద్‌లో ఓబీసీ సలహా మండలి సమావేశాలు నిర్వహిస్తాం**

**బెంగుళూరు ఓబీసీ సలహా మండలి సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.**

బెంగుళూరు(జనంసాక్షి): మనమెంతో మనకంత అన్న నినాదాన్ని సమగ్రంగా అమలు చేసేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కలలు కన్న బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నదని, దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కర్ణాటక లో ముఖ్యమంత్రి, ఓబీసీ సలహామండలి చైర్మన్ సిద్దిరామయ్య అధ్యక్షతన జరుగుతున్న ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగించారు. ఎన్నికల ముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్ సమయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొనగా తాను అప్పట్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బిసి డిక్లరేషన్ ను ప్రతిపాదించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వం వచ్చాక నాకు టీపీసీసీ ఆదక్షులుగా అవకాశం వచ్చిందని అటు ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి అగ్రవర్ణ నాయకులు అయినా బిసి రిజర్వేషన్లకు సంపూర్ణ సహకారాన్ని అందించి రిజర్వేషన్లు అన్ని రకాలుగా న్యాయ, మిగతా 2లో..

## మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో బతకాలి

**వారు వ్యాపారవేత్తలుగా ఎదిగి మరో పదిమందికి ఉపాధి కల్పించాలి**



**మహిళల పేరు మీదే రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు జారీ చేస్తున్నాం**

**ఇందిరా మహిళా శక్తి సంబరాలలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, సీతక్క**

పెద్దపల్లి (జనంసాక్షి) : మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు బుధవారం పెద్దపల్లి పట్టణంలో పర్యటించి గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర సెర్ప్ సిఈఓ డి.దివ్య, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ రాజ్ ఠాకూర్ లతో కలిసి పెద్దపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని అన్నారు. రాష్ట్రంలో మహిళలు భద్రాచలం, యాదాద్రి, వేములవాడ ఎక్కడికైనా ఉచితంగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు మిగతా 2లో..

## ఇజ్రాయెల్ క్యాన్సర్ కణితి లాంటిది

**ఆ దేశ నేరాల్లో అమెరికా భాగస్వామి**

**మండిపడ్డ ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ**



టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇజ్రాయెల్ నేరాల్లో అమెరికా భాగస్వామి అని మండిపడ్డ ఆయన.. టెల్ అవీవ్ ఓ క్యాన్సర్ కణితి వంటిదన్నారు. వాషింగ్టన్ చెప్పుచేతల్లో నడుచుకుంటుందని ధ్వజమెత్తారు. ఇజ్రాయె ల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం జరిగి, అటు అమెరికాతో అణు చర్చలు జరపనున్న వేళ సుప్రీం లీడర్ ఈ విధంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో గొప్పగా పోరాటం చేశామన్న సుప్రీం లీడర్.. మళ్లీ ఎలాంటి దాడులు మిగతా 9లో..



**సిరియా సైనిక ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్**

## బాంబుల వర్షం

**దాడితో పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణ వాతావరణం**

డమాస్కస్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్– సిరియా మధ్య మరోసారి ఘర్షణ వాతావరణం నెలకొంది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని సైనిక ప్రధానకార్యాలయంపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. ఈ విషయాన్ని ఐడీఎఫ్ వెల్లడించింది. అలాగే రక్షణశాఖ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని సిరియన్ సైనిక వర్గాలు అంతర్జాతీయ మీడియాకు వెల్లడించాయి కొద్దిసేపటి క్రితం డమాస్కస్‌లోని సైనిక ప్రధానకార్యాలయ ప్రవేశద్వారం వద్ద దాడి చేశాం" అని ఐడీఎఫ్ తన ప్రకటనలో పేర్కొంది. సిరియాలో స్వైదా ప్రాంతంలో స్థానిక మిలీషియాల మధ్య జరిగిన సాయుధ సంఘర్షణలో 100 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగతా 2లో..

**రష్యాతో వ్యాపారం చేస్తే**

## జాగ్రత్త!

- 100 శాతం సుంకం విధిస్తాం
- భారత్,చైనాలకు 'నాటో' హెచ్చరిక

## చల్లటి కబురు

తెలంగాణకు రెండ్రోజులు భారీ వర్షాలు

## నిమిష ప్రియకు శిక్ష పడాల్సిందే..

- బ్లడ్‌మనీకి అంగీకరించేది లేదు
- స్పష్టం చేసిన మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం

## నేటి యుద్ధాలు గెలవాలంటే టెక్నాలజీని మెరుగుపరుచుకోవాలి

సీడీఎస్ అనిల్ చౌహాన్

పై వార్తల వివరాలు 2 లో..

## 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

**100 జిల్లాల్లో అమలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు ఆమోదం తెలిపింది. వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఏటా రూ.24వేల కోట్ల వ్యయంతో దేశ వ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ ప్రోగ్రామ్‌ని అమలు చేయనున్నారు. 2025–26 నుంచి ఆరేళ్ల కాలానికి 100 జిల్లాలను కవర్ చేసేలా దీన్ని చేపట్టనున్నారు. అలాగే, పునరుత్పాదక ఇంధనంలో ఎన్‌టీపీసీకి రూ.20వేల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, రోదసిలో 18 రోజులు గడిపి, అనేక ప్రయోగాలను నిర్వహించి విజయవంతంగా భూమికి తిరిగివచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

**'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' అమలు ఇలా..**

వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంటకోత తర్వా



త గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేసేందుకు గోదాముల సదుపాయం, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడమే లక్ష్యంగా పీఎం ధన్ ధాన్య కృషి యోజనను రూపొందించారు. ఈ కార్యక్రమం కోసం ఏటా రూ.24వేల కోట్లు వ్యయం చేయనున్నారు. మొత్తం 11 శాఖల్లో 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. మిగతా 9లో..

## బనకచర్లపై చర్చించారు

చేతలకు పొంతన ఉండదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారని ఆయన చెప్పారు. "రాష్ట్రంలో భాజపా, తెదేపా రిమోట్ పాలన కొనసాగుతోంది. కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని సీఎం రేవంత్ చెప్పడం సబబు కాదు. బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పు.. సీఎం పాల్గొనడం మరో తప్పు. 4 కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం ఎలా నిర్వహిస్తారు? రాష్ట్రానికి ద్రోహం చేస్తూ సీఎం మరణశాసనం రాశారు. బేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## బీసీ రిజర్వేషన్లలో తెలంగాణ రోల్ మోడల్

చట్ట, రాజకీయ పరంగా ఎక్కడ ఇబ్బందులు కాకుండా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారని అన్నారు. తెలంగాణ లో అగ్రవర్ణ నాయకులు అయినా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి రిజర్వేషన్లు అంశంలో తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ పై మాట్లాడిన సందర్భంగా సభ హర్షధ్వానాలతో ధన్యవాదాలు తెలిపింది ఏఐసీసీ అగ్రనేత భారత్ జోడో యాత్రలో బిసి రోజా6 అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారని అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి కమిషన్, బిసి డెడికేషన్ కమిషన్, కులఘనన, అసెంబ్లీలో బిల్లు, గవర్నర్ కు ఆర్డినెన్సును ఇలా అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారని వివరించారు. రాహుల్ గాంధీగారికి రేవంత్ రెడ్డి, తాను బిసిల రిజర్వేషన్ల గురించి సైనికులాగా పని చేస్తున్నామని అన్నారు.ఇంతటి విప్లవాత్మక చారిత్రక ఘట్టంలో తనను అగ్రభాగ స్వామ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా బిసి రిజర్వేషన్లు కార్యక్రమంలో తెలంగాణ రోల్ మోడల్ గా నిలవడం గర్వంగా ఉందని అన్నారు. అక్టోబరు నెలలో ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించనున్నామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ యాదవ్, మాజీ ఎంపీ లు వి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## సవాళ్లు విసరడం...పారిపోవడం సీఎంకు అలవాటే..

రాజ్యాంగం రాసినప్పుడు రేవంత్ రెడ్డి లాంటి దొంగలు, లంగలు పదవుల్లోకి వస్తారని ఊహించలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకే ఐదు సంవత్సరాల పాటు– పదవిలో ఉండే విధంగా రాజ్యాంగం రాశారని అన్నారు. లేకుంటే దేశంలో రేవంత్ లాంటి మోసాగాళ్లను రీకాల్ చేసే వ్యవస్థను కూడా ప్రవేశపెట్టేవారని అన్నారు. రేవంత్‌కు దమ్ముంటే.. కూలిందంటున్న మేడిగడ్డ బ్యారేజి మీదనే చర్చ పెడదాం అని.. చర్చకు.. రా అని సవాలు విసిరి చర్చకు వెళితే రేవంత్ రెడ్డి పారిపోయిండని చురకలు అంటించారు. చర్చకు వస్తవా అని పిలిచి పారిపోయిన పిరికి సన్నాసి రేవంత్ రెడ్డి అని సెటైర్లు వేశారు. మరొకసారి నాగార్జునసాగర్ కట్టపైన చర్చకు వస్తావా అని సవాల్ విసిరిండని.. రేవంత్ రెడ్డికి తెలివిలేక కాళేశ్వరాన్ని కులేశ్వరం అంటు–న్నారని ఫైరయ్యారు. నాగార్జునసాగర్ కట్టమీద కాదు.. కానీ మేడిగడ్డ బ్యారేజ్ మీద చర్చకు రావాలని సవాలు విసిరారు. తుంగతుర్తి సూర్యాపేట నియోజకవర్గం చివరి మడి వరకు నిలిచిన నాయకుడు కేసీఆర్ అన్న సంగతి రేవంత్‌కు తెలుసునని కేటీ–ఆర్ అన్నారు. ముఖ్యమంత్రి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని కేటీ–ఆర్ ఫైరయ్యారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే.. సీఎం రంకెలు వేస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఏం పీక్కుంటారో పీక్కోండని సీఎం పదేపదే అంటున్నారని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఏం పీక్కుంటారో చూపిస్తారని కేటీఆర్ చురకలంటించారు. రాజకీయాల్లో తిట్లు–వాడడం తమకు ఇష్టం లేదని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డికి ఆయన భాషలో చెప్తేనే అర్థమవుతుందని మాట్లాడాల్సి వస్తుందని.. కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్నట్లు– మేము కూడా తిట్లు వాడక తప్పడం లేదని వ్యాఖ్యలు చేశారు.

## పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ అరెస్టు

ఏడాదిపాటు పొడిగిచింది. కాగా సొంత శాఖలోని డీఈ తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. కనకరత్నం రూ.50వేలు లంచం అడిగారు.దీంతో డీఈ ఏసీబీని ఆశ్రయించారు. దీంతో కనకరత్నం లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచాయతీ రాజ్ కార్యాలయంతోపాటు కేపీహెచ్‌బీ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. అనంతరం కనకరత్నంను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

## సిరియా సైనిక ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

మైనారిటీ షియా తెగకు చెందిన డ్రూజ్ మిలీషియాకు, సున్నీ బెడ్విన్ తెగలకు మధ్య ఆదివారం తొలుత ఈ సాయుధ ఘర్షణ ప్రారంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది డ్రూజ్ జాతీయులు ఉండగా అందులో సగం మంది సిరియాలో ఉన్నారు. మిగిలినవారు ఇజ్రాయెల్, లెబనాన్‌లలో ఉన్నారు. డ్రూజ్ జాతికి చెందిన ఒక కూరగాయల వ్యాపారిని కొందరు సాయుధులు దోచుకోవడంతో సమస్య ప్రారంభమైందని అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ తెలిపింది.సిరియాలో గత ఏడాది అహ్మద్ అల్ షరా (అబు మహమ్మద్ అల్ జులానీ) నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. తమ దేశంలోని అన్ని వర్గాలను పరిరక్షిస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. కానీ దానిని నిలుపుకోవడంలో విఫలమవుతున్నారు.

# జలవివాదాల పరిష్కారానికి కమిటీ



మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.. ఈ సమావేశానికి రెండు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. నీటిపా రుదల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు.. గోదావరి, కృష్ణా జలాల వినియో గం, ప్రాజెక్టుల నిర్మాణాలపై చర్చ సాగింది.. గంటన్నరపాటు సాగిన ఈ భేటీ ముగిసిన తర్వాత ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. సమావేశంలో జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.. ఇచ్చిపుచ్చుకునే వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు మంత్రి నిమ్మల.. తెలుగు ప్రజలంతా ఒక్కటే అనే స్ఫూర్తితో ఈ రోజు చర్చలు జరిగాయి. మూడు అంశాలపై నిర్ణయాలు జరిగాయి.. రిజర్వాయర్ల ద్వారా బయటకు వెళ్లే నీటిని లెక్కలు వేసేందుకు టెలిమెట్రీ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు.. శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు ప్రజల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. శ్రీశైలం ప్రాజెక్ట్ కు మరమ్మత్తులు సత్వరమే చేపట్టాలని నిర్ణయించారు.. గోదావరి నదీ నిర్వహణ బోర్డు కార్యాలయం హైదరాబాద్ లో, కృష్ణా నదీ నిర్వహణ బోర్డు కార్యాలయం అమరావతిలో పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు– పేర్కొన్నారు నిమ్మల రామానాయుడు.. ఇక, తెలంగాణ ప్రస్తావించిన పలు అంశాల్లో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి.. కాబట్టి, ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం నేతృత్వంలో ఇరు రాష్ట్రాలకు చెందిన సాంకేతిక నిపుణులు, పాలనాపరమైన అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ– ఏర్పాటు– చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్ట్ తో పాటు, ఇతర అన్ని అంశాలను కూడా ఈ ప్రత్యేక కమిటీ– పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది. జాప్యం లేకుండా, వచ్చే సోమవారం కల్లా ఈ కమిటీ– ఏర్పాటు– చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నట్టు– తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై నిపుణులతో కమిటీ– ఏర్పాటు– చేస్తామని కేంద్రం జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ కమిటీని సోమవారం లోపు ఏర్పాటు చేస్తామన్నా రన్నారు. ఈ కమిటీలో కేంద్ర, రాష్ట్రాల నిపుణులు ఉంటారని చెప్పారన్నారు. ఈ సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందన్నారు. ఇరు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో చర్చలు జరిగాయని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆ క్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు, రక్షణ చర్యలపై ఈ సందర్భంగా చర్చించామన్నారు. నిపుణుల కమిటీ– నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారని పేర్కొన్నారు. కృష్ణా నది బోర్డు అమరావతిలో ఉండేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే గోదావరి బోర్డు తెలంగాణలో ఏర్పాటు– చేసేలా నిర్ణయించామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్ట్ మరమ్మతులు చేసేందుకు ఏపీ అంగీకారించిదన్నారు. అలాగే –టె–లిమెట్రీ– ఏర్పాటు–కు సైతం అంగీకరించామని మంత్రి నిమ్మల వివరించారు. తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై సుమారు గంటన్నర పాటు– ఈ సమావేశం జరిగింది. అయితే ఈ సమావేశంలో పోలవరం– బనకచర్ల ప్రాజెక్ట్ ఆవశ్యతను సీఎం చంద్రబాబు వివరించినట్లు– తెలుస్తుంది. గోదావరి నుంచి సముద్రంలోకి ఏటా 2 వేల నుంచి 3 వేల టీ–ఎంసీల నీరు సముద్రంలో కలుస్తాయని తెలిపారు. ఈ నీటిని బనకచర్ల ద్వారా రాయలసీమకు మళ్లిస్తే ఆ ప్రాంతానికి లబ్ది చేకూరుతోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా ఈ భేటీలో వివరించారని సమాచారం.సోదాహరణగా ఈ భేటీలో వివరించారని సమాచారం.అలాగే అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను సైతం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన అందజేశారు. ఏ ఒక్క రాష్ట్రానికి ఇబ్బంది కలిగించకుండా.. సముద్రంలోకి వెళ్లే గోదావరి మిగులు జలాలను మాత్రమే వినియోగించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేసినట్లు– తెలుస్తుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలోని 13 అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్ట్‌ల విషయంలో సీఎం చంద్రబాబు ఎటువంటి అభ్యంతరం తెలపలేదని తెలుస్తుంది.



## వివాదాలను నెలరోజుల్లో కొలిక్కితేవాలి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రెండు తెలుగు రాష్ట్రాల నడుమ జల వివాదాలపై దిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సారధ్యంలో ఇద్దరు సీఎంలతో గంటన్నరపాటు కీలక సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏపీ నుంచి బనకచర్ల కడతామన్న ప్రతిపాదన భేటీలో రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని అన్నారు. కృష్ణాజలాల వినియోగంపై నిపుణులు, అధికారులతో త్వరలో కమిటీ ఏర్పాటు చేసి దాని నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందన్న సీఎం నదీజలాల సమస్యలపై కమిటీ చర్చించాక తదుపరి కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో తెలంగాణ హక్కులను ఏపీకి ధారాదత్తం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం తాము చేస్తున్నామని, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగినట్లు తెలిపారు. అన్నీ అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేమని కుండబద్దలుకొట్టారు.ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్ర మాత్రమే పోషించిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్రం ఎవరి వైపు కూడా మాట్లాడలేదని, ఈ భేటీ కచ్చితంగా తెలంగాణ విజయంగానే భావిస్తున్నామని అభిప్రాయపడ్డారు. టెలిమెట్రీల ఏర్పాటు, శ్రీశైలం మరమ్మత్తులకు ఏపీ అంగీకరించడం తమ విజయమే అని చెప్పారు. కృష్ణా జలాల వినియోగంపై కమిటీ ఏర్పాటుకు ఏపీ అంగీకరించడం కూడా తెలంగాణ విజయమేనని అన్నారు. ఈ కీలక భేటీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ జడ్జి తరహా పాత్ర పోషించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం అలసత్వం : తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడతూ కృష్ణా నదీజలాల వాడకం లెక్కలపై కొన్ని సందేహాలు ఉన్నాయని, టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. టెలిమెట్రీల ఏర్పాటుపై గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించిందని, ప్రస్తుతం అన్ని పాయింట్లలో యుద్ధప్రాతిపదికన టెలిమెట్రీలు ఏర్పాటుకు ఇరు రాష్ట్రాలు అంగీకరించాయని తెలిపారు. టెలిమెట్రీల ఏర్పాటుకు ఖర్చును తాము భరిస్తామని చెప్పిన ఉత్తమ్ తెలంగాణ సూచనల మేరకు శ్రీశైలం డ్యామ్ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు వివరించారు.విభజన చట్టం ప్రకారం శ్రీశైలం డ్యామ్ మరమ్మత్తుల పూర్తి బాధ్యత ఏపీ ప్రభుత్వానిదేనని, కేంద్రం సూచనల మేరకు శ్రీశైలం మరమ్మత్తులకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించినట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు. విభజన చట్టం ప్రకారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును అమరావతిలో ఏర్పాటు చేసుకునేందుకు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించారు.కృష్ణాజలాల వినియోగంపై నిపుణులు, అధికారులతో కమిటీ ఏర్పాటు వారంలోగా పూర్తవుతుందని తెలిపారు. నిపుణులు, అధికారుల కమిటీ నెల రోజుల్లో నివేదిక ఇస్తుందని వెల్లడించారు. దిల్లీలోని లీ మెరిడియన్ హెటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఎంపీలు సురేశ్ కుమార్ షెట్కర్, రఘువీర్ రెడ్డి, వంశీకృష్ణ, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురామ్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ పాల్గొన్నారు.

## నిమిష ప్రియకు శిక్ష పడాల్సిందే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. నేడు అమలుకావాల్సిన ఆమె మరణ శిక్షను యెమెన్ ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేయడంతో కాస్త ఊరట లభించింది. అయితే మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టుబడుతోంది.నేరానికి క్షమాపణ ఉండదని మృతుడు సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహది స్పష్టంచేశారు. ఆమెకు శిక్ష పడాల్సిందేనని, బ్లడ్‌మనీకి అంగీకరించబోమని వెల్లడించారు. శిక్ష అమలు వాయిదా అనంతరం అతడు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. "మధ్యవర్తిత్వం, సయోధ్య కోసం ప్రస్తుతం జరుగుతోన్న ప్రయత్నాలు కొత్తవేమీ కావు. మాకు ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. అలాగే మేం ఎదుర్కొన్న ఒత్తిళ్లు మా అభిప్రాయాన్ని మార్చవు. ఈ వాయిదాను మేం ఊహించలేదు. డబ్బుతో మనిషి ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందే" అని అర్థం వచ్చేలా పోస్టులో రాసుకొచ్చారు. అలాగే దోషిని బాధితురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేయొద్దని వ్యాఖ్యానించారు.

## చల్లటి కబురు..

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రెండు రోజులపాటు భారీ వర్షాలు ఉంటాయని తెలిపింది. వర్షాలు లేక రైతాంగం ఇప్పటికే తీవ్ర అవస్థలు పడుతున్న సంగతి తెలిసిందే.మరోవైపు ఎండలు, ఉక్కపోతతో సామాన్య ప్రజానీకం సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో గురువారం నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని తెలిపింది. అలాగే.. ఎల్లుండి మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్ష పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

## మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో బ్రతకాలి

అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని అన్నారు.కోటీ మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయల మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మొదటి సంవత్సరం 21 వేల 670 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించామని, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందిస్తామని అన్నారు.మహిళల ఆశీర్వాదం ఉంటే ప్రభుత్వం చల్లగా ఉంటుందని అన్నారు. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల జమ చేశామని అన్నారు. రైతు భరోసా క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచి 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల జమ చేశామని, రైతు బీమా కు 3 వేల కోట్ల అందించామని అన్నారు. గతంలో అందించిన మంచి కార్యక్రమాలను రెట్టింపు సహాయం ప్రస్తుతం అందిస్తున్నామని అన్నారు.పామా యిల్ పంట పెద్దపెల్లి జిల్లాలో విస్తారంగా పండించాలని, ఎకరానికి నాలుగు సంవత్సరాలలో 51 వేల రూపాయల సబ్సిడీ అందిస్తామని అన్నారు. మొదటి మూడు సంవత్సరాలు అంతర్ పంటలతో ఆదాయం లభిస్తుందని, పామాయిల్ పంటకు మార్కెట్ సమస్య, కోతుల బెడద, కార్మికుల సమస్య ఉండదని అన్నారు. 25 వేల వరకు పామాయిల్ పంటకు ధర లభించేలా కృషి చేస్తున్నామని అన్నారు.పెద్దపల్లిలో తిరుమాలయ కంపెనీ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తుందని అన్నారు. రాబోయే నెల రోజులలో సిద్దిపేటలో పెద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబరాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు 26 వేల కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని అన్నారు.మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించడం తో పాటు లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళల ఆదాయం పెంచెందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, ఆర్టిసి కు అద్దె బస్సులు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు.మంథని కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో మహిళా సంఘాల ద్వారా మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళల ద్వారా రైతులు పండించిన పంటను మద్దతు ధరతో కొనుగోలు చేశామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు పెద్దపల్లి పట్టణంలో వీ – హబ్ మంజూరు చేశామని, మరో నెల రోజుల్లో దీనిని ప్రారంభిస్తామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వంతో విధానపరమైన చర్చలు జరిపి గోదావరి, కృష్ణ నది జలాల్లో మన హక్కులు కాపాడేందుకు, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, అందుకున్న విజయం అందరికి పంచుద్దామనే నినాదంతో మహిళా సంఘాలలో నూతన సభ్యులను చేర్చాలని, 60 సంవత్సరాల దాటిన వారు ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. .పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ,వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మరోసారి ప్రవేశపెట్టిందని, మహిళల చేతిలో డబ్బులు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు.లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించ లేదని అన్నారు. 32 మంది సంఘ సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా క్రింద 41 లక్షల 69 వేల 873 రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు నాణ్యమైన చీరలు అందించాలని అన్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలో 4521 మహిళా సంఘాలకు 4 కోట్ల 94 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల క్రింద పంపిణీ చేస్తున్నామని అన్నారు. నేడు మహిళా సంఘాలతో బ్యాంకు లింకేజీ కింద 56 కోట్ల 50 లక్షల రూపాయలు, 514 మహిళా సంఘాలకు స్త్రీ నిధి కింద 11 కోట్ల 75 లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.పెద్దపల్లి ఎలిగేడు, జూలపల్లి, ఓదెల , సుల్తానాబాద్ మండల సమాఖ్యల ద్వారా ఆర్టీసీ సంస్థకు ఏర్పాటు చేసిన అద్దె బస్సుల మొదటి నెల ఆదాయం 3 లక్షల 47 వేల 340 రూపాయలు పంపిణీ చేస్తున్నామని అన్నారు.రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. మహిళలే నేరుగా నేడు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేస్తూ 10 మందికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు పి.వేణు, జే. అరుణ శ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, జెడ్పీ సిఈఓ నరేందర్, డిఆర్డిఓ ఎం. కాళిందిని, డిపిఓ వీర బుచ్చయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారీ, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రష్యాతో వ్యాపారం చేస్తే జాగ్రత్త!


**- భారత్,చైనాలకు 'నాటో' హెచ్చరిక**

**- 100 శాతం సుంకం విధిస్తామని వెల్లడి**



**వాషింగ్టన్(జనంసాక్షి):**ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేలా అమెరికా ప్రయత్నిస్తుంది. అందులోభాగంగా ఆ దేశంతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడింది. ఈ క్రమంలో మాస్కో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం సుంకం విధిస్తామని భారత్‌తో సహా చైనా, బ్రెజిల్ దేశాలను నాటో హెచ్చరించింది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె అమెరికా సెనెటర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు ఎవరైనా రష్యాతో వ్యాపారం చేస్తూ.. వారి నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తాం. ఆయా దేశాలపై 100 శాతం సుంకం విధిస్తాం. మాస్కోలోని ఆ వ్యక్తి (వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశిస్తూ) శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. మా పరిణామాలు ఈ దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. కాబట్టి వ్లాదిమిర్ పుతిన్‌కు వెంటనే ఫోన్ చేసి శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని ఒత్తిడి తీసుకురండి. లేకుంటే మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయి' అని హెచ్చరికలు చేశారు. ఈసందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌కు ఎయిర్‌డిఫెన్స్‌లు మాత్రమే కాకుండా క్షిపణులు భారీగా సరఫరా చేయనున్నారని వెల్లడించారు. ఇక, రష్యాపై ట్రంప్ తీసుకుంటున్న చర్యలను యూఎస్ రిపబ్లికన్ సెనెటర్ థామ్ టిల్లిస్ ప్రశంసించారు. కానీ, 50 రోజల వరకు సమయం ఇవ్వడం తనను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఈ సమయంలో పుతిన్ యుద్ధంలో గెలవడానికి ప్రయత్నిస్తారన్నారు. హత్యలు చేసి, మరింత భూభాగాన్ని కాజేసి ఆ తర్వాత శాంతి చర్చలకు వచ్చేందుకు ముందుకొస్తారన్నారు. ఇదిలాఉండగా.. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వ్యవహారంలో రష్యా వైఖరిపై ట్రంప్ సీరియస్‌గా ఉన్నారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు 50 రోజుల్లోపు ఒప్పందం కుదుర్చుకోకపోతే పెద్దఎత్తున టారిఫ్‌లు విధిస్తామని మాస్కోను హెచ్చిరించారు. అయితే, ఈ బెదిరింపులను రష్యా కొట్టిపారేసింది. అదనపు ఆంక్షలను ఎదుర్కొనేందుకు తాము సన్నద్ధంగా ఉన్నట్లు ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి సెర్గెయ్ లావ్రోవ్ పేర్కొన్నారు.

## నేటి యుద్ధాలు గెలవాలంటే టెక్నాలజీని మెరుగుపరుచుకోవాలి



**కీలకమైన సాంకేతికత కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి: సీడీఎస్ అనిల్ చౌహాన్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్ తన రక్షణ సామర్థ్యాలను తక్షణం మెరుగుపరుచుకోవాల్సి ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. రేపటి టెక్నాలజీని వినియోగించి ఇవాళ యుద్ధరంగంలో పోరాడాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. అలాంటి సమయంలో నిన్నటి ఆయుధాలతో నేడు యుద్ధం చేసి జయించలేమని వ్యాఖ్యానించారు. బుధవారం దిల్లీలో జరిగిన ఒక వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు."మన వ్యూహాత్మక మిషన్లకు కీలకమైన సాంకేతికత కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. దిగుమతి చేసుకున్న టెక్నాలజీపై ఆధారపడటం వల్ల మన సంసిద్ధత దెబ్బతింటుంది" అని స్వదేశీ సాంకేతికతను వేగంగా అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను చౌహాన్ మరోసారి గుర్తుచేశారు. ఇక ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ప్రయోగించిన డ్రోన్లు, ఆయుధాలను సమర్థవంతంగా నిర్వీర్యం చేశామని, వాటివల్ల భారత సైన్యం, పౌరులకు చెందిన మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం కలగలేదని చెప్పారు.ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆత్మనిర్భర్ భారత్ గురించి చౌహాన్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ సొంత రక్షణవ్యవస్థలు బలంగా లేకపోవడంతో చైనాపై ఆధారపడింది. భారత్ ఆకాశ్ వంటి స్వదేశీ వ్యవస్థలనే ఉపయోగించింది. స్పేస్, శాటిలైట్ ఇంటెలిజెన్స్ అందరికీ అందుబాటులో ఉంది. మేము మా సొంత శాటిలైట్ వనరులతో సమర్థవంతంగా ఉగ్రశిబిరాలపై దాడులు నిర్వహించాం. ఆ సమయంలో చైనా లేదా విదేశీ శాటిలైట్ చిత్రాలపై దాయాది దేశం ఆధారప డింది" అని అన్నారు. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెద్ద పరిశ్రమలు ఇప్పుడు రక్షణ వ్యవస్థలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు ."యుద్ధమంటూ వచ్చినప్పుడు నష్టం జరుగుతుంది. అయితే, నష్ట తీవ్రత కంటే.. ప్రత్యర్థులపై మన స్పందన ఎలా ఉందనేది ముఖ్యమని అన్నారు.

# స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్యం కోసం సీఎంతో చర్చిస్తా

**సాధన కమిటీకి హామీ ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్ (జనంసాక్షి) : స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్యం కోసం వికలాంగులకు ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలోనే ప్రాతినిధ్యం కల్పించేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిపెస్టో కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబును స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ ప్రతినిధి బృందం కలసి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వంకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా రాష్ట్రంలో 25వేల మంది వికలాంగులకు ప్రజాప్రతినిధులుగా అవకాశం దక్కుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాధన కమిటీ చెప్పిన విషయాలను చాలా సానుకూలంగా విన్న మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబును కల్సిన ప్రతినిధి బృదంలో ప్రాతినిధ్య సాధన కమిటీ చైర్మన్ ఎం.డి. షఫీ అహ్మద్ ఖాన్, సలహా దారులు తుడుం రాజేందర్, వైస్- చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు శబరి చావ్లా, నర్సింహులు, జిల్లా అధ్యక్షులు ఎం. మహేశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్. వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే భూకంపం సృష్టిస్తాం

**మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే భూకంపం సృష్టిస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్ లో బిసి లకు రిజర్వేషన్ అమలు కోసం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిసి లు అంతా ఒక్కతాటి పైకి వచ్చి మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కులాల వారీగా విడదీసి రాజకీయ లబ్ది పొందే కుట్రలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అమలుకు సాధ్యం కాని మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ డ్రామాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రులుఎన్టీ రామారావు, రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్లు తీర్మానం చేసి పంపినా అమలు కాలేదని వివరించారు. హడావుడిగా తప్పుల తడకగా కులగణన చేసి అసెంబ్లీలో బిల్లు పెట్టారని, బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిందని చెప్పారు. 9 వ షెడ్యూల్ లో చేర్చి పార్లమెంటు లో బిల్లు చేస్తేనే చట్టబద్ధత వస్తుందని తెలిసినా మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, బిల్లు చేసిన తర్వాత చెల్లుబాటు కాదని చట్టాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలలో తీర్మానాలు చేసిన కోర్టులు కొట్టివేశాయని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలను మూడు నెలల్లో నిర్వహించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఓడిపోతామనే భయంతో కొత్త డ్రామాలకు తెరతీశారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరాల్సిందేనని, లేదంటే మీకు అడ్రెస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. మేము యాచకులం కాదు... మా హక్కు మాకు కల్పించకుంటే మేము ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. బిసి లు ఎంతో చైతన్యం తో ఉన్నారని అన్నారు. రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించిన తర్వాత నే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# పోలీసు అధికారులపై తీవ్ర ఆరోపణలు

**తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఖమ్మం (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగంలోని భద్రాది-కొత్తగూడెం జిల్లాలో డీఎస్పీ షేక్ అబ్దుల్ రహమాన్, ఎస్ఎచ్ ఎం.కరుణాకర్లపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయని మొహమ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్ తెలిపారు. ఈ అధికారులు సీసీటీవీ ఫుటేజీని ఉద్దేశపూర్వకంగా దాచడం, డీఎస్పీ కార్యాలయంలో సీసీటీవీ కెమెరాలు లేకపోవడం, జీడీ ఎంట్రీ రికార్డులను ఫోర్జరీ చేయడం, సామాన్య పౌరులను బెదిరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, మొహమ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్ అనే వ్యక్తి ఈ అధికారులపై రెండవ సారి ఫిర్యాదు చేస్తూ, గత ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోవడం వల్ల అవినీతి మరింత పెరిగిందని ఆరోపించారు. డీఎస్పీ రహమాన్ "నీవు ఏమీ పీకలేవు రా. డిపార్ట్ మెంట్లో ఎవరికీ నన్ను తాకే ధైర్యం లేదు. నీవు ఏం చేయాలన్నా చెయ్యి - నా మాటలు గుర్తుంచుకో, ఒక రోజు నీపై రౌడీ షీట్ ఖచ్చితంగా తెరుస్తాను. గుర్తుంచుకో" ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది అధికార దుర్వినియోగానికి స్పష్టమైన ఉదాహరణగా, పోలీసు విభాగంపై ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని, డీఎస్పీ షేక్ అబ్దుల్ రహమాన్ మరియు ఎస్ఎస్ఓ ఎం. కరుణాకర్లను వెంటనే సస్పెండ్ చేసి, వారి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

21.08.2024 తేదీ జీడీ ఎంట్రీ రికార్డు ఫోరెన్సిక్ పరీక్ష నిర్వహించి, దాని ప్రామాణికతను నిర్ధారించాలని, కొత్తగూడెం-1 టౌన్ పోలీసు స్టేషన్లో మొబైల్ ఫోన్ల స్వాధీనాన్ని ధృవీకరించడానికి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాలని, 10.06.2024 నుండి 10.07.2024 వరకు కొత్తగూడెం-1 టౌన్ పోలీసు స్టేషన్లో సీసీటీవీ ఫుటేజీని ధృవీకరించిన రూపంలో అందించాలని ఆదేశించాలని, సర్క్యులర్ మెమోరాండం నం. 90/ **R-I-N-S/** 2019-20 ప్రకారం వివరణ ఇవ్వాలని, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాల విచారణ జరపాలని, డీఎస్పీ రహమాన్ బెదిరింపు వ్యాఖ్యలు, మొబైల్ ఫోన్ నిషేధంపై విచారణ జరపాలని కోరారు. ఈ లోపాలను సరిదిద్దేందుకు, పోలీసు అవినీతిని నిరోధించేం దుకు వ్యవస్థాగత సంస్కరణలను చేపట్టడానికి ప్రజలకు హామీ ఇవ్వాలని, ఈ ఫిర్యాదును 15 రోజుల్లో పరిష్కరించాలి, లేకపోతే ఫిర్యాదుదారు కోర్టు ద్వారా న్యాయపరమైన పోరాటం చేస్తారని, ఈ ఫిర్యాదు కేవలం ఒక వ్యక్తిగత గోడు కాదు ఇది న్యాయం, సమాజంలో పారదర్శకత కోసం పోరాడే ప్రతి పౌరుడి గొంతు, డీజీపీ కార్యాలయం ఈ అవినీతి చర్యలను ఎలా నిర్మూలిస్తుందో, ఎలాంటి సంస్కరణలు చేపడుతుందో చూడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

# రోడ్డుపక్కన పసికందు

**అక్కున చేర్చుకున్న గ్రామస్తులు**

జనగామ, జూలై16 (జనంసాక్షి) : జిల్లాలో ఓ దారుణ ఘటన చోటు-చేసుకుంది. కన్నపేగు బంధాన్ని తెంచుకుంటూ.. ఓ తల్లి రోడ్డు పక్కన పసికందును వదిలేసి వెళ్లిపోయింది. పసిబిడ్డ ఏడుపు విన్న స్థానికులు.. స్నానం పోసి అక్కున చేర్చుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆ బిడ్డ తల్లిదండ్రులు కనిపించలేదు. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముక్కు పచ్చలారని పసికందును బహిరంగ ప్రదేశంలో వదిలేసిన ఘటన జనగామ జిల్లాలో ఇప్పుడు కలకలం సృష్టించింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో రోడ్డుపై గుర్తుతెలియని మహిళ పసికందును వదిలేసి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున పసిబిడ్డ ఏడుపు వినిపిస్తుండటంతో.. సమీపంలోని స్థానికులు నిద్ర లేచి చూశారు. అప్పుడే పుట్టిన మగ శిశువు రోడ్డుపై గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. నడిరోడ్డుపై ముక్కు పచ్చలారని పసి కందును చూసి స్థానికులు చలించిపోయారు. గ్రామంలోని ఒక వృద్ధురాలు చిన్నారిని చేరదీసి.. స్నానం చేయించింది. ఖిలాషాపురం గ్రామస్తులు పసిబిడ్డ తల్లిదండ్రుల కోసం చుట్టుపక్కల అంతా వెతికినా లాభం లేకపోయింది. బిడ్డకు సంబంధించిన వారు ఎవరూ కనిపించకపోవడంతో గ్రామ పెద్దలు రఘునాథపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. పసిబిడ్డ తల్లిదండ్రుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చుట్టుపక్కల వారా? లేదా దూరం ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ వదిలారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తానికి ఈ ఘటన రఘునాథపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# రాజకీయ అవకాశం దక్కని కులాలకు పదవులు

**42శాతం రిజర్వేషన్లలో ఆయా కులాలకు పెద్దపీట**

**25వేల మంది బిసిలకు పదవులు దక్కే వరకు పోరాటం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత**



హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) : 25వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. 25వేల పదవుల్లో సగం మంది మన ఆడబిడ్డలకే అవకాశం దక్కుతుందని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇప్పటివరకు రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72కులాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశం అయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సర్పంచులు, ఎంపీపీలుగా ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని ఎన్నో కులాలు బీసీలలో ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో.. రాజకీయ అవకాశాలు దక్కని వారికి పదవులు దక్కేలా సబ్ కోటా ఇవ్వడమూ అంతే ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. అది కేంద్రం పరిధిలో ఉంటుందని, రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ కేబినెట్ చేసిన సవరణ తీర్మానం గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉందని వ్యాఖ్యానించారు. గవర్నర్ కేబినెట్ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసి గెజిట్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్ ఆర్డినెన్స్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ వేయకుంటే ఎవరైనా కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే ప్రమాదం ఉందన్నారు. ఆ అవకాశం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజర్వేషన్లను పెంచుతూ చట్ట సవరణ చేసే అధికారం కేంద్రం పరిధిలో ఉంటే.. ఉన్న రిజర్వేషన్లలో సబ్ కేటగరైజేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. రాజకీయ అవకాశాలు దక్కని కులాల నుంచి సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్ లు కావాలంటే సబ్ కేటగరైజేషన్ ఒక్కటే మార్గం అని చెప్పారు.

# దరఖాస్తులు పరిశీలించాక కొత్త కార్డులు

**ఆన్‌లైన్‌లో పరిశీలన అయ్యాక జారీ**




నిజామాబాద్, జూలై16 (జనంసాక్షి) : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 771 జారీ కానున్నాయి. పాత వాటితో పాటు, కొత్త కార్డుల్లో అదనంగా 1,73,388 మంది సభ్యులను చేర్చారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇది నిరంతర ప్రక్రియ. కొత్త కార్డుల పంపిణీ ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల తర్వాత లబ్ధిదారులకు ఇస్తాం. ఇప్పటికే పత్రాలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో వచ్చే అప్లికేషన్లను పరిశీలిస్తూ వెంటనే జారీ చేస్తున్నాం. ఇంకా జారీ చేస్తాం అని అన్నారు. నియోజకవర్గాల వారీగా మీటింగ్‌లు నిర్వహించి కార్డుల పంపిణీ చేసే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావాల్సి ఉందని చెబుతున్నారు. సీఎం సందేశంతో కూడిన లేఖలు ఇప్పటికే డీఎస్‌వో ఆఫీసులకు చేరాయి. కార్డులతోపాటు-, లబ్ధిదారుల సంఖ్య పెరిగిన దృష్ట్యా బియ్యం కోటా పెరగనుంది. ఈ నెలలో కొత్తగా జారీ అవుతున్న కార్డులు, కొత్త సభ్యులకు సెప్టెంబర్ నెలలో రేషన్ బియ్యం ఇస్తారు. ఇప్పటికే ఆగస్టు నెల వరకు 3 నెలల కోటాను జూన్ లోనే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్త కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ సర్కార్ కొత్తగా రేషన్ కార్డులతో పాటు-, ఇది వరకు ఉన్న కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు చేర్చే ప్రక్రియ చేపట్టింది. గ్రామాలు, టౌన్‌లలో ప్రజా పాలన మీటింగ్‌లు నిర్వహించి అప్లికేషన్లు స్వీకరించారు. దీంతో పాటే మీసేవలో అప్లికేషన్లు తీసుకున్నారు. గత కొన్ని నెలలుగా పాత రేషన్ కార్డుల్లో సభ్యులను చేర్చటం, కార్డుల జారీ ప్రక్రియ నిర్వహిస్తోంది. అప్లికేషన్లను వెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి ఆన్ లైన్‌లో ఎంట్రీ చేసి కార్డులు ఇస్తారు. ఇప్పటికే కొత్త సభ్యులను పాత కార్డుల్లో చేర్చిన వారికి కూడా బియ్యం వచ్చాయి. చాలా మంది కొన్నేళ్లుగా రేషన్ కార్డుల కోసం, కొత్త సభ్యులను చేర్చటం కోసం మీసేవాతో పాటు, ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామాలకు వచ్చే ప్రజాప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కూడా తమకు రేషన్ కార్డులు ఇప్పించాలని వినతిపత్రాలు ఇచ్చారు. కొత్త కార్డులను జారీ చేయడంతో పాటు-, మెంబర్లను చేర్చడం పై గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో ప్రతి జిల్లాలో వేలాది సంఖ్యలో అప్లికేషన్లు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్

**నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) : తెలంగాణ సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్ వ్యవహారంలో జూబ్లీహిల్స్ పోలీసులు తాజాగా నలుగురిని అరెస్టు చేశారు. జోగుల నరేష్, వెంకటేశ్, వంశీ, ఓంకార్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎవరూ సంప్రదించని 19 చెక్కుల సొమ్మును వీరు కాజేశారు. ఫోర్జరీ పత్రాలతో వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. నిందితుల్లో ఒకరైన జోగుల నరేశ్ మాజీ మంత్రి పేషీలో పనిచేసినట్లు తెలుస్తోంది. లబ్దిదారులకు చెందాల్సిన వీటిని వీరు తమ ఖాతాల్లోకి మళ్లించారు.

# ప్రభంజన్ మృతికి కెసిఆర్ సంతాపం



హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుడు, బహుజన మేధావి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మరణం పట్ల.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టు మేధావిగా, యాక్టివిస్ట్‌గా ప్రభంజన్ యాదవ్ చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. ఢిల్లీలో తాను చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రభంజన్ యాదవ్ ఉద్యమ నిబద్ధత గొప్పదని కేసీఆర్ అన్నారు. మహాత్మా ఫూలే, అంబేద్కర్ సామా జిక తాత్విక ఆలోచనా దృక్పథంతో, బీసీ కులాల హక్కులు, పురోగతి కోసం నిత్యం తపించే ప్రభంజన్ యాదవ్ మరణంతో తెలం గాణ ఒక గొప్ప తాత్వికున్ని, సామాజిక ఉద్య మకారున్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యుల కు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపా రు. ప్రభంజన్ మృతికి కెటిఆర్, హరీష్ రావు, కవిత కూడా సంతాపం తెలిపారు.

# ముఖం చాటేసిన వర్షాలు

**నైరుతి కానరాక రైతుల్లో ఆందోళన**

**వేసిన పంటలు దక్కుతాయా లేదా అన్న భయం**



వరంగల్, జూలై16 (జనంసాక్షి) : అనేక జిల్లాల్లో వర్షాలు రైతులను ఊరించి ఉసూరుమనిపించాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటుతున్నా, సరైన వానలు కురవకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మే నెల రెండో వారంలో కురిసిన వర్షాలతో అన్నదాతలు సంతోషపడ్డారు. కొందరు పత్తి విత్తనాలు నాటుకోగా, మరికొందరు వరి నారుమడులు దున్నుకున్నారు. ఇంకొందరు నేరుగా వడ్లు చల్లుకున్నారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలు తప్ప వానలు జోరందుకోవడం లేదు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లోటు- వర్షపాతమే నమోదైంది. వెదజల్లుడు పద్ధతిలో వేసిన వరి పొలాలతో పాటు, నారుమడులు, పత్తి మొక్కలు ఎండే పరిస్థితి వచ్చింది. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. బావి, బోర్లున్న రైతులు నీటి తడులు కట్టుకుంటుండగా, పూర్తిగా వర్షాధారంపైనే పంటలు వేసిన రైతులు మాత్రం చినుకు పడకపోతుందా అని ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. అనేక మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే తక్కువగా వర్షాలుపడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంత భిన్నమైన పరిస్థితి ఉంది. 23 మండలాలకు గాను 11 మండలాల్లో లోటు- వర్షపాతం నమోదైంది. నాలుగు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు పడగా, మిగిలిన 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. పినపాకలో 46.8 శాతం, కరకగూడెంలో 46.5 శాతం, దుమ్ముగూడెంలో 42.7, మణుగూరులో 34.7 శాతం లోటు- వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నారుమడులు ఎండిపోతున్న విషయాన్ని బాధిత రైతులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నాలుగు రోజుల కింద సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని విడుదల చేశారు. రెండ్రోజుల కింద పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని విడుదల చేశారు. నాలుగైదు రోజుల్లో ఆయకట్టు- మండలాల పరిధిలో ఈ ప్రాజెక్టుల ద్వారా విడుదల చేసిన నీరు పంటలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఆయకట్టు- లేని మండలాల్లో మాత్రం పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉండడంతో వానలు ముమ్మరంగా కురిస్తే తప్ప పంటలను దక్కించుకునే పరిస్థితి లేదు. సరైన వర్షాలు లేక మొలిచిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి.. మొదట వేసిన విత్తనాలు మొలవకపోవడంతో రెండోసారి వేయాల్సి వచ్చింది. వాన వస్తేనే పెట్టిన పెట్టుబడులైనా వస్తాయని ఆశ పడుతున్నారు. జులై నెల సగం గడిచినా ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో నారు ముదిరిపోతోంది. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే నారు పనికి రాకుండా పోతుంది. లక్షలాది మంది రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. లోటు వర్షపాతం నమోదు కావడం కలవరపెడుతోంది. ప్రస్తుత సీజన్‌లో లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా జులై రెండో వారం గడిచినా 20 శాతం పంటలు కూడా సాగులోకి రాలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి 3.6 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తే ప్రస్తుతం 30 వేల ఎకరాలలోపే సాగవుతుంది. 1.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా 60 వేల ఎకరాల్లో మాత్రమే గింజలు విత్తారు. మొక్కజొన్న 30 వేల ఎకరాల్లో అంచనా వేయగా 15 వేలు, కందులు 10 వేల ఎకరాల అంచనాల్లో 3 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. జిల్లాలో జులై రెండో వారం నాటికి 183.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 155.9 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతంలో 27.3 లోటు- వర్షపాతం నమోదైంది.

**CHANGE OF NAME**

I, Ganta Lalitha (before marriage) W/o. Late.M Venkat Swamy R/o 3-5-82/42, Rajmohalla, Narayanaguda, Hyderabad-29, Telangana, has changed name as Maddela Yashoda (after marriage) and both name is of one and the same person.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17 జూలై 2025

# అభివృద్ధి పేరిట విధ్వంసం



భారతదేశం, దాని విస్తృతమైన వ్యవసాయ భూములు, దట్టమైన అడవులు, సమృద్ధమైన సహజ వనరులతో, ఆర్థికాభివృద్ధి పేరుతో గత కొన్ని దశాబ్దాలుగా తీవ్రమైన భూస్వాధీన సమస్యలను ఎదుర్కొంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీలతో కలిసి, నగరాభివృద్ధి, ఫ్యాక్టరీలు,రోడ్ల నిర్మాణం, భూ గర్భ ఖనిజాల తవ్వకం, ఫార్మా ఇండస్ట్రీలు,అణు విద్యుత్ కేంద్రాల కోసం వ్యవసాయ,అటవీ భూములను స్వాధీనం చేసుకుంటున్నాయి. ఈ ప్రక్రియలో, రైతులు, గిరిజనులు, స్థానిక సముదాయాలను బలవంతంగా, భయపెట్టడం లేదా ప్రలోభపెట్టడం ద్వారా నిర్వాసి తులుగా మారుతున్నారు. ఈ "ల్యాండ్ పుల్లింగ్" లేదా "ల్యాండ్ గ్రాబింగ్" అనే పదాలు ఈ అన్యాయాన్ని సూచిస్తున్నాయి. ఇది పర్యావరణ విధ్వంసం, సామాజిక అసమానతలు, ఆర్థిక అస్థిరత్వాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. ఈ వ్యాసం భారతదేశం లోని వివిధ రాష్ట్రాలలో ఈ సమస్య యొక్క తీవ్రతను, గణాంకాలతో సహా, విమర్శనాత్మక దృక్కోణంతో విశ్లేషిస్తుంది.

**1.ఒడిశా:**

**ఖనిజ సంపద కోసం గిరిజనుల నిర్వాసిత**

ఒడిశా రాష్ట్రం ఖనిజ సంపదకు ప్రసిద్ధి చెందిన రాష్ట్రం. ఇక్కడ బొగ్గు, బాక్సైట్,ఇనుము ఖనిజాల తవ్వకం కోసం పెద్ద ఎత్తున భూమి స్వాధీనం జరుగుతోంది. 2000ల నుండి, వేదాంత, పోస్కో, అలాగే టాటా వంటి కార్పొరేట్ కంపెనీలు ఒడిశాలోని గిరిజన ప్రాంతాలలో భూములను స్వాధీనం చేసుకున్నాయి. ఉదాహరణకు, నియాంగిరి కొండలలో వేదాంత కంపెనీ బాక్సైట్ తవ్వకం కోసం దాదాపు 660 హెక్టార్ల అడవి భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించింది, దీనివల్ల డోంగ్రియా కొండ్ గిరిజనులు తమ జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. గణాంకాల ప్రకారం, ఒడిశాలో 2005 నుండి 2020 వరకు 1.5 లక్షల హెక్టార్ల భూమి ఖనిజ తవ్వకం అలాగే పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రక్రియలో, 40,000 కంటే ఎక్కువ గిరిజన కుటుంబాలు నిర్వాసితులుగా మారాయి. ఈ భూమి స్వాధీనం వల్ల అడవులు నాశనం కావడంతో పాటు, స్థానిక నీటి వనరులు కలుషితమయ్యాయి, ఇది పర్యావరణ విధ్వంసానికి దారితీసింది.

**2. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలో:**

**నగరాభివృద్ధి, ఫార్మా హబ్‌లు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఫార్మా ఇండస్ట్రీలు, నగరాభివృద్ధి కోసం భూమి స్వాధీనంలో ముందంజలో ఉన్నాయి. హైదరాబాద్‌లో ఫార్మా సిటీ ప్రాజెక్ట్ కోసం, 12,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసే ప్రతిపాదన ఉంది. దీనిలో ఎక్కువ భాగం సారవంతమైన వ్యవసాయ భూమి. ఈ ప్రాజెక్ట్ వల్ల వేలాది రైతులు తమ జీవనోపాధిని కోల్పోయారు. అదేవిధంగా, అమరావతి రాజధాని నగర ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో 33,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు,మరో 35000 ఎకరాల భూమి కావాలంటున్నారు. దీనిలో ఎక్కువ భాగం రైతుల నుండి బలవంతంగా తీసుకోబడింది. ఈ భూమి స్వాధీనం వల్ల స్థానిక రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు. ఉదాహరణకు, అమరావతి ప్రాజెక్ట్‌లో 29,000 మంది రైతులు తమ భూములను కోల్పోయారని ఒక నివేదిక తెలిపింది. ఈ ప్రాంతంలోని ఫార్మా ఇండస్ట్రీలు కాలుష్యానికి కారణమవుతున్నాయి. దీనివల్ల నీటి వనరులు,గాలి ,నేల కలుషితమవుతున్నాయి. హైదరాబాద్ సమీపంలోని పటాన్‌చెరు ప్రాంతంలో ఫార్మా కంపెనీల వల్ల నీటి కాలుష్యం 60 శాతం పెరిగిందని ఒక అధ్యయనం సూచిస్తోంది.గచ్చీబౌలీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో వుంది ఎకరాల్లో పచ్చని అడవిని వందల బుల్డోజర్లతో నరికేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూములు, చెరువులు,కుంటలు, కబ్జాలకు గురవుతున్నాయి.ఇతర మెట్రో రైలు మార్గం కోసం సుందరీకరణ పేరుతో ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటున్నారు.ప్రజల గోడు పట్టించుకొనే నాథుడే లేడు.

**3.ఛత్తీస్‌గఢ్:**

**బొగ్గు తవ్వకం, అడవుల నాశనం**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బొగ్గు తవ్వకం కోసం పెద్ద ఎత్తున భూమి స్వాధీనం జరుగుతోంది. హస్దేవ్ అరణ్య ప్రాంతంలో, 1,700 హెక్టార్ల అడవి భూమిని బొగ్గు తవ్వకం కోసం స్వాధీనం చేసుకున్నారు, దీనివల్ల 15,000 గిరిజనులు నిర్వాసితులుగా మారారు. ఈ ప్రాంతంలోని అడవులు, జీవవైవిధ్యం కోసం కీలకమైనవి, కానీ బొగ్గు తవ్వకం వల్ల 20% అడవులు నాశనమయ్యాయని ఒక నివేదిక తెలిపింది. ఈ భూమి స్వాధీనం వల్ల స్థానిక గిరిజనుల జీవనోపాధి, సాంస్కృతిక వారసత్వం తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదనంగా, బొగ్గు తవ్వకం వల్ల గాలి కాలుష్యం 40 శాతం పెరిగిందని, నీటి వనరులు కలుషితమైనట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**4.మహారాష్ట్ర:**

**నగరాభివృద్ధి, పర్యావరణ నాశనం**

మహారాష్ట్రలో ముంబై మరియు పుణె వంటి నగరాల విస్తరణ కోసం భూమి స్వాధీనం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. నవీ ముంబైలోని స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్.ఈ.జెడ్.) కోసం 10,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు, దీనిలో ఎక్కువ భాగం వ్యవసాయ భూమి. ఈ ప్రాజెక్ట్ వల్ల 12,000 రైతులు తమ జీవనోపాధిని కోల్పోయారు. అదనంగా, ఈ ప్రాంతంలోని మాంగ్రోవ్ అడవులు నాశనమవడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింది.

**5. తమిళనాడు:**

**అణు విద్యుత్ కేంద్రాలు, కాలుష్యం**

తమిళనాడులోని కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం కోసం 1,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు, దీనివల్ల స్థానిక మత్స్య కారులు మరియు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాజెక్ట్ వల్ల సముద్ర జీవవైవిధ్యం దెబ్బతినడంతో పాటు, రేడియేషన్ భయం స్థానికులలో ఆందోళన కలిగిస్తోంది. గణాంకాల ప్రకారం, కూడం కుళం ప్రాంతంలో 5,000 మత్స్యకార కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోయాయి.

**విమర్శనాత్మక పరిశీలన:**

ఈ భూమి స్వాధీనం, ల్యాండ్ గ్రాబింగ్ ప్రక్రియలు ఆర్థికాభివృద్ధి పేరుతో జరుగుతున్నప్పటికీ, అవి సామాజిక, పర్యావరణ సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. మొదట, ఈ ప్రక్రియలో రైతులు, గిరిజనులు తమ జీవనోపాధిని కోల్పోతున్నారు, దీనివల్ల పేదరికం, అసమానతలు పెరుగుతున్నాయి. రెండవది, పర్యావరణ విధ్వంసం, అడవుల నాశనం, నీటి కాలుష్యం, గాలి కాలుష్యంజీవవైవిధ్యానికి మరియు మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తోంది. మూడవది, ఈ ప్రాజెక్టులు తరచూ స్థానిక సముదాయాల సమ్మతి లేకుండా బలవంతంగా అమలు చేయబడుతున్నాయి, ఇది మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తోంది.

ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు "ఆర్థికాభివృద్ధి"ని న్యాయంగా సమర్థిస్తున్నప్పటికీ, ఈ ప్రక్రియలు స్థానిక సముదాయాలకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నాయి. పర్యావరణ సమతుల్యత మరియు సామాజిక న్యాయం మధ్య సమతుల్యత సాధించడానికి, భూమి స్వాధీనం ప్రక్రియలో పారదర్శకత, స్థానికుల సమ్మతి, న్యాయమైన పరిహారం అవసరం.

భారతదేశంలో భూమి స్వాధీనం, ల్యాండ్ గ్రాబింగ్ సమస్యలు సామాజిక, ఆర్థిక, పర్యావరణ రంగాలలో తీవ్రమైన సవాళ్లను సృష్టిస్తున్నాయి. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలలో ఈ సమస్య యొక్క తీవ్రత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ అన్యాయాలను నివారించడానికి, ప్రభుత్వాలు స్థిరమైన అభివృద్ధి విధానాలను అనుసరించాలి, స్థానిక సముదాయాల హక్కులను గౌరవించాలి, పర్యావరణ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. లేనిపక్షంలో, ఈ విధ్వంసం భవిష్యత్తు తరాలకు తీరని నష్టాన్ని కలిగిస్తుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## ఆలోచనల్లోనే ఆనందం


మనిషి జీవితం సుఖ
దుఃఖాల నిలయం
జీవితం ఒక రంగుల
రాట్నం మనిషికి
కలిగే ఆనందం ఒక
వస్తువును
పొందినపుడో
చేసిన పనిలో
మంచి ఫలితం
వచ్చినపుడో
కలిగేది కాదు
ఆనందకర జీవితం
మన ఎంపికపై
ఆధారపడి ఉంటుంది
ఆనందంగా ఉండాలని
మనం కోరుకుంటే
అప్పుడు మాత్రమే
ఆనందగా జీవించగలం
మనిషి దగ్గర ఉన్న డబ్బు
విలాసవంతమైన
భవనాలు మనిషికి
గుర్తింపు తప్ప ఇవి
మనకు ఆనందాన్ని
కలిగించలేవు
సానుకూల ఆలోచనలు
సోషల్ లైఫ్ సామాజిక సేవ
ఆపన్నులను ఆదుకునేతత్వం
సాహానుభూత
ప్రోది చేసుకుంటూ
సాధారణ జీవితం
గడపండి
స్వర్గం ఎక్కడో లేదు
మనలోనే ఉంది
మన ఆలోచనలే
మన కర్త కర్మ క్రియ
సంతోషాన్ని వస్తువుల్లో
దేవుణ్ణి బాహ్యంలో
వెతుకుంటున్నాం
కోరుకునే ఆనందమైన
ఆరాధించే దైవమైన
ఎక్కడో లేదు మన
లోపలే ఉన్నాయని
గుర్తించాలి.
ప్రతి ప్రయత్నం ద్వారా
కొత్త విషయాన్ని
కనుక్కోవడానికి చేసే
ప్రయోగంగా భావించాలి
ప్రయోగం వవిఫలమైతె
లక్ష్యసాధనకు ఉపయోగపడే
విలువైన సమాచారంగా
భావించండి
వైఫల్యాలను అనుభవాలుగ
అనుభవాలను సమస్యలను
అధిగమించే సాధనాలుగా
ఉపయోగించండి
ముందుకు వెళ్ళడానికి
మనల్ని మనం మెరుగు
పరుచుకునే ప్రక్రియగా
భావించాలి
పనియే దైవంగా
కష్టాలను ఇష్టాలుగా
మార్చుకుని సవాళ్లను
ఎదుర్కోవాలి
పనిచేయడం పై శ్రద్ధ
పెట్టాలి ఫలితాలు ఎలా
ఉన్నా స్వీకరించాలి
అప్పుడు మాత్రమే
ప్రగతి పురోగతి సాధ్యమై
వృద్ధి అభివృద్ధి
సిద్ధిస్తుంది



నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత, ఉత్తమ ఆర్థికవేత్త అవార్డ్ గ్రహీత,
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక, మాజీ కరెస్పాండెంట్
జస్టిస్ కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ కుమారయ్య)
కరీంనగర్ 9440245771

## నిశ్శబ్దపు అలల మధ్య

మహాసముద్రపు మధ్యలో
నిలుచున్నాను
నన్ను ఒక్క నీటి చుక్క కూడా
తాకలేదు
నేనున్న చోటంతా,
పచ్చని గడ్డి మొలిచింది
ఆ గడ్డి చుట్టంతా,
పురిగొలిపిన అలలు అక్కడే
ఆగిపోయాయి
నన్నూ ఆ ప్రదేశాన్నీ
ఏమాత్రం
తడపలేకపోయాయి
అచ్చంగా నీ మోముపై
జారిన,
కన్నీటి రేఖలానే!



బాలాజీ పోతుల
8179283830
నారాయణఖేడ్


## ఇందుకేనా?

కాకికి కాకివల్ల
హాని లేదు!
కోతికి కోతివల్ల
హాని లేదు!
ఏ జాతికీ ఆ జాతివల్ల
హాని లేదు!
మనిషికి మనిషివల్ల
తీరని హాని!
అన్ని జాతుల్లో గొప్పది
మానవజాతి-ఇందుకేనా



తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# కార్పొరేట్ లాభాల కోసం.. గాజాలో మరణమృదంగం



ఏడాదిన్నరకు పైగానే గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతున్నది. ఇప్పటి వరకు 85 వేల టన్నుల బాంబులతో ఆ ప్రాంతాన్ని శిథిలాల కుప్పగా మార్చింది. 18 నెలల కాలంలోనే గాజాపై ఇజ్రాయెల్ జారవిడిచిన బాంబులు హిరోషిమాపై వేసిన అణుబాంబు శక్తి కంటే ఆరు రెట్లు ఎక్కువ. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 56 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా హెల్త్ మినిస్ట్రీ ప్రకటించింది. లక్షలాది మందికి గాయాలయ్యాయి. గాజా జనాభాలో సగం మంది నిర్వాసితులయ్యారు. వెస్ట్ బ్యాంక్ లో కూడా వెయ్యి మంది పాలస్తీనియన్లు మరణించారు. అక్రమ సెటిల్ మెంట్ కార్యకలాపాలు, హింస పెరిగాయి. ఈ చర్యలను ఇప్పటికే ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసీజే) ఆక్షేపించింది. దీన్ని జెనోసైడ్‌గా నిర్ధారించేందుకు అన్ని ఆధారాలున్నా యని చెప్పింది. అయితే ఈ మరణ మృదంగానికి, యుద్ధం దీర్ఘకా లం కొనసాగడానికి కారణాలను చెబు తూ 'ఫ్రం ఎకానమీ ఆఫ్ ఆక్యుపేషన్ టు ఎకానమీ ఆఫ్ జెనోసైడ్' పేరిట యూఎన్ స్పెషల్ రిపోర్టర్ ఫ్రాన్సెస్కా అల్బనీస్ యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు సమర్పించిన నివేదిక.. లాభాల కోసం కార్పొరేట్ కంపెనీలు చేసే దురాగతాలను మరోసారి ప్రపంచానికి తెలియజేసింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఐబీఎం వంటి ప్రసిద్ధ కంపెనీలు తమ ప్రయోజనాల కోసం గాజాలో జెనోసైడ్ కొనసాగేలా మద్దతుగా నిలుస్తున్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ సంస్థలు జెనోసైడ్, ఆక్యుపేషన్‌లో పాల్గొంటూ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంది.



**48 కార్పొరేట్ సంస్థలు..**

గాజా సంఘర్షణలో 48కి పైగా కార్పొరేట్ సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంటున్నట్లు 'ఫ్రం ఎకానమీ ఆఫ్ ఆక్యుపేషన్ టు ఎకానమీ ఆఫ్ జెనోసైడ్' నివేదిక పేర్కొంది. ఇందులో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఐబీఎం, పాలంటిర్ టెక్నాలజీస్, లాక్‌హీడ్ మార్టిన్, ఎల్బిట్ సిస్టమ్స్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ఉండడం గమనార్హం. ఈ నివేదిక ప్రకారం 2023 నుంచి టెల్ అవీవ్ స్టాక్ ఎక్స్ చేంజ్ 213 శాతం పెరిగి, 225.7 బిలియన్ డాలర్ల మార్కెట్ లాభాలను సాధించింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐకు డిమాండ్ పెరగడంతో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు లాభాలు పొందుతున్నాయి. 2023 నుండి ఇజ్రాయెల్ సైనిక వ్యయం 65% పెరిగి 46.5 బిలియన్ డాలర్లకు చేరడంతో ఆయుధ సంస్థలు సైతం లాభాల్లో నడుస్తున్నాయి.

**కార్పొరేట్ టెక్ కంపెనీలకు లాభాలు ఇలా..**

ఇజ్రాయెల్ సైన్యం గాజాలో నిఘా, టార్గెటింగ్ కోసం మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ సేవలను వినియోగిస్తున్నది. 2023 అక్టోబర్ నుండి 2024 మార్చి వరకు, అజూర్ ఏఐ సేవల వినియోగం 64 రెట్లు, స్టోరేజ్ సేవలు 60 శాతం పెరిగినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తున్నది. దీంతో 2025 మొదటి త్రైమాసికంలో మైక్రోసాఫ్ట్ 70 బిలియన్ డాలర్ల ఆదాయంతో 18 శాతం లాభాల పెరుగుదలను నమోదు చేసిందని ఫ్రాన్సెస్కా అల్బనీస్ నివేదిక పేర్కొంది. ఇజ్రాయెల్ ప్రభుత్వానికి క్లౌడ్ సేవలు అందిస్తున్న గూగుల్ క్లౌడ్ 2024 చివరి త్రైమాసికంలో 12 బిలియన్ డాలర్ల ఆదాయంతో 30 శాతం పెరుగుదలను, అమెజాన్ వెబ్ సర్వీసెస్ 28 బిలియన్ డాలర్ల ఆదాయంతో 19 శాతం పెరుగుదలను సాధించాయని నివేదికలో పొందుపరిచారు. పాలంటీర్ టెక్నాలజీస్, ఐబీఎం వంటి కంపెనీలు సైతం వివిధ సేవలు అందిస్తూ లాభాలను ఆర్జిస్తున్నట్లు తెలుస్తున్నది.

**ఇతర కార్పొరేట్ కంపెనీలకు ఇలా..**

ఎల్బిట్ సిస్టమ్స్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ యుద్ధం కోసం ఇజ్రాయెల్ కు డ్రోన్లు, ఆయుధాలను సరఫరా చేస్తూ గణనీయమైన లాభాలు ఆర్జిస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎల్బిట్ సిస్టమ్స్ లాభాలు 18.7 శాతం పెరిగాయి. ఎఫ్-35 ఫైటర్ జెట్లను సరఫరా చేసే లాక్‌హీడ్ మార్టిన్ సైతం లాభాల్లో ఉన్నది. గాజా, వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్ ఇళ్లు, మసీదులు, ఇతర మౌలిక సదుపాయాలను కూల్చివేయడానికి క్యాటర్ పిల్లర్, వోల్వో వంటి కంపెనీలు భారీ యంత్రాలను సరఫరా చేస్తున్నాయి. బ్లాక్‌రాక్, వాన్ గార్డ్ వంటి సంస్థలు.. మైక్రోసాఫ్ట్, అమెజాన్, పాలంటిర్, లాక్‌హీడ్ మార్టిన్ లలో పెట్టుబడులు పెడుతూ ఈ విధ్వంసంలో పరోక్షంగా పాల్గొంటున్నాయి.

**కార్పొరేట్ కంపెనీలపై ఒత్తిడి కోసం..**

ఈ నివేదికను ఇజ్రాయెల్, అమెరికా తిరస్కరించాయి. ఫ్రాన్సెస్కా అల్బనీస్ ను తొలగించాలని యూఎస్ సెక్రెటరీ జనరల్ ను కోరాయి. అయితే ఇజ్రాయెల్ తో వ్యాపార సంబంధాలను నిలిపివేయాలని కార్పొరేట్ కంపెనీలకు ఫ్రాన్సెస్కా అల్బనీస్ సూచించారు. బీడీఎస్ (బైకాట్, డివెస్ట్‌మెంట్, శాంక్షన్స్) ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు ఆయా కార్పొరేట్ కంపెనీల ఉత్పత్తులను బహిష్కరించాలని ఆమె పిలుపునిచ్చారు.





మహమ్మద్ ఆరిఫ్
సీనియర్ జర్నలిస్ట్
7013147990

మొన్న సంధ్య, నిన్న తనుషా మహాలక్ష్మి, నవీంద్ర..

# ఈ రోజెవరూ? రేపు ఎవరూ?





తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ, ముఖ్యంగా గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) వంటి ప్రభుత్వ విద్యా సంస్థలలో ఇటీవల జరుగుతున్న ఆత్మహత్యలు, అనారోగ్య సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సంఘటనలు విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ మాటల్లో చెప్పాలంటే, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్, బాలల హక్కుల కమిషన్ వంటి సంస్థలు కార్యాలయాలకే పరిమితం కాకుండా, విస్తృత పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. ఈ సంస్థలు చురుకుగా పనిచేస్తేనే విద్యార్థుల జీవితాలను కాపాడగలం.

ఇటీవల నల్గొండ జిల్లాలోని ముదిగొండ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో 35 మంది విద్యార్థులు ఆహార విషబాధతో బాధపడిన సంఘటన, వికారాబాద్‌లోని మర్పెల్లి కేజీబీవీలో విద్యార్థులు నాసిరకమైన ఆహారంపై నిరసన తెలిపిన ఘటనలు ఈ సమస్యల తీవ్రతను తెలియజేస్తున్నాయి. సూర్యాపేటలోని కేజీబీవీ హాస్టల్‌లో, తూప్రాన్‌పేటలోని బీసీ గురుకుల స్కూల్‌లో విద్యార్థుల ఆత్మహత్యలు, మంచిర్యాలలో ఒక విద్యార్థి ఆత్మహత్యాయత్నం వంటి ఘటనలు రాష్ట్ర విద్యా వ్యవస్థలోని లోపాలను బట్టబయలు చేశాయి. ఈ సంఘటనలు విద్యార్థులు మానసిక ఒత్తిడి, ఒంటరితనం, కఠినమైన హాస్టల్ నిబంధనలు, అసౌకర్య జీవన పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు సూచిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బాలల హక్కుల సంక్షేమ సంఘం సూచించినట్లు, ప్రతి మండలంలో ఇద్దరు కౌన్సెలర్లను నియమించి, విద్యార్థులకు నిరంతర కౌన్సెలింగ్ అందించడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చు. ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక స్థితిని పర్యవేక్షించి, కౌన్సెలర్లకు సమాచారం అందించాలి. విద్యార్థులను ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించడం వల్ల వారిలో సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సానుభూతితో వ్యవహరించాలి. సినిమాలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో కొంతమంది విద్యార్థులు ప్రేమ సంబంధాల్లో చిక్కుకుని మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సందర్భాల్లో షీ టీమ్స్‌తో సమన్వయం చేసుకొని, విద్యా సంస్థల పరిసరాల్లో భద్రతను బలోపేతం చేయాలి.

ప్రస్తుతం గురుకులాలు, కేజీబీవీ స్కూళ్లలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ తీవ్రంగా కొరవడినట్లు కనిపిస్తోంది. సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించడం, కలెక్టర్లను బాధ్యులను చేయడం లేదా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం సర్వసాధారణంగా మారింది. అయితే, కొద్ది రోజుల తర్వాత సమస్యలు యథాతథంగా ఉంటున్నాయి. ఇటీవల రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేసి, అక్కడి అసౌకర్యాలను బయటపెట్టారు. ఇదే తరహాలో ప్రభుత్వ గురుకులాలు, కేజీబీవీ స్కూళ్ళలో కూడా విస్తృత తనిఖీలు నిర్వహించాలి. ఈ సంస్థలు కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థలను సందర్శించి, నిరంతర పర్యవేక్షణ చేయాలి. లోపాలు కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడకూడదు.

తెలంగాణలోని 1,023 గురుకుల పాఠశాలల్లో 662 స్కూళ్లకు సొంత భవనాలు లేవని, చాలా స్కూళ్లలో టాయిలెట్‌లు, బాత్‌రూమ్‌లు, రన్నింగ్ వాటర్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లోపించాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ లోపాల వల్ల విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించలేక, తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. ఉదాహరణకు, సరిపడా టాయిలెట్‌లు లేకపోవడం వల్ల విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానం చేయడానికి తగిన సమయం లభించడం లేదు. ఇది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. అన్ని విద్యా సంస్థల్లో సరిపడా టాయిలెట్‌లు, రన్నింగ్ వాటర్ సౌకర్యాలను కల్పించాలి.

గురుకులాలు, కేజీబీవీ స్కూళ్ళలో ఆహార నాణ్యత కూడా ప్రధాన సమస్యగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత డిసెంబర్‌లో ఏకరూప డైట్ మెనూను ప్రవేశపెట్టినప్పటికీ, దాని అమలు సరిగా జరగడం లేదు. నల్గొండ, వికారాబాద్‌లో జరిగిన ఆహార విషబాధ సంఘటనలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బాలల హక్కుల సంక్షేమ సంఘం సూచించినట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఫుడ్ కమిషన్ మాదిరిగా తెలంగాణలో కూడా ఒక ఫుడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఈ కమిషన్ గురుకులాలు, ప్రభుత్వ స్కూళ్ళలో ఆహార నాణ్యతను తనిఖీ చేసి, నిబంధనలు పాటించేలా చూడాలి. ఏజెన్సీలు నాణ్యతా ప్రమాణాలను అనుసరించకపోతే, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి చేపడుతున్న చర్యలు స్వాగతించదగినవి. అయితే, ఈ చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ఆచరణలో అమలు కావాలి. ముఖ్యమంత్రి స్వయంగా గురుకుల స్కూళ్ళను సందర్శించి, విద్యార్థులతో సంభాషించడం, ఆహార నాణ్యతను తనిఖీ చేయడం వంటి చర్యలు కొనసాగాలి. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ పర్యవేక్షణలో భాగస్వాములవ్వాలి. అంతేకాకుండా, ఆంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ-స్కూళ్ళుగా మార్చడం, ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం వంటి ప్రణాళికలను వేగవంతం చేయాలి. విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ నియామకాలు, అభివృద్ధి గ్రాంట్ల కేటాయింపు వంటి చర్యలు కూడా త్వరితగతిన అమలు కావాలి.

తెలంగాణలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, అనారోగ్య సమస్యలు, మౌలిక సౌకర్యాల కొరత వంటి సమస్యలు విద్యా వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్, ఎస్సీ, ఎస్టీ, మహిళా, బాలల హక్కుల కమిషన్‌లు చురుకైన పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీల ద్వారా ఈ సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలి. ఫుడ్ కమిషన్ ఏర్పాటు, కౌన్సెలింగ్ వ్యవస్థ బలోపేతం, మౌలిక సౌకర్యాల మెరుగుదల, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి చర్యలు విద్యార్థుల జీవితాలను కాపాడడంలో దోహదపడతాయి.



ఇంజమూరి రఘునందన్
బిహెచ్ఎస్ఎస్ కార్యదర్శి

## అద్భుత ప్రదర్శనతో అలరించిన వికారాబాద్ జిల్లా ఒగ్గు కళాకారులు



**బొంరాస్‌పేట, జూలై 16 (జనం సాక్షి) :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి దేవాలయం అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన అమ్మవారి బంగారు బోనం తీసుకొని వెళ్లే ఊరేగింపు కార్యక్రమంలో తెలంగాణ మట్టి కళారూపం వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట మండలం నాందార్ పూర్ గ్రామానికి చెందిన ఒగ్గుడోలు కళాకారులు నిర్వహించిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. ఇంతటి మహోన్నత కార్యక్రమంలో తమకు అవకాశం కల్పించిన తెలంగాణ భాష సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణకు ఒగ్గు బీర్ల సంఘం అధ్యక్షుడు ఒగ్గు బీరప్ప,కళాకారుల బృందం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ప్రదర్శనలో ఇప్పటికే పాల్గొని అందరినీ అబ్బురపరిచిన ఘనత మన వికారాబాద్ జిల్లా కళాకారులకు దక్కుతుంది.

## ఆభరణాల షాపులో దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు

- రూ. 1.5 లక్షల నగదు స్వాధీనం
- నిందితుల అరెస్ట్



**మానవపాడు, జూలై 16 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ ఆభరణాల దుకాణం దొంగతనాన్ని పోలీసులు వేగంగా ఛేదించారు. బుధవారం శాంతినగర్ సిఐ టాటా బాబు ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ. 1.5 లక్షల నగదు, వెండి బార్లు, వెండి పాదపట్టీలు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు అని తెలిపారు. వారి అరెస్టుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి అని సీఐ సిహెచ్ టాటా బాబు అన్నారు. ఈ సందర్భంగా కేసు వివరాలు ఇలా ఉన్నాయన్నారు. 2025 జూలై 3వ తేదీన ఉదయం 10 గంటల ప్రాంతంలో శాంతినగర్లో ఉన్న శ్రీనివాస జ్యూవెలైర్స్ అనే ఆభరణాల షాప్లో "అటెన్షన్ డైవర్షన్" ద్వారా దొంగతనానికి పాల్పడిన సంఘటనపై బాధితుడు గుజరాతీ శ్రీనివాసులు శాంతినగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దొంగలు షాపులోని యజమానుడి గైర్హాజరులో నగదు మరియు వెండి ఆభరణాలతో ఉన్న సంచిని అపహరించి పారిపోయారు.

నిందితుడి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న సొత్తు: రూ. 1,50,000/- నగదు, 1 వెండి బార్ 841 గ్రాములు, 5 జతల వెండి పాదపట్టీలు 389 గ్రాములు, 2 పల్సర్ బైకులు ఒకటి నంబరు ప్లేట్ లేని వాహనం ఈ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో స్థానిక మధ్యవర్తుల పంచనామా ఆధ్వారంగా సాక్ష్యంగా నమోదు చేశారు. నిందితుడి ఆధారంగా ఇతర ముగ్గురు నిందితులు సోను, పాలపర్తి శివ, పాలపర్తి ప్రవీణ్ ఒరిస్సా రాష్ట్రానికి చెందినవారని గుర్తించారు. వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారు తెలిపారు. వారి పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అన్నారు. ఇతర వివరాలు నిందితుడు బోగిరి రవి గతంలో కూడా పిక్ పాకెటింగ్, దొంగతనాల కేసుల్లో జైలుకెళ్లిన పునరావృత నేరస్తుడిగా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఇతడు స్నేహితులతో కలిసి ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నట్టు ముసుగులు తొలగించారు. పోలీస్ శాఖ విజ్ఞప్తి ప్రజలు తమ ఆస్తిని రక్షించుకోవడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. శాంతినగర్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేయడంలో విజయవంతంగా పనిచేసిన తమ సిబ్బందిని అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగ శేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ రంజిత్ కుమార్, మస్తాన్, కానిస్టేబుల్ ప్రసాద్, తదితరులు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కర్షక మిత్ర రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి



**ఖిల్లా ఘనపురం, జూలై 16 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోని స్థానిక సింగల్ విండో మండల కార్యాలయం లో చెర్మన్ మురళీధర్ రెడ్డి ఆధ్వర్యం లో కర్షక మిత్ర రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి ముక్య అతిధిగా హాజరయ్యారు అనంతరం లబ్ధిదారులకు 80,00,000 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో ఎల్లప్పుడు ప్రజల శ్రేయస్సు కోరుకునే ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమని చెక్కులు అందుకున్న లబ్ది దారులు రాణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు అతి త్వరలో డిసిసిబి బ్యాంకును కూడా మండల కేంద్రంలో ప్రారంభిస్తామని అన్నారు ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషాలతో ఉన్నారని రాబోవు స్థానిక ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ కే పట్టం కడతారని అన్నారు,ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు టి. సాయి చరణ్ రెడ్డి , జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ శ్యామ్ సుందర్, కృష్ణయ్య , రాములు , మూడవత్ రవి నాయక్,ఆగారం ప్రకాష్, మండల నాయకులు విజయ్ కుమార్, క్యామ వెంకటయ్య , వెంకటేశ్వర్ రావు , ప్రభాకర్ రెడ్డి ,సతీష్ ,సోన్నతి రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## పట్టా భూమిలో అక్రమ మైనింగ్ ఆపండి

- మా పట్టా భూమిలో దౌర్జన్యంగా మట్టిని తరలిస్తున్నారు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు
- మాకు న్యాయం చేయాలంటున్నా భూబాధితుడు మహమ్మద్ ఖలీల్



**వికారాబాద్, జూలై 16 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, అతని అనుచరులు కలిసి తన భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని రైతు మహమ్మద్ ఖలీల్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సర్బన్ పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఖలీల్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరూర్ మండలం అంతారం గ్రామంలో గల సర్వే నెంబర్ 29,30,31,33,40,42 లలో 35 ఎకరాలు భూమిని గతంలో కొనుగోలు చేశానని తన భూమిలో అక్రమంగా అధికార పార్టీ నాయకుడు ఒకరు సర్వేనెంబర్ 30, 33లలో ఎకర 20 గుంటలలో మైనింగ్ జరుపుతూ మమ్మల్ని ఆయన అనుచరులతో కలిసి బెదిరిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఇట్టి విషయం ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోవడంతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఉన్నతాధికారులు స్పందించడం లేదని, అధికార పార్టీ నాయకులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. డయల్ 100 కు కాల్ చేయగా ధరూర్ సిఐ ఎఫ్ఐ ఆర్ నెంబర్ (16)2025 ఎఫ్ఐఆర్ చేశారనీ , ఇప్పటివరకు అక్రమ మైనింగ్ తవ్వకాలు ఆపడం లేదని, మండల తహసిల్దార్ కు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మైనింగ్ మాఫియా నుండి తన భూమి తనకు అప్పగించాలని ఆయన అన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. ఈ మీడియా సమావేశంలో న్యాయవాది రవికుమార్,మహమ్మద్ ఆదిల్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

## భవానినగర్ బాక్స్‌డ్రైన్ సమస్యను పరిష్కరించండి



**నాచారం, జూలై 16 (జనంసాక్షి) :** మల్లాపూర్ డివిజన్ లోని భవాని నగర్ కాలనీలో ఇటీవలే నిర్వహించిన లి"బస్తీ బాట"లి కార్యక్రమంలో భాగంగా వెలువడిన సమస్యల్లో ప్రధానంగా ఉన్న బాక్స్ డ్రైన్ నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో సుమారు 73 లక్షలు సాంక్షన్ అయినట్టు రెండు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వ నాయకులు, అధికారుల సమక్షంలో ఆగష్టు పదవ రోజున ఇరవై మూడు వ సంవత్సరంలో శిలాఫలకం కూడా ఏర్పాటు చేసి బాక్స్ డ్రైన్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించినప్పటి నుండి ఒక్క రూపాయి పని కూడా జరగలేదు అని లిగ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అన్నారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు అతిత్వరలో పనులను ప్రారంభించి బాక్స్ డ్రైన్ సమస్యని పరిష్కరించాలని కోరుతూ ఈఈ నాగేందర్ కి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి ,సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్ , భవాని నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిర్మల దేవి ,మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగవీటి ప్రిన్సు శ్రవణ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణంకు శంకుస్థాపన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**బషీరాబాద్, జూలై 16 (జనం సాక్షి) :** బషీరాబాద్ మండల పరిధిలో కాసింపూర్,ఎక్మాయి గ్రామలలో ఇల్లు లేని పేదవారికి వారికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారులతో,స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్షన్స్ ఉన్నాయని,గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తాం అని అన్నారు. ఎక్మాయి గ్రామంలో ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదు. మన ప్రజాప్రభుత్వంలో మొదటి దశలో 44 ఇళ్లు ఇచ్చాం. త్వరలో మళ్ళీ కొన్ని ఇళ్లు మంజూరు చేస్తాం. గతంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు, మన ప్రభుత్వంలో ఎక్మాయి లో 112 రేషన్ కార్డులు వచ్చాయి. రానివారు దరఖాస్తు చేసుకోండి. పేదలకు రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. రైతు భరోసా పథకం ద్వారా 6 కోట్లు నిధులు మన గ్రామాకే వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మొరం మట్టీ ఉచితంగా అందించాలని అధికారులను ఆదేశించారు. డీఎంతో మాట్లాడి గ్రామానికి బస్సు సౌకర్యం కలిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, మండల,గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న రేవంత్ సర్కార్

- సిరిపురం ఎస్సీ హాస్టల్, మర్పల్లి కేజీబీవీని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**మర్పల్లి, జూలై 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. సిరిపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం అన్నంలో పురుగులు వచ్చాయని, మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లోను గత రెండు మూడు రోజుల నుండి వస్తున్న వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు ఆయన స్పందించారు. బుధవారం మండల పరిధిలోని సిరిపురం, మర్పల్లి కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడారు. అక్కడ ఉన్న బియ్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో తరచు ఫుడ్ పాయిజన్ అనేది అభం శుభం తెలియని విద్యార్థుల పాట్ల శాపంగా మారిందని, ప్రభుత్వ నిర్లక్ష్యం ఖరీదు ఎన్ని ప్రాణాలను బలి తీసుకుంటుందని ఆయన అన్నారు. మాటలకే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి రేవంత్ నిర్లక్ష్యం తీరు వల్ల ఇంకా ఎంతమంది విద్యార్థిని విద్యార్థులు ఆసుపత్రి పాలు అవ్వాలో అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే పెట్టుకుని నిర్వీర్యం చేస్తున్నారని, ప్రభుత్వం ఇకనైనా కళ్ళు తెరచి చూడకపోతే రాష్ట్రంలో విద్యావ్యవస్థ మొత్తం నిర్వీర్యం అయిపోతుందని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ నెంబర్ సోయల్ షరీఫ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ యూత్ ప్రెసిడెంట్ మధుకర్, రమేష్, అశోక్, నీలి శ్రీకాంత్, గఫర్, కాజా, తదితరులు పాల్గొన్నారు. జడ్పిటిసి మధుకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రెసిడెన్షియల్, గురుకులాలలో అడ్మిషన్ల కొరకు ప్రజా ప్రతినిధుల రికమెండ్ అడిగేవారని ప్రస్తుతం విద్యార్థులను అక్కడ అడ్మిషన్ చేయడం లేదని అన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**తాండూరు, జూలై 16 (జనంసాక్షి) :** విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్ శరణబసప్ప పేర్కొన్నారు. బుధవారం యాలాల మండలం తిమ్మాయిపల్లిలో తాండూరు లయన్స్ క్లబ్ తరుపున తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్ శరణబసప్ప మాట్లాడుతూ విద్యార్థిగా చదివిన ఈ పాఠశాలకు తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా రావడం నాకు చాలా గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. ఈ స్థాయిలో మీముందు ఉన్న,నేను పుట్టిన మన తిమ్మాయిపల్లి గ్రామం నుండి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని తెలిపారు. నా తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, శంకరప్ప జ్ఞాపకార్థం ప్లేట్లు, గ్లాసులు పాఠశాల విద్యార్థులకు పంఫిణి చేశారు. అదేవిధంగా పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ మాంకాల నటరాజ్, లైన్స్ క్లబ్ ట్రెజరర్ బి గౌరీ శంకర్, సల్ల దామోదర్, సోమని, బసనప్ప, గోపాలకృష్ణ , వీరప్రసాద్, సంగప్ప, తిమ్మాయిపల్లి గ్రామ పెద్దలు విట్టల్ రెడ్డి, భీమప్ప, కృష్ణ, లక్ష్మమ్మ, ఇతర గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయురాలు అలవేలు, ఉపాధ్యాయుడు రామకృష్ణ, జయంతి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, భాగ్యమ్మ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**యాచారం, జులై 16 (జనం సాక్షి) :** మండల వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న రైతుల భూ సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల రైతు సంక్షేమ పథకాల లబ్ధి పొందలేక రైతులు నష్టపోతున్నారని రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అయ్యప్పను కలసి ఆయనతో భేటీ అయ్యారు. భూ భారతి చట్టం ద్వారా ఇదివరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అన్ని గ్రామాల్లో నుంచి వచ్చిన దరఖాస్తులతోపాటు అంతకన్నా ముందు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు అన్నిటిని అధికార యంత్రాంగం ద్వారా పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ విషయమై స్పందించిన తహసిల్దార్ త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరించి రైతు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కీర్తి సాగర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు మురళి, రామకృష్ణ, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో మౌలిక వసతులే లక్ష్యంగా అభివృద్ధి పనులు




**రాజేంద్రనగర్, జూలై 16 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతులే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బుదవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో జీహెచ్ఎంసి ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో రూ. 71 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సిసి రోడ్డు రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవ్పల్లి నుండి శాస్త్రిపురం వట్టేపల్లి వెళ్లే ప్రజలకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గుతుందని ఇది నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమని ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ప్రజలకు సులువైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే మా లక్ష్యం. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాస్ ,డిఈ కార్తీక్ , రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవికుమార్, ఈఈ నరేందర్ తదితరులు ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లోపే ఉద్యోగాలకు నోటిఫికేషన్స్ వేయాలి

- ఉద్యోగ నియమాకాలు చేపట్టకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తాం
- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

**హైదరాబాద్, జూలై 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగాల భర్తికై నోటిఫికేషన్స్ వేసి నియామకాలను చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధనకు జరిగిన ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియమకాలే ప్రధాన డిమాండ్లు, ఇందులో నీళ్ళు, నిధుల గురించి పక్కన పెడితే గత బీఆర్ఎస్ సర్కార్ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడం పట్ల నిర్లక్ష్యం వహించింది. ఉద్యోగాలివ్వకుండా, ఇచ్చిన నోటిఫికేషన్లు కూడా పేపర్లీకులు, పరీక్షల వాయిదాలు, కోర్టు వివాదాలు సృష్టించేలా ఉండటంతో నిరుద్యోగుల్లో తీవ్ర ఆందో ళన తలెత్తింది. దీంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో, ఏ నెలలో ఎన్ని ఉద్యోగ నియామకాలు చేపడతామో జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేస్తామని నమ్మబలికింది. కానీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల తర్వాత ఇదే జాబ్ క్యాలెండర్ అంటూ ప్రణాళిక లేకుండా, తూతూ మంత్రంగా ఉద్యోగాల భర్తీకి చర్యలంటూ ఓ క్యాలెండర్ను ప్రకటించింది. ఇందులో ఎన్ని ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయో, ఎంత కాలానికి ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తారో కనీస ప్రస్తావన లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలలోపే ఉద్యోగాలకు నోటిఫికేషన్స్ వేయాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ రౌండ్టేబుల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్,పిడిఎస్యు జాతీయ నాయకులు మహేష్ రాష్ట్ర నాయకులు నాగరాజు సాంబ, శ్రీనివాస్,డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావీద్, పివైఎల్ రాష్ట్ర నాయకులు కొల్లూరు భీమేష్, పిడిఎస్యు జార్జి రెడ్డి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్ నాగేశ్వరరావు సుమంత్, నిరుద్యోగ జేఏసీ నాయకులు జనార్ధన్ మోతిలాల్,కాశి, సలీం,కిరణ్, పూజ, రమేష్,రాజయ్య, అనిల్, సురేందర్,మహేష్, తదితరులు మాట్లాడారు. ఉద్యోగాల సాధనకై ఐక్య కార్యచరణతో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.



# మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి

**వనపర్తి బ్యూరో, జూలై 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి లక్ష్యమని అందుకు అనుగుణంగా మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు వడ్డీ లేని రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజక వర్గంలోని రెండు మండలాలు మదనపూర్, కొత్తకోట కు సంబంధించి రాయల్ ఫంక్షన్ హాల్లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ దేశానికి తొలి మహిళ ప్రధాని అయిన ఇందిరమ్మకు ఉక్కు మహిళాగా పేరుగాంచిందన్నారు. 1971లో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో అమెరికా మధ్యవర్తిత్వానికి తలొగ్గకుండా పాకిస్తాన్ పై విజయం సాధించి పాకిస్తాన్ ను రెండు ముక్కలుగా విడగొట్టిందని గుర్తు చేశారు. అలాంటి ఉక్కు మహిళా ఇందిరమ్మ రాజ్యంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే కుటుంబాలు బాగుపడతాయనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం వీలు కల్పించి రూ. 6500 కోట్లు ఆర్టీసీ



యాజమాన్యానికి చెల్లించింది అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో 43 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తుందన్నారు. ఇందుకు రూ. 1.26 కోట్ల రూపాయలు విద్యుత్ శాఖకు చెల్లించడం జరిగింది. 500 రూపాయలకే సిలిండర్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రజలు సన్న బియ్యం కొనుక్కోలేక లావు బియ్యం తినలేక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చౌకధర దుకాణాల ద్వారా ప్రజలకు తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేస్తుందన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు వ్యవసాయ సాగుకు పెట్టుబడి సాయం కింద రైతులందరికీ రైతు భరోసా ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థికంగా బలోపేతంవచేసేందుకు స్కూల్ యూనిఫారంలు మహిళా సంఘాల ద్వారానే కుట్టించడం జరిగింది. త్వరలో కొత్తకోట మిరాస్ పల్లి వద్ద మహిళలకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆర్టీసీ బస్సుకు యజమానులను చేసినట్లు తెలిపారు. త్వరలోనే జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా మహిళా సమాఖ్యలకు, మండల మహిళా సమాఖ్యలకు స్వంత భవనాలు ఉండేందుకు వనపర్తి లో రూ. 5 కోట్ల వ్యయంతో మహిళా సమాఖ్య భవనం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. లోన్ తీసుకున్న మహిళా చనిపోతే లోన్ మాఫీ అవుతుందన్నారు. అనంతరం మండల సమాఖ్య నుంచి 5 మంది ఉత్తమ మహిళా సంఘాల సభ్యులకు సన్మానం చేశారు. 2025-26 సంవత్సరానికి వడ్డీ లేని బ్యాంకు రుణాలు రూ. 8.30 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు ఇచ్చారు. మండల మహిళా సంఘాలకు ప్రమాద బీమా, లోన్ భీమా చెక్కు రూ. 2.38 లక్షల చెక్కును, కొత్తకోట మున్సిపాలిటీకి సంబంధించి రూ. 6529903 చెక్కును అందజేశారు. ఆర్టీసీ బస్సు నుండి వచ్చిన అద్దె రూ. 138936 చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, మాదాపూర్ మార్కెట్ కమిటి చైర్మన్ ప్రశాంత్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పావని, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, మండల సమాఖ్య అధ్యక్షులు చెన్నమ్మ, జయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- జిల్లా కలెక్టర్



**పటాన్‌చెరు, జూలై 16 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో సమర్థులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం పటాన్చెరు లోని గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టోరూమ్ షోరూమ్‌ను పరిశీలించారు. పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్య ద్వారా ఆంగ్ల భాష పై విద్యార్థులకు పట్టువచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రాథమిక దశ నుండి ఆంగ్ల విద్యను బోధించడం ద్వారా కార్పొరేట్ పాఠశాలలవిద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## చిన్నతరహా పరిశ్రమలతో మహిళల ఆర్థిక ప్రగతి




**సిద్దిపేట బ్యూరో, జూలై 16 (జనంసాక్షి) :** చిన్నచిన్న వృత్తి వ్యాపారాల ద్వారా మహిళలు ఆర్థిక సాధికారత సాధించవచ్చని రాంప్ ఈడిసి మేనేజర్ మన్నె శిరీష అన్నారు. బుధవారం రోజు మండల సమైక్య భవనంలో సూక్ష్మ చిన్న తరహా పథకాలపై రోజుఅవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమఈ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధారికత సాధించేందుకు కావలసినటువంటి ఎం ఎస్ ఎం ఈ పథకాల గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో ర్యాంపు ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ అరవింద్ మరియు లీడ్ బ్యాంకు మేనేజర్ హరి బాబు మరియు డిఐసిఐపిఓ సల్మా ఈడీసీ మేనేజర్ మన్నె శిరీష మరియు అసిస్టెంట్ మేనేజర్ రాజు కావలసినటువంటి సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాగర్ మరియు ఎస్ఎస్‌జి మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చందాపూర్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**వనపర్తి బ్యూరో, జూలై 16 (జనంసాక్షి) :** వనపర్తి పట్టణం నుంచి చందాపూర్ గ్రామం వరకు నిర్మించే రోడ్డు నిర్మాణాన్ని బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పరిశీలించారు. శ్రీనివాసపురం వరకు నిర్మించే సిసి రోడ్డు పనులను నాణ్యవంతంగా చేపట్టాలన్నారు. రోడ్డు వెడల్పును తగ్గించకుండా చూడాలని సూచించారు. స్థానిక నాయకులు అధికారులతో సమన్వయమై పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులకు రాకపోకులకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్, స్థానిక మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ, బ్రహ్మం చారి, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజ్
- రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- ఎస్‌ఎఫ్ఐ డిమాండ్

**మద్దూరు, జూలై 16 (జనం సాక్షి) :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మద్దూరు మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో ఆఫీస్ ముందు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తదనంతరం ఎమ్మార్వో మహేష్ గౌడ్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మహమ్మద్ అలీ ఈ ధర్నాకు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దూరు మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు, విద్యార్థినిలు చాలా ఇబ్బంది పడుతున్నారని, మద్దూరు మండల కేంద్రంలో జెడ్పిహెచ్ఎస్



హైస్కూల్, మరియు గర్ల్స్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడా వాష్ రూమ్ లు లేక ఇబ్బంది పడుతున్నారని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 8000 కోట్లకు పైగా పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ లను తక్షణమే విడుదల చేయాలని, మద్దూరు మండల కేంద్రంలో చింతల దిండే గ్రామానికి వెళుతున్న దారిలో ప్రభుత్వ గురుకుల పాఠశాల గత ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ శంకుస్థాపన చేసిందని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఇప్పుడు శంకుస్థాపన చేసి ఇప్పటివరకు గురుకుల పాఠశాల నిర్మించలేని పరిస్థితి మనం చూస్తానే ఉన్నామని, అద్దె భవనంలో విద్యార్థులు పడుకోవడానికి స్థలం లేక, క్లాసులు వినడానికి ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. ఒకే దగ్గర తింటూ, ఒకే దగ్గర క్లాసులు వింటూ, ఒకే దగ్గర పడుకున్న పరిస్థితి మనం చూస్తానే ఉన్నాం, తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మరియు ఎమ్మెల్యే క్యాంపస్లు ముట్టడించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భాను ప్రసాద్, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, లాల్, మౌలాలి, వెంకటేష్, రాజేష్, నరసింహ, లావణ్య, నిఖిత, రామేశ్వరి, వీరితోపాటు 800 మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ధర్నా విజయవంతం చేశారు.

## చేర్యాల డివిజన్ ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- జేఏసీ చైర్మన్ వకుళభరణం నర్సయ్య పంతులు
- జేఏసీ ఆధ్వర్యంలో చేర్యాలలో మానవహారం

**చేర్యాల, జూలై 16 (జనంసాక్షి) :** చేర్యాల డివిజన్ ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని జేఏసీ చైర్మన్ వకుళభరణం నర్సయ్య పంతులు సూచించారు. చేర్యాల ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటుచేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరుతూ బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం చేపట్టి గాంధీ కూడలి వరకు జెండాలు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నర్సయ్య పంతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా అధికారికంగా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. చేర్యాల ప్రాంతం విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను 100 రోజుల్లో చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి జనగామ బహిరంగ సభలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చేర్యాల ను రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు



చేయకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కు బలంతో అధికార పార్టీ అభ్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేసి తగిన రీతిలో గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగివచ్చేదాకా ఆందోళన ఆపేది లేదని, జరగబోయే పరిణామాలకు ప్రభుత్వంమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ముస్త్యాల బాల్ నర్సయ్య, ఆముదాల మల్లారెడ్డి, బూరుగు సురేష్ గౌడ్, మిట్టపల్లి నారాయణరెడ్డి, భూమిగారి రాజేందర్, అంకుగారి శ్రీధర్ రెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, తలారి కీర్తన -కిషన్, సిలువేరు సిద్ధప్ప, నాగేశ్వర్ రావు, శెట్టిపల్లి సత్తిరెడ్డి, మంగోలు చంటి, వడ్లకొండ సంజీవులు, రాళ్లబండి నాగరాజు, తిరుపతి రెడ్డి, వెంకట్ మావో, నాచాగోని పద్మ- వెంకట్ గౌడ్ తో పాటు నాలుగు మండలాల అఖిలపక్షం పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత



**జడ్చర్ల, జులై 16 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాల ఏర్పాటు, మున్సిపాలిటీ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట 2వ వార్డులో రూ. 10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న ఓపెన్ డ్రైనేజీ పనులకు బుధవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పట్టణ ప్రజల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్ పర్సన్ సారిక, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు బుక్క మహేష్, జ్యోతి రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కుమ్మరి రాజు, సతీష్, రమేష్, నాయకులు బుక్క వెంకటేశం, నిత్యానందం, రమేష్ యాదవ్, శివ కుమార్, లక్ష్మణ్, ఆసిఫ్ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించిన ముఖ్య కార్యదర్శి



**అచ్చంపేట, జూలై 16 (జనం సాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం లోని మన్ననూరు గ్రామంలో గల గిరిజన గురుకుల విద్యాలయాన్ని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శరత్ ఆకస్మికంగా సందర్శించారు. బుధవారం నాడు విద్యాలయాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడాడు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించాడు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన మెనూ ప్రకారం భోజనాలు చక్కగా అందుతున్నాయని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పాఠశాలల్లో నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటును పరిశీలించారు. హాస్టల్లో వండిన భోజన పదార్థాలను రుచి చూచారు. విద్యార్థులకు మెనూ ప్రకారం చక్కగా భోజనాలు పెట్టాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో గిరిజన గురుకుల మహబూబ్ నగర్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సుధాకర్, ఏ పి ఓ యాదమ్మ, పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట

**పటాన్‌చెరు, జూలై 16 (జనంసాక్షి) :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సృష్టించి.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా సమైక్య సంఘాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత అందిస్తోందని.. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసినియోజకవర్గ పరిధిలోని 618 మహిళ సమైక్యలకు 58 కోట్ల 24 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు, 4255 మహిళ సమైక్య గ్రూపులకు మంజూరైన 11 పోట్ల ఎనిమిది లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయా గ్రూపులకు అందజేశారు. వివిధ కారణాలతో మృతి చెందిన ఐదుగురు మహిళా సమైక్య సంఘాల సభ్యురాల కుటుంబాలకు 12 లక్షల 50 వేల రూపాయల విలువైన ఇన్సూరెన్స్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో 7 వేలకు పైగా మహిళా సమైక్య గ్రూపులు పనిచేయడం సంతోషకరమన్నారు. ఒక మహిళ చదువుతోపాటు ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక స్వాతంత్రం కలిగి ఉంటే ఆ కుటుంబం ఉన్నత స్థాయికి చేరుకుంటుందని.. ఇందుకు మహిళా సమైక్య సంఘాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఒక్కొక్క రూపాయి పొదుపు చేసుకుంటూ లక్షల రూపాయల రుణ సౌకర్యం పొందుతూ కిరాణా దుకాణం మొదలుకొని పెట్రోల్ బంకులు నడిపే స్థాయికి మహిళా సంఘాలు చేరుకోవడం వారి కృషికి తార్కానమని అన్నారు. ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాలు వినియోగం రోజురోజుకీ పెరుగుతోందని.. ప్రతి మహిళా వీటి కట్టడిలో కీలక పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు.

### నిరంతరం శ్రమించే తత్వం కలెక్టర్ ప్రావీణ్యకే సొంతం..

సంచలం సృష్టించిన సిగాచి పరిశ్రమ దుర్ఘటన అంశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చూపించిన ప్రతిభ ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకుందని.. ఇటు ప్రభుత్వానికి అటు బాధితులకు మధ్య సమన్వయం చేసుకుంటూ 15 రోజులపాటు 18 గంటల చొప్పున పని చేస్తూ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలిచిందని



ఎమ్మెల్యే జిఎంఆర్ కొనియాడారు. మృతుల కుటుంబాలతోపాటు బాధితుల కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలిచిందని అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, ఎంపీడీవోలు, తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్, ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా సమైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ రూరల్, జూలై 16 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు.ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటైన చిన్నపిల్లల వైద్య విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, చిన్నారులకు అన్ని రకాల వైద్య సేవలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే,ఔట్ పేషెంట్ వార్డుల్లో చికిత్స కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ,ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కాలానుగుణ వ్యాధుల కారణంగా రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.రోజువారీగా ఓపీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని మందుల గదులు,టీకా నిల్వలపై వివరాలు తెలుసుకుని, అవసరమైనన్ని మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించిన కలెక్టర్, చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలతో వైద్యం అందించడం జరుగుతుందని భరోసా కల్పించారు. అనంతరం ల్యాబొరేటరీ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలు తెలుసుకుని,అవసరమైన అన్ని రోగ నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రిలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్‌పోస్ట్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ఏర్పాట్లను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ గోపాల్ సింగ్, అదనపు సుపరిండెంట్ డాక్టర్ విశ్వనాథ్,ఆర్ఎంఓ డాక్టర్ సమత, డాక్టర్ రవికుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

# నానో యూరియాతో సత్ఫలితాలు

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు ప్రతినిధి, జులై 16(జనంసాక్షి) :** వ్యవసాయ రంగంలో నానో యూరియాతో సత్ఫలితాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలోని స్నేహ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ, ఇఫ్కో సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్, నానో డీఏపీపై (డ్రోన్‌తో పిచికారీ చేసే) అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో డ్రోన్ ద్వారా నానో యూరియా ద్వారా పొలాల్లో వేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నానో యూరియా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నదని అన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నానో సాంకేతికత పరిజ్ఞానంతో మొట్టమొదటి సారిగా యూరియాను ద్రవ రూపంలో తీసుకువచ్చిన ఘనత ఓ భారతీయుడిని, ఇది దేశానికే గర్వకారణం అన్నారు. సత్వర ప్రయోజనం అందించే నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించుటకు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. రైతు శిక్షణ కార్యక్రమాలు ప్రదర్శన నిర్వహించి నానో యురియాను ఎలా ఉపయోగించాలనే అంశాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించాలన్నారు. నానో యూరియా వాడకం వల్ల అధిక దిగుబడి, ఖర్చు తగ్గడం, భూసార పరిరక్షణ, పర్యావరణహితం కలుగుతుందన్నారు. లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. పంట సాగుకు ముందుకువచ్చే రైతులకు ప్రభుత్వ సబ్సిడీలతో పాటు, ఇతర అన్ని విధాల తోడ్పాటును అందిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, ఇఫ్కో డిఎం విశాల్ షిండే, స్నేహ ఎఫ్పిఓ సిఈఓ చాంద్ పాషా, ఎఫ్పిఓ డైరెక్టర్లు అశోక్, పోరికా ప్రమేలా, కవిత, ఎంపిడిఓ హనుమంత్ రావు, , టిజివిబి బ్యాంక్ మేనేజర్, మండల వ్యవసాయ అధికారులు నల్లెల్ల శ్రీధర్, పరమేశ్వర్, ఏఈఓ రామ్‌చంద్రాపూర్ కావ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## అప్పు డబ్బులు ఇవ్వలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

**భీమదేవరపల్లి, జులై 16(జనం సాక్షి) :** మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో బుధవారం చోటుచేసుకుంది.తన దగ్గర తీసుకున్న అప్పు డబ్బులు ఇవ్వకుండా ఆరు నెలలుగా తిప్పించుకుంటున్నాడని మనస్తాపం చెంది గుడికందుల రమేష్ ఇంటి ముందు బాధితురాలు గడ్డి మందు తాగినది.పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు.

## ఫర్టిలైజర్ షాపులో చోరీ

**చింతలమానేపల్లి, జులై 16 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని డబ్బా గ్రామంలోని ఎక్స్ రోడ్ వద్ద గల శ్రీ సాయి పర్టిలైజర్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి షాపులో చొరబడిన దుండగులు కౌంటర్‌లో ఉన్న 70వేల రూపాయలు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని మహేష్ గౌడ్ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**పరకాల, జులై 16 (జనం సాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో బుధవారం రోజున పరకాల టౌన్ మండలాల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామాలు, వార్డుల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు,ఇందిరమ్మ కమిటీ కలిసి సమీక్షించారు.ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను దశలవారీగా మంజూరు చేస్తామని అన్నారు. మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకుంటే అదనంగా ఆ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశలవారీగా బిల్లులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదింటి వాడి సొంతకాల నెరవేరుతుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు.

# టీబీ నిర్మూలనలో ప్రైవేటు వైద్యుల సహకారం అవసరం

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో టీబీ వ్యాధిని నిర్మూలించడంలో ప్రైవేటు వైద్యుల సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, సింగరేణి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టిబిని నిర్మూలించడంలో ప్రైవేటు వైద్యుల పాత్ర ఎంతో అవసరమని అన్నారు. జిల్లాలో టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థతోపాటు ప్రైవేట్ వైద్యుల భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలో 95 వేల మందికి టిబి పరీక్షలు చేయడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1695 మందికి పరీక్షలు నిర్బహించారని తెలిపారు. జూన్ 9న జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని 100 రోజుల్లో 95 వేల మందికి టిబి పరీక్షలు చేయాల్సి ఉన్నదని, ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్ రే కేంద్రాలున్నాయని, వీటి వల్ల నిర్ణీత వ్యవధిలో పరీక్షలు పూర్తి చేయలేకపోతున్నామని కాబట్టి ప్రయివేటు వైద్యులు, ఎక్స్ రే కేంద్రాల నిర్వాహకులు సహకారం అందించాలని సూచించారు. టీబీ వ్యాధి గ్రస్థులను త్వరితగతిన గుర్తించి వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. టీబీ నిర్ధారణలో ఎక్స్ రే, నాట్ పరీక్షలు చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే గుర్తించిన కేసులను డిజిటల్ నిక్షేపణ యాప్ (నిక్షయ)లో నమోదు చేయాలని, వ్యాధి గ్రస్థులకు పోషకాహారం అందించే లక్ష్యంతో నిక్షయ పోషణ యోజనకు మద్దతు ఇవ్వాలని వైద్యులను కోరారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ సోకిన వ్యక్తులను గుర్తించిన వారి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల సమాచారం మేరకు రోగి నివసించే ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టి, మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధి వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా నవీన్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వెంకటేశ్వర్లు, ఇంఛార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా శ్రీదేవి, డా ఉమారాణి, ఐఎంఏ ప్రెసిడెంట్ డా కిరణ్ కుమార్, సింగరేణి సూపరింటెండెంట్ డా గోపి, రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీనివాస్, డెమో శ్రీదేవి, ఎక్స్ రే యూనిట్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# చినుకు లేక రైతుల ఆందోళన



**మల్హర్, జులై 16(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరదిలోని అన్ని గ్రామాలలో ప్రజలు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. పత్తి మొలకలు వర్షం లేక ఎండిపోతున్నాయి. వరి నాటు వేసిన రైతులు చినుకులు లేక అయ్యో రామచంద్ర వర్షాలు లేకపాయె అని బాధపడుచున్నారు. కూరగాయలు సాగుచేసే రైతుల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. వర్ష కాలం ప్రారంభం నుంచి వర్ష పాతం చాలా తక్కువగా కురిసింది. రైతులందరు వానలు లేక దిగులు చెందుతున్నారు.వరుణ దేవ కరుణించావా అంటు గ్రామలలో గ్రామ బొడ్డు రాయి దేవతలకు బిందెలతో జాలాభిషేకలు చేస్తున్నా మహిళాలు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

## ఢిల్లీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో 2 బంగారు పతకాలు

**గెలుచుకున్న మల్లారం గరిగే అభినయశ్రీ**



**భీమదేవరపల్లి, జూలై 16 (జనంసాక్షి) :** ఢిల్లీలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మల్లారం గ్రామానికి చెందిన గరిగే అభినయశ్రీ రెండు బంగారు పతకాలను సాధించి గ్రామనికి గర్వంగా నిలిచింది. 100 మీటర్లు, 200 మీటర్ల విభాగాల్లో పాల్గొన్న అభినయశ్రీ పోటీలో తన ప్రతిభను చాటుతూ రెండు విభాగాల్లోనూ మొదటి స్థానం దక్కించుకుంది. తన విజయానికి తల్లిదండ్రులు,కోచ్ మరియు గ్రామస్తుల మద్దతే కారణమని అభినయశ్రీ పేర్కొంది.ఈ ఘన విజయంపై ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థులు,స్థానిక నాయకులు అభినయశ్రీని ఘనంగా సన్మానిస్తూ ఆమె భవిష్యత్తు మరింత వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

## హోంగార్డు విష్ణుకాంత్ సేవలు మరువలేనివి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** పోలీసు శాఖలో హెూంగార్డు విష్ణుకాంత్ సేవలు మరువలేనివి అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. హెూంగార్డు జీ విష్ణుకాంత్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలిస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయనను ఎస్పీ హోంగార్డ్ కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన చేసిన సేవలను కొనియాడి, శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి, బహుమతి ప్రధానం చేసి సాగనంపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెూంగార్డుల సేవలు పోలీసు యంత్రాంగంలో కీలకం అన్నారు. అన్ని విధులలో పోలీసులతో కలిసి సమానంగా విధులను నిర్వర్తిస్తుంటారని తెలిపారు. అందులో భాగంగానే 1984లో ఉద్యోగంలోకి చేరిన హోంగార్డు జి విష్ణుకాంత్ అన్ని ఆపత్కాల సమయాల్లో జిల్లా పోలీసులకు అండగా ఉంటూ, సంఘవిద్రోహశక్తుల సమాచారం అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అభినందించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఆయన కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిసి కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, వామన్, హెూంగార్డ్ కార్యాలయ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి జులై 16 (జనంసాక్షి) :** జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఆపరేటర్లతో గ్రామాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవనాలలో నెలకొన్న మరమ్మత్తుల వివరాలతో నివేదిక రూపొందించాలని, విద్యార్థులకు అందించే త్రాగునీరు, మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి ఒక రోజు అక్కడ నిద్రించాలని, మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం అయినందున గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలో పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రభుత్వంచే గుర్తించబడిన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని, రైతులకు అవసరమైన పంట సాగు మెళకువలను అందించాలని తెలిపారు. నివాస స్థలం కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఆర్థిక సహాయం పొందుతున్న లబ్దిదారులు నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టడంతో పాటు నిబంధనలకు అనుగుణంగా నిర్మించిన బేస్మెంట్, లెంటల్, స్లాబ్ స్థాయిలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో అంతర్గత రహదారుల నిర్మాణాలు, మరమ్మత్తులు త్వరగా పూర్తి చేసేలా పనులను పర్యవేక్షించాలని తెలిపారు. రేషన్కార్డుల కొరకు అందిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి నిబంధనల ప్రకారం మంజూరు చేసే విధంగా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, ఈ క్రమంలో నీటి ట్యాంక్ మోటార్లు, పైప్లైన్ల లీకేజీ మరమ్మత్తులను తక్షణమే చేపట్టిన నీటి సరఫరాను పునఃరుద్దరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ అందించాలని, అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని తెలిపారు. నర్సరీలలో మొక్కల పెంపకం నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని, అర్హులైన జాబ్కార్డులు కలిగిన ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# నకిలీ ఛాలన్ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా చేసి!

**వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి**



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** నకిలీ ఛాలన్ పత్రాలు సృష్టించి ప్రభుత్వ రోడ్డును అక్రమంగా ఆక్రమించిన నలుగురిపై జిల్లా పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించారు. ఈ మేరకు డిఎస్పీ జీవన్ రెడ్డి భుదవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన రంగినేని సూర్యప్రకాశ్ అనే వ్యక్తి తన కుమారుడు రంగినేని శ్రీనివాస్, కుమార్తె రంగినేని స్వేత మరియు అల్లుడు అముల్ జలగంతో కలిసి ప్రభుత్వ రోడ్డును అక్రమంగా ఆక్రమించి కబ్జా చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కొంతమంది పిర్యాదు దారులు ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ చేపట్టి వారిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు.

## తాసిల్దార్ కార్యాలయాల సందర్శన

**అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్**



**జనగామ ప్రతినిధి, జూలై16 (జనంసాక్షి):** బుధవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ స్టేషన్ ఘన్పూర్ జాఫర్గడ్,చిల్పూర్ మండల తాసిల్దార్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తులను ఎన్ని పరిష్కరించారు.. ఏ విధంగా చేస్తున్నారు అని తహసీల్దార్ లను అడిగి తెలుసుకొని క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ త్వరగా అయ్యేలా పలు సూచనలు ఇచ్చారు. పది రోజుల్లో దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీ ఓ వెంకన్న, మండలాల తహసీల్దార్ లు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి




**నల్గొండ, జూలై 16 (జనం సాక్షి) :** నల్గొండ బ్యూరో ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం నల్గొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 12 లక్షల విలువ గల (115.50 గ్రాముల) బంగారు ఆభరణాలు మరియు (300 గ్రాముల) వెండి ఆభరణాలు, రూ. 25,000 వేల నగదుతో పాటు ఒక మొబైల్ ఫోన్, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గత కొంత కాలంగా నల్లగొండ జిల్లాలో తాళం వేసిన ఇళ్లల్లో పగలు, రాత్రి సమయాల్లో దొంగతనాలు మరియు బైక్ డీక్కి ల నుండి దొంగతనాలు జరుగుతున్న నేపథ్యం లో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీఎస్, నల్లగొండ వన్ టౌన్ పోలీసులు, చందంపేట మరియు పెద్దవూర పోలీసులు వివిధ ప్రాంతాలలో వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో బుధవారం ఉదయం 10:30 నిమిషాలకు చందంపేట మండలం పోలేపల్లి %ఇ% రోడ్ వద్ద అనుమానాస్పదంగా బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి "పాప్లాన్ డివైస్" (వేలిముద్రల తనిఖీ పరికరం) తో చెక్ చేయగా వీరు పాత నేరస్తులైన బీసపోగు శాంసన్ మరియు కందర కొండ కృష్ణ కిశోర్ లుగా గుర్తించడం జరిగింది. తదుపరి వారిని విచారించగా బీసపోగు శాంసన్ జైల్ నుండి విడుదలైన తరువాత ఇంటి తాళాలను పగులకొట్టి, చందంపేట, వాడపల్లి, చింతపల్లి, ఇబ్రహీంపేట, నేరేడుచర్ల, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని బెల్లంకొండ, బండ్లమోటు పోలీసు స్టేషన్ పరిధులలో మొత్తం (09) దొంగతనాలకు పాల్పడినట్లు మరియు ఈ (09) దొంగతనాలలో (02) డీక్కి దొంగతనాలను, కందర కొండ కృష్ణ కిశోర్ తో కలిసి చేసినట్లు ఒప్పుకున్నాడు. తదుపరి కందర కొండ కృష్ణ కిశోర్ ను విచారించగా పెద్దవూర, పెబ్బేరు, తో పాటూ మోత్కూర్ పీఎస్ పరిధిలో కూడా (03) డీక్కి దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. బీసపోగు శాంసన్ కు కందర కొండ కృష్ణ కిశోర్ కు చెర్లపల్లి జైల్ లో పరిచయం ఏర్పడిందని, జైల్ నుండి విడుదలైన తరువాత వీరు ఇరువురు కలిసి బైక్ డీక్కి దొంగతనాలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. తదుపరి విచారణలో వీరిపై గతంలో తమిళనాడు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో కూడా దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇదిలా వుండగా బుధవారం నల్గొండ వన్ టౌన్ పరిధిలో గస్తీ తిరుగుతున్న పోలీసులకు ఒక అనుమానాస్పద వ్యక్తి బంగారం అమ్ముటకు బంగారు షాప్ కి వచ్చినట్లు సమాచారం రాగా, పోలీసులు అక్కడికి చేరుకొని సదరు వ్యక్తిని అమ్ముటకు తెచ్చిన బంగారు ఆభరణాలు ఎక్కడివి అని విచారించగా తన పేరు దర్మడి దుర్గా ప్రసాద్ అని, తను కాకినాడ కు చెందిన వాడని, తాను జల్సాలకు అలవాటు పడి పగలు, రాత్రి సమయాల్లో ఇంటి తాళాలను పగులగొట్టి నల్గొండ జిల్లాలో దొంగతనాలకు పాల్పడినట్లు, నల్గొండ వన్ టౌన్ పీఎస్ మరియు నల్గొండ టూ టౌన్ పీఎస్ పరిధిలో (03) దొంగతనాలకు పాల్పడినట్లు, ఈ బంగారు ఆభరణాలు నల్గొండ వన్ టౌన్ పరిధిలోని ఇంటిలో రాత్రి పూట చేసిన దొంగతనానికి సంబంధించినవి గా తెలిపాడు. తదుపరి విచారణ జరుపగా ఇతనిపై గతంలో కూడా దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిసిందని డీఎస్పీ తెలిపారు. కాగా అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను పట్టుకోవడంలో నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో నల్గొండ సీసీఎస్ ఇన్స్ పెక్టర్ ఎమ్. జితేందర్ రెడ్డి, నల్గొండ వన్ టౌన్ ఇన్స్ పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిండి సర్కిల్ ఇన్ స్పెక్టర్ బీసన్న ల ఆద్వర్యంలో సీసీఎస్, ఎస్సై లు శివకుమార్, విజయ్ కుమార్, వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి, పుష్పగిరి, నాగరాజు, వహీద్ పాషా, సీసీఎస్ కానిస్టేబుల్స్ గులాం దస్తగిరి, గణేశ్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించి రివార్డ్‌లను ప్రకటించారు.

## రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణ వెంటనే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**చండూరు, జూలై 16 (జనం సాక్షి) :** రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పై వెంటనే విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చండూరు ఆర్డీఓ కు సూచించారు. బుధవారం ఆమె చండూరు ఆర్డీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక దరఖాస్తులను పరిశీలించారు. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు భూ భారతి దరఖాస్తులను కేటగిరి వారిగా విభజించుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి తగు సూచనలు చేశారు. రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే విచారణ చేయించి త్వరితగతిన పరిష్కారించాలన్నారు. అలాగే డివిజన్ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ ఆర్డీఓ ను ఆరా తీశారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బంది రాకూడదు

- తెలంగాణ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 16 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ శివారులో ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బాన్సువాడ నియోజకవర్గ ఇందిరా మహిళా శక్తి సంబరాలకు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ సబ్ కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి, డీఆర్డీఓ సురేందర్, బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి దుర్గం శ్యామల, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, నాయకులు మాజీద్, ఎజాస్, యండి. దావూద్, ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు. అనంతరం బాన్సువాడ పట్టణంలోని ఎస్ఎంబీ గార్డెన్స్‌లో బాన్సువాడ అర్బన్, రూరల్, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి పై ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు అన్ని విధాలా సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ హరి రాజు, ఎమ్మార్వో వరప్రసాద్, బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, మోహన్ నాయక్, యండి. దావూద్, నార్ల ఉదయ్ ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు సిద్ధం..

- కాళేశ్వరం.. కూలేశ్వరం అయిందని దుష్ప్రచారం...
- సూర్యాపేటకు నీళ్ళొచ్చాయో లేదో..రైతుల వద్దకే వెళ్లి తెలుసుకుందాం
- ఇసుక దందా కోసమే కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం లేదు
- ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మించిన ఘనత కేసీఆర్‌దే...
- కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 16 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని సదాశివ రెడ్డి ఫంక్షన్ హాల్ లో బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.సుమారు రెండు గంటలపాటు కొనసాగిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై తాము సీఎం రేవంత్ రెడ్డతో చర్చకు సిద్ధమని అన్నారు. సూర్యాపేటకు నీళ్ళొచ్చాయో లేదో రైతుల వద్దకే వెళ్లి తెలుసుకుందామన్నారు. కండ్ల ముందు నీళ్లు పోతుంటే.. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు.కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నారని, కూలిందన్న ప్రాజెక్టుపై తానే స్వయంగా కారులో తిరిగి వచ్చానని, సాక్షాలన్ని ప్రజల ముందు ఉంచానని చెప్పారు.ఇసుక దందా కోసమే కాళేశ్వరం నీళ్లు ఇవ్వడం లేదని, ఆ దారిలో 9 కిలోమీటర్లకు పైగా ఇసుక లారీలు ఆగి ఉన్నాయని తెలిపారు.ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దే అని కొనియాడారు.సూర్యాపేట జిల్లాకు లక్షలాది ఎకరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం నీళ్లందించామని చెప్పారు. కాళేశ్వరం కూలేశ్వరం అయిందని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విష ప్రచారం చేశాయన్నారు.కన్నెపల్లి నుంచి 380 కిలోమీటర్ల మేర ప్రవహించి సూర్యాపేటకు నీళ్లు వస్తున్నాయని చెప్పారు.ఇసుక దందా కోసమే కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం లేదని,దీంతో సీఎం రేవంత్ రెడ్డికి స్వామి కార్యం,స్వకార్యం రెండూ నెరవేరుతున్నాయని అన్నారు.పోయిన యాసంగిలో పొలాలు ఎందుకు ఎండాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నీళ్లు పారే కాలువల్లో నేడు తుమ్మలు, సర్కారు చెట్లు మొలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పంపిన వాళ్ళను సలహాదారులుగా పెట్టారని అన్నారు. మేడిగడ్డలో ఒకటి, రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోయాయని, మోటార్లు పాడైతే రిపేర్ చేయించుకోమా అని అడిగారు.కుంగిన పిల్లర్ ను రిపేర్ చేయకుండా కుంటి సాకుతో రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు,15 రిజర్వాయర్లు,19 సబ్ స్టేషన్లు, 21 పంపు హౌజ్‌లు, 203 కిలోమీటర్ల మీద సొరంగాలు, 1531 కిలోమీటర్ల మేర గ్రావిటీ కెనాల్స్, 98 కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ,530 మీటర్ల ఎత్తుకు లిఫ్టు,240 టీఎంసీల నీటి వినియోగమని అన్నారు.ఇది కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపమని చెప్పారు.ఇప్పుడు నీళ్లు ఇస్తే కాళేశ్వరం పైన చేసిన ఆరోపణలు తప్పని తేలుతుందని భయం పట్టుకుందని,కెసిఆర్ కు మంచి పేరు వస్తుందని మరో భయం కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టుకుందన్నారు. ప్రపంచంలోనే కాళేశ్వరం ఓ అద్భుతమైన ప్రాజెక్టు అని.. ఆనాడు కేంద్ర మంత్రులు, మేధావులు ప్రశంసించారని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ గొప్పతనాన్ని దేశ నలుమూలలా చాటి చెప్పారని,ముందు చూపుతో ఆయన తీసుకునే నిర్ణయాలన్ని అద్భుతమని కితాబు ఇచ్చారని అన్నారు.ఇప్పుడు ఏవో సాకులు చెబితే రైతులు నమ్మరని,తెలంగాణ రైతాంగంపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ సంచలన నిర్ణయం

- ఆశ్రమ పాఠశాల వార్డెన్ను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**దేవరకొండ, జూలై 16 (జనం సాక్షి) :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా, వంట చేసే నాలుగవ తరగతి ఉద్యోగులకు నాణ్యమైన భోజనం తయారీ పట్ల సరైన సూచనలు ఇవ్వకపోవడం వల్ల దేవరకొండ మండలం, కమలాపూర్ (ముదిగొండ )గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థినిలు ఈనెల 14న అనారోగ్యానికి కారణమైన కమలాపూర్ (ముదిగొండ) గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ (పూర్తి అదనపు బాధ్యతలు) ఏ .వేదాద్రిని తక్షణమే విధులనుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేస్తూ దేవరకొండ మండలం, కమలాపూర్ (ముదిగొండ) గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ విధులకు హాజరు కావడంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా, నాణ్యమైన భోజనం తయారు చేసే విషయంలో నాలుగో తరగతి ఉద్యోగులకు సరైన సూచనలు ఇవ్వకపోవడం పట్ల విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఆధారాలను బట్టి నిర్ధారణకు రావడం జరిగిందని, అందువల్ల పాఠశాల హెడ్మాస్టర్ (పూర్తి అదన బాధ్యతలు) ఏ. వేదాద్రిని సిసిఏ రూల్స్ ప్రకారం తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని, అంతేకాక క్రమశిక్షణ చర్యల ప్రక్రియ పూర్తయ్యేవరకు అమలులో ఉంటాయని వెల్లడించారు.

## రానున్న స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించడమే ధ్యేయం



**భువనగిరి టౌన్, జూలై 16 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి ఢిల్లీకి రాజు అయిన తల్లికి కొడుకే అయినట్లుగా అధికారికంగా ఎమ్మెల్యే అయినా ఎంపీ అయినా మంత్రి అయినా పార్టీకి అందరం విధేయులమని పార్టీ కార్యాలయం గుడి లాంటిది కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రావడం ఎన్నో సంవత్సరాలుగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లేకపోవడం ఇప్పుడు కార్యాలయాన్ని ఏర్పరచుకోవడం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండం సంజీవరెడ్డి ని అభినందించడం అభినందిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మన కుటుంబ సభ్యునిగాను భావించడం అధికారంలో ఉన్న నా మంత్రి పదవినైన కార్యకర్త ద్వారానే వచ్చిందని నేను భావిస్తున్నాను కావున రానున్న స్థానిక సంస్థ ఎన్నికలు అవి కార్యకర్తల ఎన్నికలు కాబట్టి కార్యకర్తలను గెలిపించే బాధ్యత ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ప్రత్యేకంగా యాదాద్రి భువనగిరి జిల్లా పై ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి సర్పంచులుగా ఎంపీటీసీలుగా జెడ్పిటిసిలుగా మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎంపీపీలుగా అన్నిటిని కైవసం చేసుకునే విధంగా స్థానిక ఎమ్మెల్యేలతో సర్దుబాటులు చేసుకొని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను గెలిపించే బాధ్యత ఆనాడు నన్ను భువనగిరి పార్లమెంటు సభ్యునిగా గెలిపించి పునర్జన్మనిచ్చిన ఈ ప్రాంత కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ద్వారా అన్ని పనులను ప్రజా సమస్యలను అనునిత్యం పరిష్కరించే విధంగా జిల్లా మండల పట్టణ పార్టీ అధ్యక్షులను కృషి చేయాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండం సంజీవరెడ్డి జై బాబు జై భీమ్ జై సంవిధాన్ రాష్ట్రస్థాయి కోఆర్డినేటర్ పూతన ప్రమోద్ కుమార్ జనగాం ఉపేందర్ రెడ్డి ఎల్లముల సంజీవరెడ్డి బర్రె జహంగీర్ యాదగిరి గౌడ్ పడిగెల ప్రదీప్ పిట్టల బాలరాజ్ శ్యామ్ గౌడ్ మార్కెట్ చైర్మన్ వెంకటేశం కృష్ణారెడ్డి సిరికొండ శివకుమార్ గుమ్మిడి రమేష్ రాచమల్ల రమేష్ మంచు కంటి కృష్ణమూర్తి సామల రవీందర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఈ నెల చివరి నాటికి 50శాతం ప్లాంటేషన్ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 16 (జనంసాక్షి) :** ఈ నెల చివరికల్లా 50 శాతం ప్లాంటేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా సంబంధిత శాఖలతో కలిసి ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని తెలిపారు.జూలై చివరి కల్లా ఫిట్టింగ్ 75 శాతం పూర్తి చేయాలని, మొక్కలు నాటే కార్యక్రమం 50శాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామాలలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని, వ్యక్తిగత ఇంకుడు గుంతలు ,వర్షపు నీరు ఓడిసి పట్టే ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ ఇంకుడు గుంతలు ,ఈనెల చివరి కల్లా పూర్తి చేయాలని తెలిపారు.ఇంకుడు గుంతల పనులను పూర్తి చేసిన పిదప ఈనెల చివరి వారంలో పూర్తిచేసిన పనులన్నింటినీ పిపిటి ద్వారా వివరించాలని తెలిపారు.పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ వారం కల్లా డేటా కలెక్షన్ చేయాలని, నెల చివరి కల్లా డేటా మొత్తం పూర్తిచేయాలని అన్నారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను అధికారులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎల్పీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో అందరూ భాగస్వాములు కావాలి

- సమిష్టి కృషితోనే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యం
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- టీబీ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపు




**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 16 (జనం సాక్షి) :** క్షయ వ్యాధి రహిత దేశంగా భారత్ ను తీర్చిదిద్దాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై రాష్ట్ర గవర్నర్ బుధవారం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సమిష్టి కృషితోనే సమగ్ర ప్రగతి కల సాకారం అవుతుందని, ఈ దిశగా ప్రభుత్వ యంత్రాంగం అధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు అన్ని వర్గాల వారు తోడ్పాటుగా నిలువాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరు తమకంటూ ఏదైనా ప్రతిభను కలిగి ఉంటారని, దానిని సమాజ ప్రగతి కోసం వినియోగించాలని, దీనిని ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలని అన్నారు. సామాజిక, సాహితీ, సేవా, క్రీడా తదితర అన్ని రంగాలలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు, తమతమ రంగాల ద్వారా ఆయా మాధ్యమాలను ఉపయోగిస్తూ క్షయ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన జిల్లాకు చెందిన మలావత్ పూర్ణ, గుగులోత్ సౌమ్యలను టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ కు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ లుగా వ్యవహరించాలని గవర్నర్ కోరారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా, కళాకారులు ప్రదర్శనల ద్వారా ప్రజలను టీ.బీ నిర్మూలన దిశగా చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం, రెడ్ క్రాస్ సొసైటీ చక్కటి సమన్వయం ఏర్పర్చుకుని, పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు స్క్రీనింగ్ క్యాంపులను విస్తృతంగా నిర్వహించి టీబీ కేసులను గుర్తించాలన్నారు. టీబీ నిర్మూలనకై చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన పేషెంట్లకు దాతల ద్వారా పోషక ఆహార కిట్లను అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో స్థితిగతులు, భౌగోళిక స్వరూపం, ప్రాముఖ్యతల గురించి ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ దృష్టికి తెచ్చారు. క్షయ వ్యాధి నిర్మూలన చర్యలలో భాగంగా హై రిస్క్ గ్రూప్ లో ఉన్న వారందరికీ స్క్రీనింగ్, ఎక్స్ రే చేయిస్తున్నామని, టీ.బీ లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. విరివిగా ఎక్స్ రే పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన యంత్రాలను కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా నిధులు సమకూర్చడం జరిగిందన్నారు. స్వచ్ఛంధ సంస్థలు, దాతల సహకారంతో టీ.బీ పేషంట్లకు పోషకాహార కిట్లను అందిస్తున్నామని అన్నారు. టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ లో అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ, లక్ష్య సాధనకు అంకిత భావంతో కృషి చేస్తున్నామని తెలిపారు. క్షయ నిర్మూలన కోసం విశేషంగా చేసిన కృషి వల్ల 2022-23 సంవత్సరానికి గాను జిల్లాకు గోల్డ్ మెడల్ దక్కిందని అన్నారు. తలసేమియా బాధితులకు అవసరమైన బ్లడ్ యూనిట్లను రెడ్ క్రాస్ ద్వారా సమకూరుస్తున్నామని, వృద్ధుల కోసం రెడ్ క్రాస్, జిల్లా యంత్రాంగంల సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అత్యధిక సభ్యత్వాలు, విస్తృత సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణను గుర్తిస్తూ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీకి ఇప్పటికే అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు వరించాయని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ, క్షయ నివారణలో నిజామాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలుపాలని సూచించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.




## దిగొస్తున్న పుత్తడి

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధరలు ఊగిసలాడుతున్నాయి. నిన్న స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు మంగళవారంతో పోలిస్తే బుధవారం మళ్లీ తగ్గాయి.**

## మెసేజ్‌లకు టెల్కోల గుర్తింపు 'కోడ్'

**జనంసాక్షి:**అసలైన మెసేజ్‌లు, స్పామ్ మెసేజ్‌లను మొబైల్ యూజర్లు సులువుగా గుర్తించేందుకు వీలుగా టెలికం సంస్థలు ప్రత్యేక విధానాన్ని అమల్లోకి తెచ్చాయి. దీని ప్రకారం మెసేజ్‌ల వర్గీకరణ బట్టి వాటిని పంపించే వారి పేరు లేదా హెడర్‌కి ముందు నిర్దిష్ట 'కోడ్' వస్తుంది. ప్రమోషనల్ ఎస్ఎంఎస్‌లకు 'పి' (ఆంగ్ల అక్షరం), సర్వీస్ సంబంధితమైనవాటికి 'ఎస్', లావాదేవీలకు సంబంధించిన వాటికి 'టి', ప్రభుత్వం నుంచి వచ్చే మెసేజీలకు 'జి' అని కనిపిస్తుంది.ఈ కోడ్‌లతో ఏ ఎస్ఎంఎస్ ఏ కోవకి చెందినదో సులువుగా తెలుసుకునేందుకు వీలవుతుందని, అవాంఛిత మెసేజ్‌లకు దూరంగా ఉండొచ్చని టెలికం సంస్థల సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ఓటీటీ యాప్‌లపై నియంత్రణ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఈ నేపథ్యంలో ఓటీటీ యాప్‌లను కూడా నియంత్రణ పరిధిలోకి తీసుకొస్తే వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వీలవుతుందని కొచర్ పేర్కొన్నారు.

# వరుస నష్టాల నుంచి ఊరట

**జనంసాక్షి:**సూచీలు 4 రోజుల వరుస నష్టాల నుంచి కాస్త కోలుకోవడంతో, మదుపర్లు స్వల్ప ఊరట చెందారు. వాహన, ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం సూచీలకు కలిసొచ్చింది. రిటెయిల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం సానుకూల ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు లాభపడి 85.76 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.17% తగ్గి 69.09 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగియగా, షాంఘై సూచీ డీలా పడింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.68 లక్షల కోట్లు పెరిగి, రూ.460.33 లక్షల కోట్ల (5.36 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.సెన్సెక్స్ ఉదయం 82,233.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,253.46) ప్రతికూలంగా ప్రారంభమైంది. తదుపరి 82,221.74 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. అనంతరం లభించిన కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి వచ్చిన సూచీ ఒక దశలో 82,743.62 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 317.45 పాయింట్ల లాభంతో 82,570.91 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,245.20–25,088.45 పాయింట్ల మధ్య కదలాడింది.సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. సన్ ఫార్మా 2.71%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.69%, టాటా మోటార్స్ 1.55%, ట్రెంట్ 1.48%, ఎం అండ్ ఎం 1.28%, బజాజ్ ఫైనాన్స్ 1.01%, ఎస్‌బీఐ 0.92%, ఇన్ఫోసిస్ 0.91%, టీసీఎస్ 0.89%, అదానీ పోర్ట్స్ 0.82%, టెక్ మహీంద్రా



0.71% చొప్పున పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ 3.31%, ఎటెర్నల్ 1.57%, టాటా స్టీల్ 0.81%, కోటక్ బ్యాంక్ 0.68%, యాక్సిస్ బ్యాంక్ 0.67% నష్టపోయాయి.రంగాల వారీ సూచీలకొస్తే వాహన, ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎంసీజీ, స్థిరాస్తి, సేవల రంగాలు రాణించాయి. యుటిలిటీస్ సూచీ ఒక్కటే డీలా పడింది. బీఎస్ఈలో 2,504 షేర్లు సానుకూలంగా, 1,558 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 153 షేర్లలో మార్పు లేదు.అమెరికాకు చెందిన ఇన్‌సైట్ కార్పొరేషన్‌తో లెక్సెల్వి ఔషధానికి సంబంధించి పరిష్కార ఒప్పందం చేసుకోవడంతో సన్ ఫార్మా షేరు బీఎస్ఈలో 2.71% పెరిగి రూ.1,727.70 వద్ద ముగిసింది.జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నికర లాభం 9.7% తగ్గడంతో బీఎస్ఈలో షేరు 3.31% తగ్గి రూ.1,566.35 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.14,545 కోట్లు తగ్గి రూ.4,25,055 కోట్లకు పరిమితమైంది.అమెరికాకు చెందిన ఇన్‌సైట్ కార్పొరేషన్‌తో లెక్సెల్వి ఔషధానికి సంబంధించి పరిష్కార ఒప్పందం చేసుకోవడంతో సన్ ఫార్మా షేరు బీఎస్ఈలో 2.71% పెరిగి రూ.1,727.70 వద్ద ముగిసింది.జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నికర లాభం 9.7% తగ్గడంతో బీఎస్ఈలో షేరు 3.31% తగ్గి రూ.1,566.35 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.14,545 కోట్లు తగ్గి రూ.4,25,055 కోట్లకు పరిమితమైం ది.అగ్రిబిజినెస్ రంగంలో డిజిటల్ పరివర్తన దిశగా అడుగులు వేసేందుకు, ఏఐ ఆధారిత సేవలు, కన్సల్టింగ్ సేవలు అందిస్తున్న విప్రోతో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు క్రాపిన్ పార్ట్‌నర్స్ మంగళవారం ప్రకటించింది.మైగ్రేటెడ్ వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ (వీసీఎఫ్) ద్వారా మూసివేత నిబంధనల ఉల్లంఘనలు పరిష్కరించడంలో సహాయ పడటానికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఈ నెల 21 నుంచి సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రకటించింది. 2026 జనవరి 19 నాటికి ఈ పథకం పూర్తవుతుం దని సెబీ తెలిపింది.ప్రీమియం ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ఆపరేటర్ వుయ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ లిమిటెడ్, హెల్మెట్ల తయారీ సంస్థ స్టడ్స్ యాక్సెసరీస్ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది.విటోల్ ఏషియా పీటీఈ లిమిటెడ్ నుంచి 10 లక్షల టన్నుల ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)ను కొనుగోలు చేసేందుకు గ్యాస్ సేల్స్ అండ్ పర్చేజ్ అగ్రిమెంట్ (జీఎస్‌పీఏ)పై సంతకం చేసినట్లు ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ ఇండియా తెలిపింది. 2026 నుంచి పదేళ్ల పాటు ఈ ఒప్పందం అమల్లో ఉండనుంది.ఫిన్‌టెక్ సంస్థ ఇన్ఫిబీమ్ అవెన్యూస్ రూ.700 కోట్ల రైట్స్ ఇష్యూకు 1.4 రెట్ల స్పందన లభించింది.కున్‌షాన్ క్యూ టెక్ మైక్రోఎ లక్ట్రానిక్స్ (ఇండియా)లో 51% వాటా కొనుగోలు చేసేందుకు బైండింగ్ టర్మ్‌షీట్‌పై సంతకం చేసినట్లు డిక్సన్ టెక్నాలజీస్ వెల్లడించింది.నేటి బోర్డు సమావేశాలు టెక్ మహీంద్రా, ఐటీసీ హోటల్స్, ఏంజెల్ వన్, ఎల్‌టీ సర్వీసెస్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కల్పతరు, డీబీ కార్ప్

## విమానయాన రంగంలోకి జొమాటో సీఈఓ..

### ప్రైవేటు జెట్ కొనుగోలు



**జనంసాక్షి:**ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు, సీఈఓ పౌర విమానయాన రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు.ఇప్పటికే 'ఎల్ఏటీ ఏరోస్పేస్' పేరుతో ఏవియేషన్ వెంచర్‌ను ప్రారంభించిన ఆయన.. తాజాగా ఓ ప్రైవేటు జెట్ (%ూతీఇజుఖ్వ జీవ్%)ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేటు జెట్‌ను ఎల్ఏటీ ఏరోస్పేస్ కొనుగోలు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.ఈ బాంబర్డియర్ విమానం ఈ ఏడాది జూన్ నుంచి దిల్లీ ఎయిర్‌పోర్టులోని వీఐపీ బే వద్ద కన్పిస్తోంది. జులై 16 నుంచే దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఆ కథనాల సమాచారం. ఈ విమానం నిర్వహణ, ఇంజినీరింగ్ బాధ్యతలను ఇందమెర్ ఎంజెట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, బర్డ్ ఎగ్జిక్యూజెట్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ కంపెనీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ప్రైవేట్ జెట్ మోడల్, ఇతర ఫీచర్స్ గురించి ఇంకా తెలియరాలేదు.దీపిందర్ గోయల్ ఇటీవలే ఓ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసి వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్‌లో గల ఈ అపార్ట్‌మెంట్‌ను ఏకంగా రూ.52.3 కోట్లకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 91,000 (22 క్యారెట్లు) | ₹ 99,280 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,24,000

# తెగ వాడేస్తున్నారు

- అన్ని ఖర్చులకు క్రెడిట్ కార్డే దిక్కు
- రూ.50,000లోపు వేతన జీవుల ధోరణి
- 93 శాతం క్రెడిట్ కార్డులపై ఆధారపడిన వారే
- థింక్ 360.ఏఐ సంస్థ అధ్యయనంలో వెల్లడి



తక్కువ ఆదాయ వర్గాల వారికి క్రెడిట్ కార్డులు ఆధారంగా మారుతున్నాయి. రూ.50,000లోపు ఆదాయం ఉన్న వేతన జీవుల్లో 93 శాతం మంది అవసరాల కోసం క్రెడిట్ కార్డులపై ఆధారపడుతున్నట్టు థింక్ 360.ఏఐ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది.స్వయం ఉపాధిపై ఉన్న వారిలో 85 శాతం మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఉద్యోగం, స్వయం ఉపాధిలో ఉన్న 20,000 మంది వ్యక్తుల ఏడాది కాల ఆర్థిక తీరును అధ్యయనం చేసి థింక్ 360 ఈ వివరాలను విడుదల చేసింది.బై నౌ పే లేటర్ (బీఎన్‌పీఎల్/ఇప్పుడు కొని తర్వాత చెల్లించే సదుపాయం) సేవలను సైతం వీరు వినియోగిస్తున్నారు. స్వయం ఉపాధిలోని వారిలో 18%, వేతన జీవుల్లో 15% మంది బీఎన్‌పీఎల్‌ను వినియోగిస్తున్నారు. ఒకప్పుడు ఆకాంక్షలుగానే ఉన్న క్రెడిట్ కార్డులు, బీఎన్‌పీఎల్ సేవలు నేడు నిపుణుల నుంచి తాత్కాలిక ఉద్యోగుల వరకు.. ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారాయని థింక్360 వ్యవస్థాపకుడు, సీఈవో అమిత్‌దాస్ తెలిపారు. డిజిటల్ రుణాల్లో ఫిన్‌టెక్‌లు పోషిస్తున్న ముఖ్య పాత్రను కూడా ఈ సంస్థ తన నివేదికలో ప్రస్తావించింది.క్రెడిట్ కార్డు యూజర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ ఏడాది మార్చి నాటికి యాక్టివ్ కార్డులు 10 కోట్ల మార్క్‌ను దాటగా.. వచ్చే ఐదేళ్లలో (2029 మార్చి నాటికి) 20 కోట్లకు పెరుగుతాయని ఇటీవల పీడబ్ల్యూసీ అంచనా వేసింది. యూపీఐ దెబ్బకు డెబిట్ కార్డుల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. చెల్లింపులకు వచ్చే సరికి యూపీఐ తర్వాత క్రెడిట్ కార్డుల హవాయే నడుస్తోంది. బ్యాంకు ఖాతాలో బ్యాలన్స్ ఉంటేనే యూపీఐ. బ్యాలన్స్ లేకపోయినా క్రెడిట్ (అరువు)తో కొనుగోళ్లకు క్రెడిట్ కార్డులు వీలు కల్పిస్తాయి. అందుకే వీటి వినియోగం పట్ల ఆసక్తి పెరుగుతూ పోతోంది. కానీ, క్రెడిట్ కార్డ్‌లను ఇష్టారీతిన వాడేయడం సరికాదు. ఇది క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది. భవిష్యత్‌లో రుణాల అర్హతకు గీటురాయిగా మారుతుంది. రుణ ఊబిలోకి నెట్టేసే ప్రమాదం లేకపోలేదు.



# గగనతలంలో రారాజులు

**జనంసాక్షి:**భారత వైమానిక దళం (ఐఏఎఫ్) జాతీయ భద్రతకు మూలస్తంభంగా నిలుస్తోంది. నిత్యం గగనతలాన్ని కాపాడుతూ, దేశ రక్షణకు దోహదం చేస్తోంది. ముష్కర మూకలను ముద్దాడుతోన్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సింధూర్ సమయంలో చుక్కలు చూపించిన భారత వీరుల్లో ఐఏఎఫ్ ఆఫీసర్లు కీలకపాత్ర పోషించారు.యుద్ధంలోనే కాకుండా ఐఏఎఫ్ అధికారులు ఇతర సమయాల్లోనూ చాలానే విధులు నిర్వర్తిస్తారు. ఉద్యోగంలో చేరి ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నవారిపై మరింత బాధ్యతలుంటాయి. అయితే ఐఏఎఫ్‌లో ఎంట్రీ లెవల్ ఉద్యోగంగా ఉన్న ఫ్లయింగ్ ఆఫీసర్ ఎలాంటి విధులు నిర్వర్తిస్తారు..ఎలాంటి అధికారులున్నాయి.. ఏయే సవాళ్లున్నాయో వివరంగా తెలుసుకుందాం. ఫ్లయింగ్ ఆఫీసర్ అనేది ఐఏఎఫ్‌లో ఎంట్రీ లెవల్ కమిషన్డ్ ఆఫీసర్ ర్యాంక్. ఇది ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ లేదా ఇండియన్ నేవీలో సబ్ లెఫ్టినెంట్‌కు సమానం. దేశవ్యాప్తంగా రిక్రూట్ అయిన ఫ్లయింగ్ ఆఫీసర్లకు సాధారణంగా హైదరాబాద్‌లోని దుండిగల్‌లో ఎయిర్ ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ) లేదా ఇతర సంస్థల్లో కఠినమైన శిక్షణ అందిస్తారు. రిక్రూట్ అయిన తర్వాత ఫ్లయింగ్ బ్రాంచ్, టెక్నికల్ బ్రాంచ్ లేదా గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్ వంటి ఐఏఎఫ్ శాఖల్లో వారి ప్రతిభ ఆధారంగా పని చేయాలి. ఫ్లయింగ్ బ్రాంచ్‌లోని ఫ్లయింగ్ ఆఫీసర్లు ఆపరేషనల్ రోల్స్‌లో కీలకంగా వ్యవహరిస్తారు.
భారత వైమానిక దళంలో ఫ్లయింగ్ ఆఫీసర్ విధులుఫ్లయింగ్ బ్రాంచ్‌లోని ఫ్లయింగ్ ఆఫీసర్లకు వారి స్పెషలైజేషన్‌ను బట్టి యుద్ధ విమానాలు, రవాణా విమానాలు లేదా హెలికాప్టర్లతో సహా అధునాతన విమానాలను ఆపరేట్ చేయడం, వాటిని నిర్వహించాల్సి ఉంటుంది. యుద్ధ కార్యకలాపాలు: సుఖోయ్ ఎస్ యూ–30 ఎంకేఐ, రాఫెల్ లేదా తేజస్ వంటి ఫైటర్ స్క్వాడ్రన్లలో ఫ్లయింగ్ ఆఫీసర్లు ఎయిర్ టు ఎయిర్, ఎయిర్ టు గ్రౌండ్ యుద్ధ మిషన్లలో పాల్గొంటారు. వ్యూహాత్మక విన్యాసాలను అమలు చేయడం, కచ్చితమైన దాడులను నిర్ధారించడం, సంఘర్షణలు లేదా విన్యాసాల సమయంలో వైమానిక ఆధిపత్యాన్ని నిర్వహించడానికి వారు బాధ్యత వహిస్తారు.రవాణా స్క్వాడ్రన్లలో ఫ్లయింగ్ ఆఫీసర్లు సీ–130జే సూపర్ హెర్క్యులస్ లేదా ఐఎల్ –76 వంటి విమానాలను నడుపుతారు. దళాల రవాణా, విపత్తు సమయంలో, ఎయిర్ డ్రాప్స్, మారుమూల ప్రాంతాలకు సరఫరా మిషన్లను నిర్వహిస్తారు. తరచుగా సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో సిబ్బంది, సామగ్రిని సకాలంలో సురక్షితంగా డెలివరీ చేయాల్సి ఉంటుంది.హెలికాప్టర్ యూనిట్లలో ఫ్లయింగ్ ఆఫీసర్లు ఎంఐ–17, చినూక్ లేదా ధృవ్ వంటి విమానాలను నడుపుతారు. సెర్చ్ అండ్ రెస్క్యూ, క్యాజువాలిటీ తరలింపు, దళాల ప్రవేశం, విపత్తు సమయంలో వెంటనే ప్రతిస్పందించాలి. మిషన్ ప్లానింగ్, ఎగ్జిక్యూషన్: ఫ్లయింగ్ ఆఫీసర్లు మిషన్ లక్ష్యాలు, వాతావరణ పరిస్థితులు, ఇంటెలిజెన్స్ నివేదికలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. దాంతోపాటు ప్రీ–ఫ్లైట్ ప్లానింగ్‌లో పాల్గొంటారు. వారు గ్రౌండ్ సిబ్బంది, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, ఇతర యూనిట్లతో సమన్వయం చేసుకుని మిషన్లను నిరాటంకంగా అమలు చేయాలి. ఫ్లయింగ్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా శిక్షణ, వ్యాయామాల్లో పాల్గొనాలి. (ఉదా. వ్యాయామం గగన్ శక్తి లేదా రెడ్ ఫ్లాగ్ వంటి మల్టిలెవల్ వ్యాయామాలు). వీటివల్ల వారి ఎగిరే నైపుణ్యాలు, సంక్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే సామర్థ్యం మెరుగు పడుతుంది. కమిషన్డ్ ఆఫీసర్లుగా ఫ్లయింగ్ అధికారులు జూనియర్ స్థాయిలో కూడా కొన్నిసార్లు తమ బృందాలకు నాయకత్వం వహించాల్సి ఉంటుంది.స్క్వాడ్రన్ విధులు: ఒక స్క్వాడ్రన్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్లు స్క్వాడ్రన్ లీడర్లు లేదా వింగ్ కమాండర్లు వంటి సీనియర్ అధికారుల కింద పనిచేయాలి. ఈ సమయంలో ఎయిర్‌మెన్, టెక్నీషియన్లు లేదా గ్రౌండ్ క్రూ బృందాలకు నాయకత్వం వహించాల్సి ఉంటుంది. తమ యూనిట్‌లోని సభ్యులకు క్రమశిక్షణ, నైతిక స్థైర్యాన్ని నింపాలి.మిషన్ల సమయంలో ఫ్లయింగ్ ఆఫీసర్ సంక్లిష్టమైన విన్యాసాలు చేయాలి. ఇతర పైలట్లతో సమన్వయం చేస్తూ సెక్షన్ లీడర్ లేదా వింగ్ మ్యాన్‌గా నాయకత్వం వహించాలి. దీనికి క్షణాల్లో నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు అవసరం. ఫ్లయింగ్ ఆఫీసర్లు జూనియర్ ఎయిర్ మెన్, నాన్ కమిషన్డ్ ఆఫీసర్లకు మార్గనిర్దేశం చేస్తారు. ప్రొఫెషనలిజం, టీమ్ వర్క్ సంస్కృతిని పెంపొందిస్తారు. ఆపరేషనల్ పాత్రలకు మించి, ఫ్లయింగ్ ఆఫీసర్లు తమ యూనిట్లు సజావుగా పనిచేసేలా చూడాలి. అందుకు అడ్మినిస్ట్రేటివ్ విధులను నిర్వహిస్తారు. డాక్యుమెంటేషన్, రిపోర్టింగ్: మిషన్ లాగ్‌లు, ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ రిపోర్టులు, పనితీరు మదింపులతో సహా విమాన కార్యకలాపాల రికార్డులను నిర్వహిస్తారు. ఆపరేషనల్ అనాలిసిస్, సేఫ్టీ ఆడిట్‌లకు కచ్చితమైన డాక్యుమెంటేషన్ కీలకం.ఫ్లయింగ్ ఆఫీసర్లు సాంకేతిక బృందాలతో సంప్రదింపులు జరిపి విమాన మిషన్ సిద్ధంగా ఉండేలా చూస్తారు. నిత్యం వాటి పరిస్థితిని తనిఖీ చేస్తారు. నిర్వహణ షెడ్యూళ్లను సమన్వయం చేస్తారు. సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తారు. శిక్షణ యూనిట్లలో ఫ్లయింగ్ ఆఫీసర్లు క్యాడెట్లు లేదా కొత్త పైలట్లకు సూచనలు ఇవ్వడంలో, సిమ్యులేటర్ సెషన్లను పర్యవేక్షించడంలో, ప్రాథమిక విమాన శిక్షణలో సహాయపడుతారు. ట్రైనీలు ఐఏఎఫ్ ప్రమాణాలు, సేఫ్టీ ప్రోటోకాల్స్ పాటించేలా చూస్తారు. టెక్నికల్ బ్రాంచ్: టెక్నికల్ బ్రాంచ్ (ఏరోనాటికల్ ఇంజినీరింగ్ – ఎలక్ట్రానిక్స్ లేదా మెకానికల్)లో ఫ్లయింగ్ ఆఫీసర్లు విమానాలు, వ్యవస్థల నిర్వహణ, మరమ్మతులు, ఆపరేషనల్ సంసిద్ధతను పర్యవేక్షిస్తారు. సమస్యలను పరిష్కరించడానికి, విడిభాగాలను నిర్వహించడానికి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి టెక్నీషియన్లతో కలిసి పనిచేస్తారు.

# ఎగుమతుల్లేవ్..

- జూన్‌లో ఫ్లాట్‌గా.. 35 బిలియన్ డాలర్లు
- దిగుమతులు 54 బిలియన్ డాలర్లు
- సేవల ఎగుమతులు 33 బిలియన్ డాలర్లు
- నాలుగు నెలల కనిష్టానికి ద్రవ్యలోటు



**జనంసాక్షి:**వస్తు ఎగుమతులు జూన్ నెలలో 35.14 బిలియన్ డాలర్లుగా (రూ.2.99 లక్షల కోట్లు) నమోదయ్యాయి.2024 జూన్ నెలలోనూ ఎగుమతులు 35.16 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. దిగుమతులు 3.71 శాతం క్షీణించి 53.93 బిలియన్ డాలర్లు (రూ.4.58 లక్షల కోట్లు)గా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు నాలుగు నెలల కనిష్ట స్థాయిలో 18.78 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. పెట్రోలియం ఉత్పత్తులు, వస్త్రాలు, రత్నాభరణాలు, లెదర్, ముడి ఇనుము, ఆయిల్ సీడ్స్, జీడి పప్పు, దినుసులు, పొగాకు, కాఫీ ఎగుమతులు క్రితం ఏడాది జూన్ నెలతో పోల్చి చూస్తే క్షీణించాయి. ఇదే కాలంలో ఇంజినీరింగ్, టీ, బియ్యం, రెడీ మేడ్ వస్త్రాలు, కెమికల్స్, సముద్ర ఉత్పత్తులు, ఫార్మా ఎగుమతుల పరంగా సానుకూల వృద్ధి నమోదైంది. జూన్ త్రైమాసికంలో వస్తు, సేవల ఎగుమతులు 210 బిలియన్ డాలర్లుగా ఉంటాయని.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం కంటే 6 శాతం ఎక్కువని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భత్వాల్ తెలిపారు. జూన్‌లో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 16 శాతం తగ్గి 4.61 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ జుంచి జూన్ వరకు మొదటి త్రైమాసికంలో 15 శాతానికి పైగా తగ్గి 17.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు జూన్‌లో 47 శాతం పెరిగి 4.14 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలోనూ ఎగుమతులు 47 శాతం వృద్ధితో 12.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) వస్తు ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 2 శాతం పెరిగి 112 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు సైతం 4 శాతానికి పైగా పెరిగి 179 బిలియన్ డాలర్లకు చేరాయి. ఏప్రిల్–జూన్ కాలంలో వాణిజ్య లోటు 67 బిలియన్ డాలర్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 62 బిలియన్ డాలర్లుగా ఉంది.ముడి చమురు దిగుమతులు 8 శాతం తగ్గి 25.73 బిలియన్ డాలర్లుగా, బంగారం దిగుతులు 26 శాతం తగ్గి 1.9 బిలియన్ డాలర్ల చొప్పున జూన్‌లో నమోదయ్యాయి.జూన్‌లో సేవల ఎగుమతుల విలువ 32.84 బిలియన్ డాలర్లుగా ఉంటుందని వాణిజ్య శాఖ అంచనా వేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 28.67 బిలియన్ డాలర్లుగా ఉంది. సేవల దిగుమతుల విలువ 15 బిలియన్ డాలర్ల నుంచి 17.58 బిలియన్ డాలర్లకు పెరిగింది.

## నిరుద్యోగం పెరుగుతోంది

**జూన్‌లో 7.1 శాతం**

**దేశవ్యాప్తంగా 5.6 శాతం**

**పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడి**

జూన్‌లో నిరుద్యోగిత (నిరుద్యోగం రేటు) ఫ్లాట్‌గా నమోదైంది. ఈ ఏడాది మే నెలలో మాదిరే జూన్‌లోనూ 5.6 శాతం వద్దే (అన్ని వయసుల వారికి సంబంధించి) కొనసాగింది.ఏప్రిల్‌లో ఉన్న 5.1 శాతం కంటే కొంచెం ఎక్కువ. కానీ, పట్టణాల్లో నిరుద్యోగ రేటు వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. జూన్‌లో 7.1 శాతంగా నమోదైంది. ఈ మేరకు పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే వివరాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ విడుదల చేసింది. పనిచేయగల అర్హతలు ఉండీ, పనిదొరక్క ఖాళీగా ఉన్న వారి గురించి ఈ గణాంకాలు తెలియజేస్తాయి.పట్టణాల్లో అన్ని వయసుల వారికి సంబంధించిన నిరుద్యోగ రేటు 7.1 శాతానికి చేరింది. మేలో 6.9 శాతం, ఏప్రిల్‌లో 6.5 శాతం చొప్పున ఉండడం గమనార్హం. పట్టణాల్లో 15.29 సంవత్సరాల వారిలో నిరుద్యోగ రేటు జూన్‌లో 18.8 శాతానికి పెరిగింది. మే నెలలో ఇది 17.9 శాతంగా ఉంటే, ఏప్రిల్‌లోనూ 17.2 శాతంగా ఉంది.దేశవ్యాప్తంగా మహిళలకు సంబంధించి నిరుద్యోగ రేటు జూన్‌లో 5.6 శాతానికి తగ్గింది. మేలో ఇది 5.8 శాతంగా ఉంది.15–29 ఏళ్ల వయసు వారిలో నిరుద్యోగిత మే నెలలో 15 శాతంగా ఉంటే, జూన్‌లో 15.3 శాతానికి పెరిగింది.కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (15 ఏళ్లకు మించిన వారిలో) మే నెలలో ఉన్న 54.8 శాతం నుంచి జూన్‌లో 54.2 శాతానికి పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో 56.1 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50.4 శాతం చొప్పున జూన్‌లో నమోదైంది.పురుష కార్మికుల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 78.1 శాతం, పట్టణాల్లో 75 శాతం చొప్పున ఉంది. మే నెలతో పోల్చి చూస్తే స్వల్పంగా తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల భాగస్వామ్య రేటు జూన్‌లో 35.2 శాతానికి తగ్గింది.

## ఇజ్రాయెల్ ఓ క్యాన్సర్ కణితి లాంటిది

జరిగినా దీటుగా ప్రతిస్పందించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల 12 రోజుల పాటు జరిగిన యుద్ధంలో జోక్యం చేసుకున్న అమెరికా.. ఇరాన్‌లో అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. అదే సమయంలో ఇరాన్‌కు చెందిన అనేక మంది అణు శాస్త్రవేత్తలు, వందలాది మంది పౌరులను నెతన్యాహు సైన్యం అంతమొందించింది.

### 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం..

ఉత్పాదకత తక్కువగా ఉండటం, అన్ని రుతువుల్లోనూ పంట సాగుబడి చేయకపోవడం, రుణ లభ్యత అత్యంత తక్కువగా ఉండటం అనే మూడు కీలక సూచికల ఆధారంగా 100 జిల్లాలను గుర్తిస్తారు.ఈ పథకం సమర్థవంతంగా అమలు జరిగేలా పర్యవేక్షించేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ధన్–ధాన్య జిల్లాలో ఈ పథకం పురోగతిని 117 పెర్ఫామెన్స్ ఇండికేటర్ల ద్వారా పర్యవేక్షిస్తారు.దీని ద్వారా ఏటా 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నట్లు అంచనా.

# అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కనెక్షన్లు

- విద్యార్థులకు డెస్క్ బెంచీలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కనెక్షన్లు అందు బాటులోకి రానున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వేములవాడ అర్బన్ మండలం మారుపాకలోని అంగన్వాడి, ప్రీప్రై మరీ, ప్రైమరీ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి శుభ్రం చేయించాలని పంచాయత్ సెక్రటరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు.బడి బాట కార్యక్రమంలో ఏమి చేశారని ప్రశ్నించారు.ప్రైమరీ స్కూల్లోని తరగతి గదిలో విద్యార్థుల బెంచీలు సరైన క్రమంలో ఏర్పాటు చేసి వారికి వీలైనంత సువిశాల గదిని కేటాయించాలని, రంగులు వేయించాలన్నారు.

ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు లేకపోవడం గమనించి వెంటనే ఇతర పాఠశాలల్లో అధికంగా ఉన్న వాటిని ఇక్కడికి వెంటనే తెప్పించి, ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలకు సరైన ప్రహరీ ఉపాధి హామీ కింద నిర్మించాలని అధికారులను ఆదేశించారు. హైస్కూల్లోని 8,9,10 విద్యార్థులకు సైన్స్, సోషల్ మ్యాథ్స్ పాఠాలను కలెక్టర్ బోధించారు. విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు సరైన విధంగా విద్యాబోధన చేయవలసిందిగా ఉపాధ్యాయులకు ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల బరువును చెక్ చేశారు.పాఠశాల పరిసరాలు మొత్తం కలియ తిరిగి పరిశుభ్రంగా లేకపోవడం గమనించి వెంటనే శుభ్రం చేయించాలన్నారు. అంగన్వాడి భవనం వాటర్ లీకేజీ లేకుండా వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వంటగదిని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ సిబ్బందిని సన్మానించిన మంత్రి సీతక్క



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16 (జనం సాక్షి) :** మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సిబ్బందిని ఇన్చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సన్మానించారు. ఇన్చార్జి మంత్రిగా మొదటిసారి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన సీతక్కను కార్యకర్తలు, నాయకులు ఘనంగా సన్మానించారు. కామారెడ్డి పట్టణంలోని షబ్బీర్ అలీ నివాసంలో 45 సంవత్సరాల క్రితం ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి, బాణాసంచాలు పేల్చారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, 1980లో తమ తండ్రి మహమ్మద్ మాసూమ్ గ్రామ పంచాయతీ సభ్యుడిగా ఉన్నప్పుడు ఈ నివాసంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటైందని, కామారెడ్డి జిల్లా ఏర్పడిన తర్వాత దీనిని జిల్లా కార్యాలయంగా మార్చారని తెలిపారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, ముఖ్యమంత్రులు కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్, సిద్ధరామయ్య, రోశయ్య, రేవంత్ రెడ్డి, గులాం నబీ ఆజాద్, అశోక్ కుమార్ చౌహాన్, సుశీల్ కుమార్ షిండే, గవర్నర్ శివ శంకర్ తదితర కాంగ్రెస్ నాయకులు ఇక్కడ సమావేశాలు నిర్వహించారని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, గత 35 సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్యాలయ కార్యదర్శి లక్కపతిని గంగాధర్, సహాయ సిబ్బంది మల్లయ్య, రజాక్‌లను సన్మానించడం ఆనందంగా ఉందని, ఫోటో గ్యాలరీ చూస్తే గర్వంగా అనిపించిందని తెలిపారు. ఈ కార్యాలయం నుండి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన, బీసీ డిక్లరేషన్ డ్రాఫ్ట్ చేసి ఎన్నికల హామీగా ప్రకటించి అమలు చేయడం జరిగిందని, ఈ కార్యాలయం కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంతో కలిసి వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎండుతున్న బావులు

# వానమ్మ... రావమ్మ..!



ఆకాశం మేఘాలతో కమ్ముకున్నా, వర్షం రాక రైతన్న గుండెల్లో ఆందోళన చోటు చేసుకుంది. కోనమ్మ చెరువు కింది పొలాలు దాహంతో అలమటిస్తున్నాయి. తొలకరి జల్లుల కోసం అన్నదాతల కళ్లు ఆకాశంలోనే స్థిరమైనాయి. "వానమ్మా, రావమ్మా!" అంటూ పుడమితల్లి దాహాన్ని తీర్చాలని రైతుల ఆర్తనాదం హృదయాన్ని కదిలిస్తోంది. నీరందని బీడైన భూమి, నారు ముదిరినా నాట్లు వేయలేని నిస్సహాయత, వర్షాభావంతో నీరసించిన సాగు పనులు... రైతన్న ఆశలు వర్షంపైనే నిలిచాయి. జూన్‌లో కురిసిన వానలు కొంత ఉపశమనం ఇచ్చినా, జూలైలో వరుణుడు ముఖం చాటేయడంతో ఆశలు ఆవిరైపోతున్నాయి. చెరువులు నిండక, బావుల నీరు ఆధారంగా సాగు చేస్తున్న రైతుల ఆవేదన, వర్షం కోసం ఎదురుచూసే వారి కన్నీళ్లు గుండెను పిండేస్తున్నాయి.

## వర్షాలు లేక నెమ్మదించిన వరి నాట్లు!

- నారు ముదిరి అదును దాటుతుందని రైతుల్లో ఆందోళన
- పది రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- వాతావరణం చల్లబడటంతో వర్షాలపై అన్నదాతల ఆశలు

**రాయికల్ జూలై (జనం సాక్షి):** రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామం కోనమ్మ చెరువు కింద పొలాలు ఇవి. ఇక్కడ సుమారు 10వేల ఎకరాల వరకు ఆయకట్ట ఉండగా కోనమ్మ చెరువు కట్టకు సమీపంలోని రైతులు నాట్లు పూర్తి చేశారు. చివరి ఆయకట్ట వరకు సాగు నిరందక చాలామంది ఇప్పటివరకు నాట్లు వేయలేదు. మరోసారి భారీ వర్షం పడితేనే ఆయకట్టు చివరి వరకు నిరందే పరిస్థితి సుమారు 5000 ఎకరాలు వరకు ప్రస్తుతం నీరందక బిళ్లుగానే ఉన్నాయి. భారీ వర్షాలు లేక జులైలో సాగు పనులు నెమ్మదించాయి. పది రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో మండలంలోని పలుచోట్ల వరి నాట్లు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత వర్షాకాలంలో విభిన్న వాతావరణం పరిస్థితులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జూన్ లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండగా, జులైలో సాధారణ వర్షపాతం నమోదైనది. జూన్‌లో భారీవర్షాలు కురవడంతో సాగు పనులు ఊబందుకున్నాయి. అయితే జూలైలో ప్రారంభం నుంచి మళ్లీ చినుకు పడలేదు.సీజన్ ప్రారం భంలో కరువు పరిస్థితులు ఉన్నా జూన్‌లో కురిసిన వర్షాలతో ప్రస్తుతం సాధారణ స్థాయికి చేరుకుంది. తొలకరి జల్లులు కోసమే దాదాపుగా పది రోజుల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. జూన్ లో వర్షాలకు సాగు వేగం పుంజుకుంది. అయితే వర్షాలు పడక చెరువులు నిండక రైతులు ఆందోళన చెందుతున్నారు. నారు ఎదిగినా జూలై లో వానలు లేకపోవడంతో పొలం దమ్ము చేసి పనులు ముందుకు సాగడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బావులు నుంచి మోటర్లు, సాయంతో నీటి తడులు అందిస్తున్నారు. మరికొందరు రైతులు రెండు మూడు రోజులపాటు నీళ్లు పెట్టించి ట్రాక్టర్లతో వీల్స్ కొట్టిస్తున్నారు.

వానమ్మ.. రావమ్మ అంటూ తొలకరి వర్షాల కోసం మండల రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. వర్షాలు మురిపిస్తాయి అనుకుంటే అసలు జాడనే లేకపోవడంతో దిగులు చెందుతున్నారు.రైతులు పత్తి విత్తనాలు మొక్కజొన్న విత్తనాలు, వేశారు. అక్కడక్కడ చిన్నపాటి చినుకులు పడుతాయని తప్ప పెద్ద వర్షాలు జాడలేదు.అయినా నీటి వసతులు ఉన్న రైతులు విత్తనాలు వేసేశారు. వాన కోసం రైతన్న ఎదురుచూస్తున్నారు.

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన తాహసిల్దార్ విజయ్ కుమార్



**కొడంగల్ ,జూలై 16(జనం సాక్షి):** కొడంగల్ పట్టణ కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని కొడంగల్ తాహసిల్దార్ బి. విజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.ప్రిన్సిపాల్ నగేష్ విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు.

# మరోమారు మానవత్వాన్ని చాటుకున్న మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** సందర్భం వచ్చినప్పుడల్లా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. దిగులు చెందొద్దు... అండగా నేను ఉంటానంటూ రోడ్డు ప్రమాద బాధితుడికి ఆపన్న హస్తం అందించారు. సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించేలా చొరవ చూపించారు. మంగళవారం రాత్రి అధికారిక కార్యక్రమాలను ముగించుకొని వస్తున్న సమయంలో కేబుల్ బ్రిడ్జి కి సమీపంలో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న ఓ యువకుడిని చూసి చలించిపోయారు. వెంటనే తన వాహనాన్ని ఆపి కిందకి దిగి... బాధితుడికి ఆందోళనకు గురి కావొద్దంటూ ధైర్యం చెప్పారు. స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. స్వయంగా దగ్గరుండి క్షతగాత్రుడిని ఆటోలో నిమ్స్ ఆసుపత్రికి పంపించారు. సాయంగా ఓ కానిస్టేబుల్ ను కూడా వెంట పంపించారు. ఏదైనా అవసరం అయితే ఫోన్ చేయమని... వ్యక్తిగత సహాయకుడి ఫోన్ నంబర్ ఇచ్చారు. ఆసుపత్రికి చేరుకోగానే నిమ్స్ వైద్యులతో ఫోన్లో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చొరవ తీసుకున్నారు. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందేలా కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని మారుపాక వద్ద సర్వే నంబర్ 339 లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. స్థలం హద్దులు సిద్ధం చేయాలని, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంక్ నిర్మాణ ఏర్పాటుకు ప్రతిపా దనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంద న్నారు. ఆయన వెంట వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీఓ అన్సార్, తహసిల్దార్, పంచాయతీ రాజ్ ,ఇరిగేషన్ అధికారులు, డిపిఓ పాల్గొన్నారు.





# రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 16 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11 గంటల 05 నిముషాలకు డిచ్ పల్లిలోని పోలీస్ బెటాలియన్ కు చేరుకున్న గవర్నర్ ను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు పూల మొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు కేఆర్. సురేష్ రెడ్డి, కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ, తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి తదితరులు గవర్నర్ కు సాదర స్వాగతం పలికారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, బెటాలియన్ గెస్ట్ హౌస్ ఆవరణలో ఉన్నతాధికారులతో కలిసి గవర్నర్ మొక్కలు నాటారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రత్యేక కాన్వాయ్ లో గవర్నర్ తెలంగాణ విశ్వ విద్యాలయానికి చేరుకుని, స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. గవర్నర్ పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి నేతృత్వంలో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



# వడ్డీ వ్యాపారి తీరుతో తల్లి ఆత్మహత్య

**ఆర్మూర్, జూలై 16 (జనం సాక్షి):** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని రాజారాం నగర్‌లో వడ్డీ వ్యాపారి వేధింపుల కారణంగా శశికళ అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. శశికళ కొడుకు వడ్డీ వ్యాపారి వద్ద అధిక వడ్డీతో అప్పు తీసుకున్నాడు. అయితే, వడ్డీ వ్యాపారి యొక్క నిత్య వేధింపులను భరించలేక కొడుకు ఇంటిని వదిలి వెళ్లిపోయాడు.

దీంతో వడ్డీ వ్యాపారి, శశికళను అసలు మొత్తం తో పాటు వడ్డీ చెల్లించాలని ఒత్తిడి చేశాడు. చెల్లించలేని స్థితిలో ఉన్న శశికళను వ్యాపారి తన ఇంటిలో ఇంటి పనులకు వాడుకునేవాడు. ఈ అవమానకరమైన పరిస్థితులు మరియు నిరంతర వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన శశికళ ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక వడ్డీలతో పేదలను ఇబ్బంది పెట్టి, వారి జీవితాలను బలిగొంటున్న వడ్డీ వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి అక్రమ వడ్డీ వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం చూడాలని కోరుతున్నారు.

## మహిళలు ఆర్థికంగా బలపడేందుకు

# స్వయం సమృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం కృషి

- స్వయం సమృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం కృషి
- 8552 మహిళా సంఘాలకు రూ 12 కోట్ల వడ్డీ తిరిగి చెల్లింపు
- నేటి నుండి పంపిణీకి ఏర్పాట్లు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 16 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్రంలోని మహిళామణులు ఆర్థికంగా బలప డేందుకు, స్వయం సమృద్ధి సాధించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు(ఎస్ హెచ్‌జీ)లు ఇందిరా మహిళా శక్తి కింద తీసుకున్న రుణాల కు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ తిరిగి చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో రుణాలు తీసుకొని, సకాలంలో చెల్లించిన జిల్లాలోని 8552 మహిళా సంఘాలకు(ఎస్ హెచ్ జీ) దాదాపు రూ 12 కోట్ల వడ్డీ డబ్బులు పంపిణీ చేయనున్నారు.

**నేటి నుండి పంపిణీ.**

జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు (ఎస్ హెచ్ జీ) 8552 లకు నేడు వేములవాడ నియోజకవర్గంలో, రేపు సిరిసిల్ల నియోజకవర్గంలో పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**నాలుగు నియోజకవర్గాల పరిధిలో..**

వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వేములవాడ అర్బన్ మండలంలోని 365 మహిళా సంఘాలకు,రూ 46.84 లక్షలు, వేములవాడ రూరల్ మండ లంలోని 442 సంఘాలకు రూ58.81 లక్షలు, చందుర్తి మండలంలోని 613 సంఘాలకు రూ 82.50 లక్షలు, రుద్రంగి మండలంలోని 325 సంఘలకు రూ41.61 లక్షలు, కోనరావుపేట మండ లంలోని 910 సంఘలకు రూ 113. 32 లక్షలు, మొత్తం 2655 సంఘాలకు రూ.3 కోట్ల 43 లక్షల వడ్డీ రానున్నది. సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్ళపల్లి మండలంలోని 926 సంఘాలకు రూ 124.40 లక్షలు, గంభీరావుపేట మండలంలోని 1004 సంఘాలకు రూ141.34 లక్షలు, ముస్తాబాద్ మండ లంలోని 1018 సంఘలకు రూ 138.68 లక్షలు, వీర్నపల్లి మండలంలోని 280 సంఘలకు రూ34.76 లక్షలు, ఎల్లారెడ్డిపేట మండలంలోని 1022 సంఘాలకు రూ 150.85 లక్షలు.మొత్తం 4250 సంఘాలకు రూ 5కోట్ల 90 లక్షల వడ్డీ రానున్నది. చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలోని 696 సంఘాలకు రూ 98.90 లక్షలు,మానకొండూరు నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలోని 951 సంఘాలకు రూ.145. 51 లక్షల వడ్డీ రానున్నది.

**మహిళా సంఘాల సభ్యుల్లో ఆనందం.**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 8552 మహిళా సంఘాలకు రూ 11 కోట్ల 77 లక్షల 52 వేల వడ్డీ తిరిగి చెల్లించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాము తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ తిరిగి చెల్లించనుండడంతో మహిళా సంఘాల సభ్యులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు వేగవంతం చేయాలి





- ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి
- ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి
- అన్ని మందులు అందుబాటులో ఉంచాలి
- జమ్మికుంట సామాజిక ఆస్పత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జమ్మికుంట, జూలై 16 (జనం సాక్షి):** జమ్మికుంట సామాజిక ఆసుపత్రి పరిధిలో మహిళలందరికీ ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షలు వేగవంతం చేయాలని, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. వార్డులు, ఓపి విభాగం, ల్యాబ్, మెడికల్ స్టోర్స్, లేబర్ రూమ్ సందర్శించారు. వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది వారికి అందిస్తున్న సేవలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని, వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు. ప్రతి నెలా ఓపి, ఐపి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మహిళ, డెలివరీల నెలవారి నివేదికలను సిద్ధం చేసి పంపాలని అన్నారు. రోగుల పట్ల మానవీయకోణంలో వ్యవహరించి వారికి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా బీపీ, షుగర్ సంబంధిత మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటులో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉచితంగా మందులు తీసుకునేలా చూడాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 13 సంవత్సరాలు నిండిన మహిళలు, బాలికలందరికీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు.ఆస్పత్రికి వచ్చే రోగులకు వివిధ రకాల ఆరోగ్య సేవలు సులభంగా అర్థమయ్యే విధంగా బోర్డులు డిస్ప్లే చేయాలన్నారు. టీబి వ్యాధి నివారణకు వీలైనన్ని ఎక్కువ పరీక్షలు చేయాలన్నారు. ఊయలను అందరికీ కనిపించేలా ఆవరణలో ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు క్యాల్షియం, ఐరన్, మల్టీ విటమిన్, విటమిన్ సి మాత్రలు పంపిణీ చేయాలన్నారు. హాస్పిటల్లో కావలసిన అత్యవసర సదుపాయాలను వెంటనే సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేట్ అంబులెన్సులు ఆస్పత్రికి దూరంగా నిలపాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సనా పాల్గొన్నారు.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



## నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా జో రూట్.. బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో జో రూట్, జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో నిలిచారు. బుధవారం విడుదలైన తాజా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ 888 పాయింట్లతో నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్నాడు. లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన మూడో టెస్ట్‌లో 104 మరియు 40 పరుగులు చేసిన రూట్, ఈ విజయంతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో 22 పరుగుల తేడాతో గెలిచింది. న్యూజిలాండ్ సీనియర్ ఆటగాడు కేన్ విలియమ్సన్ రెండో స్థానంలో, ఇంగ్లండ్ యువ బ్యాట్స్‌మెన్ హ్యారీ బ్రూక్ రెండు స్థానాలు దిగజారి మూడో స్థానంలో, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానంలో ఉన్నారు.

టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం దిగజారి ఐదో స్థానంలో, సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా ఆరో స్థానంలో, శ్రీలంక ఆటగాడు కమిందు మెండిస్ ఏడో స్థానంలో, టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఒక స్థానం దిగజారి ఎనిమిదో స్థానంలో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు దిగజారి తొమ్మిదో స్థానంలో, ఇంగ్లండ్ ఆటగాడు జేమీ స్మిత్ పదో స్థానంలో నిలిచారు. లార్డ్స్ టెస్ట్‌లో 72 పరుగులు, 61 నాటౌట్‌తో రవీంద్ర జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానంలో, కేఎల్ రాహుల్ 100 మరియు 39 పరుగులతో ఐదు స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో నిలిచారు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 77 పరుగులు, ఐదు వికెట్లతో రెండు స్థానాలు ఎగబాకి 42వ స్థానంలో నిలిచాడు.

బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 901 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబాడా రెండో స్థానంలో, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమమైన ఆరో స్థానంలో నిలిచాడు. బోలాండ్ టెస్ట్ క్రికెట్‌లో 62 వికెట్లను 16.53 సగటుతో సాధించాడు, ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ జార్జ్ లోహ్మాన్, సిడ్నీ బార్న్స్ తర్వాత మెరుగైన సగటుతో వికెట్లు తీసిన ఆటగాడిగా నిలిచాడు. టాప్-10లో ఆస్ట్రేలియా బౌలర్లు పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో బోలాండ్ కూడా చోటు దక్కించుకున్నాడు. 1958లో ఇంగ్లండ్ జట్టు టాప్-12లో ఆరుగురు బౌలర్లు ఉండగా, ప్రస్తుతం ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు టాప్-10లో స్థానం సంపాదించారు. టీమిండి యా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి ఎగబాకాడు.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ



టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అరుదైన రికార్డు సృష్టించాడు. టీ20, టెస్ట్ ఫార్మాట్‌ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, బుధవారం ఐసీసీ విడుదల చేసిన ఆల్-టైమ్ టీ20 ర్యాంకింగ్స్‌లో కోహ్లీ సత్తా చాటాడు. ఆయన టీ20 రేటింగ్ 897 నుంచి 909 పాయింట్లకు పెరిగింది. దీంతో, టెస్టుల్లో 937, వన్డేల్లో 911, టీ20లో 909 రేటింగ్ పాయింట్లతో మూడు ఫార్మాట్‌లలో 900 మార్క్ దాటిన భారత ఏకైక ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. ఆల్-టైమ్ టీ20 ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ ఆటగాడు డేవిడ్ మలన్ 919 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ 909 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నారు. 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత కోహ్లీ టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, 125 టీ20 మ్యాచ్‌లలో 137.04 స్ట్రైక్ రేట్‌తో 4,188 పరుగులు, ఒక సెంచరీ, 38 హాఫ్ సెంచరీలతో అద్భుత రికార్డు నమోదు చేశాడు. 2017, 2018లో ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న కోహ్లీ, తాజా ర్యాంకింగ్స్‌లో తన ప్రతిభను మరోసారి నిరూపించాడు.

తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ 888 పాయింట్లతో మళ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. టీమ్ ఇండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ 801 పాయింట్లతో ఒక స్థానం కోల్పోయి ఐదో స్థానంలో, రిషబ్ పంత్ 779 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 765 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా 901 పాయింట్లతో నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబాడ 851 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, బుమ్రాతో 50 పాయింట్ల తేడా ఉంది.

### మూడో స్థానానికి పడిపోయిన ఇంగ్లండ్

లార్డ్స్ టెస్ట్‌లో టీమ్ ఇండియాను 22 పరుగుల తేడాతో ఓడించిన ఇంగ్లండ్ సిరీస్‌లో ఆధిక్యం సాధించినప్పటికీ ఆతిథ్య దేశానికి షాక్ తప్పలేదు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లండ్‌పై మ్యాచ్ ఫీజు విధించడమే కాకుండా, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో రెండు పాయింట్లు కోల్పోయింది. దీని కారణంగా ఇంగ్లండ్ జట్టు పట్టికలో మూడో స్థానానికి పడిపోయింది.

# ఇంటికొకరు సీపీఆర్ శిక్షణ తీసుకోండి

## సీపీఆర్‌పై డాక్టర్ శ్రీనివాస్ చేస్తున్న సేవలు అమూల్యం
## సీపీఆర్‌పై రూపొందించిన పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 16 (జనంసాక్షి) :** అకస్మాతుగా గుండె ఆగి పడిపోయిన వ్యక్తిని చేతులతో చాతీ మర్ధన చేసి తిరిగి బతికించే కార్డియో పల్మోనరీ రీససిటేషన్ ప్రక్రియపై గత మూడు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా శిక్షణ ఇస్తూ, ఎన్నో అవార్డులు అందుకున్న డాక్టర్ రామక శ్రీనివాస్ సేవలు అద్భుతమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. సీపీఆర్ ద్వారా ఎంతోమంది ప్రాణాలను నిలిపిన డాక్టర్ శ్రీనివాస్ ధన్యజీవి అని పేర్కొన్నారు. ప్రస్తుతం గుండె పోటు మరణాల సంఖ్య ఎక్కువైన నేపథ్యంలో ప్రతి ఇంటికి కనీసం ఒక్కరైనా సీపీఆర్ ప్రక్రియపై శిక్షణ తీసుకోవాలని పిలుపునిచ్చారు. బుదవారం రోజు సాయంత్రం కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి వచ్చిన డాక్టర్ శ్రీనివాస్ కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలిశారు. సీపీఆర్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా రూపొందించిన స్టాంప్ ని కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింప జేశారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు సీపీఆర్ పై పోస్టల్ స్టాంప్ ని ముద్రించడం నిజంగా అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... అకస్మాతుగా గుండె ఆగి పడిపోయిన వ్యక్తిని సాధారణంగా ఎవరైనా ఆసుపత్రికి తీసుకెళ్లడంలో ఏమాత్రం ఆలస్యమైనా చనిపోయే ప్రమాదముందన్నారు. కానీ గుండె ఆగిపోయి పడిపోయిన వెంటనే సీపీఆర్ చేస్తే రోగి లేచే అవకాశముందని, తర్వాత తీసుకుపోతే సకాలంలో వైద్యం అంది బతికుతారని చెప్పారు. ఈమధ్య కాలంలో గుండెపోటు మరణాలు చాలా ఎక్కువ అయ్యాయని, ఆహారపు అలవాట్లు, సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి కారణాలే ప్రధాన కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇంటికి ఒకరు సిపిఆర్ లో శిక్షణ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కపిలవాయి రవీందర్ తోపాటు పలువురు పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోహిత్, కోహ్లీ ఉంటే మూడో టెస్టులో గెలిచేదేమో!

## బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యా

రోహిత్, కోహ్లీ ఉంటే మూడో టెస్టులో టీమిండియా గెలిచేదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అభిప్రాయపడ్డారు. దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత యువ టీమిండియా ఇంగ్లాండ్‌లో ఐదు టెస్టుల సిరీస్‌లో పోరాడుతోంది. తొలి మూడు టెస్టులు ముగిసేసరికి భారత్ 1-2తో వెనుకంజలో ఉన్నప్పటికీ, చాలా వరకు మ్యాచ్‌లలో ఆధిపత్యం చెలాయించింది. మూడో టెస్టులో అనుభవం లేకపోవడం వల్ల ఓటమి చెందిందని, రోహిత్, కోహ్లీ ఉంటే ఫలితం వేరుగా ఉండేదని అభిమానులు చర్చిస్తున్నారు. ఈ విషయంపై శుక్లా స్పందిస్తూ, ఈ దిగ్గజ ఆటగాళ్లు ఉంటే మూడో టెస్టులో గెలిచే అవకాశం ఉండేదని అంగీకరించారు. అయితే, వారి రిటైర్మెంట్ నిర్ణయంలో బీసీసీఐ పాత్ర లేదని, రిటైర్మెంట్ వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు. బోర్డు ఎవరినీ రిటైర్ కావాలని ఆదేశించదని తెలిపారు. గత ఏడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత రోహిత్, కోహ్లీ టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పగా, ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటన తర్వాత వారు టెస్టుల నుంచి కూడా తప్పుకున్నారు. అయినప్పటికీ, వన్డే ఫార్మాట్‌లో కొనసాగుతామని వారు ప్రకటించారు. ఈ దిగ్గజ ఆటగాళ్లు వన్డేలకు అందుబాటులో ఉండటం సానుకూల పరిణామమని శుక్లా పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతంగా రాణించాడని, ఒక డబుల్ సెంచరీ, రెండు సెంచరీలతో సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడని, ఆటగాడిగానే కాక కెప్టెన్‌గా కూడా ఆకట్టుకున్నాడని శుక్లా ప్రశంసించారు.

# బ్రిటన్ రాజుకు గిఫ్ట్

## రాజీవ్ శుక్లాపై మండిపడ్డ నెటిజన్లు



ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత పురుష, మహిళల క్రికెట్ జట్లు మంగళవారం బ్రిటన్ రాజు చార్లెస్-3ని సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా కలిశాయి. ఈ సందర్భంగా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, చార్లెస్-3కి తాను రచించిన 'స్కార్స్ ఆఫ్ 1947: రియల్ పార్టీషన్ స్టోరీస్' పుస్తకాన్ని బహుమతిగా అందించారు. 1947లో భారత విభజన సమయంలో జరిగిన సంఘటనలు, బాధితుల వాస్తవ కథనాల ఆధారంగా రాసిన ఈ పుస్తకం గురించి రాజు ఆసక్తిగా చర్చించారని శుక్లా తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేస్తూ ఫొటో షేర్ చేశారు. ఈ పోస్ట్ నెట్టింట వైరల్ కాగా, నెటిజన్లు శుక్లా బహుమతి ఎంపికపై తీవ్రంగా విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బ్రిటిష్ పాలనతో ముడిపడిన దారుణాల గురించి బ్రిటిష్ రాజుకు పుస్తకం బహుమతిగా ఇవ్వడం సమంజసమా అని ప్రశ్నిస్తూ, "ఈ బహుమతికి బదులు కోహినూర్ వజ్రాన్ని తిరిగి తీసుకురండి" అని కొందరు కామెంట్ చేశారు. "బ్రిటిషర్లు మిగిల్చిన గాయాల గురించి రాజుకే పుస్తకం ఇవ్వడం చరిత్రలోనే గొప్ప మీమ్‌గా మిగిలిపోతుంది" అని మరికొందరు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో రాజు ఆటగాళ్లతో వ్యక్తిగత వివరాలు, లార్డ్స్ టెస్ట్ మ్యాచ్ గురించి చర్చించారు. ముఖ్యంగా మహ్మద్ సిరాజ్ ఔటైన విధానాన్ని "దురదృష్టకరం" అని పేర్కొన్నారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, "చివరి బ్యాటర్ ఔటైన విధానం గురించి రాజు అడిగారు. అది దురదృష్టకరమైన మ్యాచ్, కానీ వచ్చే రెండు మ్యాచ్‌లలో రాణిస్తామని చెప్పాము" అని తెలిపారు.

# అల్ఫోర్స్ విద్యార్థుల సత్తా

## దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన విద్యార్థుల సన్మానం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 16 (జనం సాక్షి):** చక్కటి ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణతో విద్యను అందించడం ద్వారా ఘనవిజయాలను సాధించవచ్చని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించగలమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ఐటి, ఎన్ఎఫ్ఐటి, ఎయిమ్స్‌లలో సీట్లు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో డా. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచి ఐఐటి, నీట్‌లలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ నిపుణుల ద్వారా బలమైన ఫౌండేషన్ అందిస్తోందని డా. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఫౌండేషన్ ఫలితంగా సుమారు 35 మంది విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ఐటి, ఎన్ఎఫ్ఐటిలలో సీట్లు సాధించారని, ఒకరు హైదరాబాద్ ఎయిమ్స్‌లో, నలుగురు సీట్లు సాధించినట్లు తెలిపారు. ఐఐటిలలో సీట్లు సాధించిన విద్యార్థులలో ఎన్. అనిరుద్ సాయి, జె. వామిక (ఐఐటి హైదరాబాద్), వి. సంజితారెడ్డి, కె. వీరేంద్ర ప్రసాద్, డి. త్రిదం సాయి (ఐఐటి ఖరగ్పూర్), యు. హాసిని (ఐఐటి ధన్బాద్), జి. ప్రభంజన్ రెడ్డి (ఐఐటి ఇండోర్), వి. శశాంక్ రెడ్డి (ఎయిమ్స్, హైదరాబాద్) ఉన్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రణాళికబద్ధమైన విద్య, యజమాన్యం తోడ్పాటు, ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల విజయానికి కారణమని తల్లిదండ్రులు, విద్యార్థులు యజమాన్యాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అత్యుత్తమ విద్య ద్వారా విజయాలు సాధించిన విద్యార్థులను, డా. నరేందర్ రెడ్డిని తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టాపార్డర్ వైఫల్యంతోనే టీమిండియా ఓటమి

## మాజీ కెప్టెన్ సౌరవ్ గూంగులీ

టాపార్డర్ వైఫల్యంతోనే ఇంగ్లండ్‌తో మూడో టెస్ట్‌లో టీమిండియా ఓటమిపాలైందని మాజీ కెప్టెన్ సౌరవ్ గూంగులీ అన్నాడు. రవీంద్ర జడేజా అద్భుత ప్రదర్శన కనబర్చినప్పుడు టాపార్డర్‌కు ఏమైందని ప్రశ్నించాడు. ఒక్క బ్యాటర్ మెరుగ్గా రాణించినా ఫలితం మరోలా ఉండేదని చెప్పాడు. భారత బ్యాటర్ల వైఫల్యం తీవ్ర నిరాశకు గురి చేసిందని అసహనం వ్యక్తం చేశాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్‌లో టీమిండియా 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. టెయిలెండర్స్ సాయంతో ఆఖరి వరకు రవీంద్ర జడేజా చేసిన పోరాటం వృథా అయ్యింది. ఓ దశలో భారత్ గెలిచేలా కనిపించింది. కానీ హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్ చివరి వికెట్‌గా వెనుదిరగడంతో భారత ఓటమి లాంఛనమైంది. షోయబ్ బషీర్ వేసిన బంతి సిరాజ్ బాగానే డిఫెన్స్ చేసినా.. నెమ్మదిగా వెళ్లి వికెట్లను తాకింది. దాంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడినా.. రవీంద్ర జడేజా పోరాటం ఆకట్టుకుంది. దాంతో అందరూ అతనిపై ప్రశంసల జల్లు కురిపించారు. టీమిండియా ఓడినా బాధగా లేదని పోస్ట్‌లు పెట్టారు.

# మహిళా సంఘాలకు రూ.26 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు

- సాగునీటి వాటాల్లో రాజీపడే ప్రసక్తి లేదు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు 26 వేల కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం పెద్దపల్లి లోని జూనియర్ కళాశాల గ్రౌండ్ లో నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు రామగుండం ఎమ్మెల్యే మక్కా సింగ్ రాజ్ ఠాగూర్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబరాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించడం తో పాటు లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళల ఆదాయం పెంచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, ఆర్టిసి కు అద్దె బస్సులు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు.

మంథని, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో మహిళా సంఘాల ద్వారా మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళల ద్వారా రైతులు పండించిన పంటను మద్దతు ధరతో కొనుగోలు చేశామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు పెద్దపల్లి పట్టణంలో వీ - హబ్ మంజూరు చేశామని, మరో నెల రోజుల్లో దీనిని ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో విధానపరమైన చర్చలు జరిపి గోదావరి, కృష్ణ నది జలాల్లో మన హక్కులు కాపాడేందుకు, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని, రాజీ పడే ప్రసక్తి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో పాటు పలు శాఖల ముఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే తెలంగాణ విశ్వవిద్యాలయం అగ్రభాగాన ఉంది






- గవర్నర్, ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ
- నిజామాబాద్ జిల్లా ప్రముఖులతో గవర్నర్ ఇష్టాగోష్టి
- ఫొటో ఎగ్జిబిషన్ సందర్శన

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 16 (జనం సాక్షి):** తెలంగాణ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో అగ్రభాగాన ఉందని గవర్నర్, ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. విశ్వవిద్యాలయ రెండవ స్నాతకోత్సవం విజయవంతమైందని వైస్-ఛాన్సలర్ ఆచార్య టి.యాదగిరిరావు పేర్కొన్నారు. క్రీడా మైదానంలో భారీ బందోబస్తు మధ్య స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించారు. గవర్నర్ ప్రసంగిస్తూ, తెలంగాణ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని, 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమై నేడు 31 కోర్సులతో విస్తరించినట్లు తెలిపారు. 19 ఏళ్లలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థుల కృషి ప్రతిబింబిస్తుందన్నారు. విద్య నాణ్యత, సాంకేతికత, ఉపాధి కల్పనకు మార్గం నిర్దేశిస్తుందని, 2023-24 ఆర్థిక సర్వే ప్రకారం 51 శాతం పట్టభద్రులు ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ మాజీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా అవకాశాల వైపు పరిగెత్తాలని సూచించారు. వైస్-ఛాన్సలర్ యాదగిరిరావు కోర్సులు, అవస్థాపన, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటు, హాస్టల్, ఆడిటోరియం, క్రీడా మైదానం అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. స్నాతకోత్సవంలో 132 మందికి బంగారు పతకాలు, 156 మందికి డాక్టరేట్ పట్టాలు అందించారు. డీన్స్, ప్రొఫెసర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ తదితరులు పూలబొకేలతో స్వాగతించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ సందర్శించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శాఖల వివరాలను వివరించగా, గవర్నర్ ఆసక్తితో తిలకించారు.

అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో మలావత్ పూర్ణ, గూగులోత్ సౌమ్య, రమేష్ కార్తీక్ నాయక్, బల్లాష్టు మల్లేష్, కందకుర్తి యాదవరావు, చిన్ని కృష్ణుడు, అమృతలత, నాలేశ్వరం శంకరం, వీ.పీ. చందన్ రావు, అష్ట గంగాధర్, పాయల్ కోట్గిర్కర్, పంచరెడ్డి లక్ష్మణ్, గణపతి అశోక శర్మ, తల్లావజ్జల మహేష్ బాబు, కాసర్ల నరేష్ రావు, ఘనపురం దేవేందర్, డాక్టర్ డి.శారద, గంట్యాల ప్రసాద్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, కత్తి గంగాధర్, బోచ్కర్ ఓంప్రకాష్, ఆరుట్ల శ్రీదేవి, శ్రీమన్నారాయణ చారి, కళా లలిత, బి.కళా గోపాల్, మద్దుకూరి సాయిబాబు, చింతల గంగాదాస్, చింతల శ్రీనివాస్ గుప్తా, డాక్టర్ అన్నందాస్ జ్యోతి, కైరకొండ బాబు, సిర్ప లింగం, చిందు బాబయ్య, మహమ్మద్ రషీద్, సాయి లవోల, జయలక్ష్మి, గంగాదేవి, పసునూరి వినయ్ కుమార్, టి. స్వప్నా రాణి, కే. సంతోష్ కుమా ర్, అష్ఫాక్ ఆస్పీ, దారం గంగాధర్‌లతో గవర్నర్ చర్చించి, వారి సేవలను పేరుపేరున అభినందించారు. అధికారులతో కలిసి ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు.

# పార్టీ పదవుల్లో అందరికీ న్యాయం

## శాసనమండలి సభ్యులు, జిల్లా ఇంచార్జ్ అద్దంకి దయాకర్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 16 (జనంసాక్షి) :**

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణ సన్నాహక సమావేశం కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సభాదక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనమండలి సభ్యులు జిల్లా ఇంచార్జ్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ...జిల్లా కాంగ్రెస్ కార్యవర్గానికి త్వరలో నియమించే బోయే కార్యవర్గంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గము నుండి ఒక జిల్లా ఉపాధ్యక్షుడు నియమించాలని, జిల్లా మొత్తంగా ఒక ట్రెజరర్ ఉండాలని, ఒక జిల్లా అధికార ప్రతినిధిని నియమించాలని, ప్రతి బ్లాక్ నుండి ఒక ప్రధాన కార్యదర్శిని నియమించాలని, ప్రతి మండలం నుండి ఒక కార్యదర్శిని ఎంపిక చేయాలని, పార్టీలో గత మూడు సంవత్సరాల నుండి నిబద్ధతతో పనిచేస్తున్న వారిని కులాల వారీగా గుర్తించి నియామకం చేపట్టాలని, కార్యకర్తలు మొక్కవోని దీక్షతో పనిచేస్తే మాకు పదవులు వచ్చినాయని, ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందన్నారు.

రాహుల్ గాంధీ మాకు చెప్పిండు మిమ్మల్ని నాయకుల్ని చేసిన వారిని మర్చిపోకుండా, వారిని నాయకులూ చేసే వరకు విశ్రమించొద్దని, సమన్వయకర్తలు ఇచ్చిన మీ అందరి జాబితా నా దగ్గరికి చేరింది అందరికీ న్యాయం చేస్తానని, గతంలో దేశంలో మెంబర్షిప్ విషయంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిన విషయం అందరికీ తెలిసిందే తెలంగాణ దేశానికే రోల్ మోడల్ కావాలని, ప్రభుత్వ పదవుల్లో, పార్టీ పదవుల్లో నియామకాలు చేపట్టి అందరికీ న్యాయం చేస్తామన్నారు. దేవుళ్ళు, దేవతల పేర్ల మీద ప్రాజెక్టులు నిర్మించి లక్షల కోట్లు టిఆర్ఎస్ పార్టీవారు దండుకున్నారు.

ఎవడైనా ప్రాజెక్టు మీద కట్టి కిందికి నీరు పారిస్తారు, కానీ కెసిఆర్ దేడు దిమాక్ గాడు కింద ప్రాజెక్టు కట్టి పైకి నీరు పారిస్తా అని చెప్పి మనల్ని కింద మీద చేసిండు అని నమ్మిన తెలంగాణను నిండముంచిన కేసీఆర్ను పాతాళలోకి తొక్కింది కాంగ్రెస్ కార్యకర్తలే అని అమ్మ సోనియమ్మ తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ ఎక్కడుండేటోడు చంద్రబాబు, జగన్ సంక నాకేటోడు అని తెలంగాణ సంపద దోచుకుని తన పార్టీ పేరు నుండి తెలంగాణ పదాన్ని తొలగించిన మూరుడు కేసీఆర్ అని ఆంధ్రకు పోయి రోజా ఇంట్లో రొయ్యల పులుసు తిన్న కేసీఆర్ రాయలసీమను రతనాలసీమ చేస్తా అన్న కేసీఆర్, ఇయాల తెలంగాణ ఆస్తిత్వాన్ని కాపాడుతా అని అంటుండని అదేంకి దయాకర్ మండిపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ నాయిని రాజేందర్ రెడ్డి, శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రుద్ర సంతోష్, సత్తు మల్లేశం, రహమతు హుస్సేన్, వైద్యుల అంజన్ కుమార్, వెలిచాలా రాజేందర్రావు, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఒడితల ప్రణవ్, ఊట్కూరు నరేందర్ రెడ్డి, కటకం మృత్యుంజయం, ఆరేపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ గౌడ్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఎండి తాజ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, ముత్యం శంకర్, కొరివి అరుణ్ కుమార్, బానోతు స్రావన్ నాయక్, నాయకులు కార్యకర్తలు హాజరైనారు.



## పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం

**ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** టెక్నాలజీ తదితర పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమైన ప్రాంతమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తో ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ మార్క్ లేమి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. రాష్ట్రంలో వనరులు ఇతర అంశాలను అధ్యయనం చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం ఫ్రాన్స్ బృందానికి సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం

**ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తు న్నాం**

**నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం**

**10 సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.**

**జిల్లాకు 13000 కొత్త రేషన్ కార్డుల మంజూరు**

**మంత్రుల చేతుల మీదుగా వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ**

**మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి**




**సంగారెడ్డి ప్రతినిధి, జులై 16( జనంసాక్షి) :** స్వయం సహాయక సంఘాల మహిళల ను కోటీశ్వరులుగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి అన్నారు. సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి వారు టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలతో కలిసిముఖ్య అతిథులు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక స్థలంబన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలపాటు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేస్తామంటూ కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదీశారు. తప్ప ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. గత పది సంవత్సరాలలో జిల్లాలో, రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డును గత ప్రభుత్వం ఇవ్వలేదని కానీ మన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సంగారెడ్డి జిల్లాకు 13వేల పైచిలుకు రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ కార్డు హామీల్లో భాగంగా ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం 200 యూనిట్ల ఫ్రీ కరెంటు గ్యాస్ సిలిండర్ పై రూ. 500 రాయితీ, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో మౌలిక వసతుల మెరుగు కోసం కృషి స్వయం సహాయక సంఘాల మహిళలకు ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో క్యాంటీన్ల ఏర్పాటు రాష్ట్రంలోని మొదటి పెట్రోల్ పంపు సంగారెడ్డిలో ఏర్పాటు చేయడం లాంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వాలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మహిళలు తో పాఠశాల గదుల నిర్మాణం కళాశాల గదుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు సైతం మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారతతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. స్వయం సహాయక సంఘాలసభ్యులను వ్యాపారవేత్తలుగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సులను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఒక స్వయం సహాయక సంఘం మహిళ గతంలో లక్ష రూపాయలు రుణం తీసుకున్నారని, ఈ రోజు సంఘాలకు 20 లక్షల లోన్ ఇవ్వడానికి బ్యాంకు వారు రెడీగా ఉన్నట్లు చెప్పడం నాకు ఎంతో సంతోషంగా వచ్చి ఉందని మంత్రి తెలిపారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు వ్యాపారాలు చేసి రాణించి రుణాలు కట్టి ఇంకా ఎక్కువ రుణాలు తీసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఈ సందర్భంగా మహిళలకు మంత్రి వివేక్ సూచించారు. ఆర్థిక క్రమశిక్షణతోనే మహిళా సంఘాల సభ్యులు ఎదగడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు వెలుగులు పంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అప్పుల పాలైనప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక వైపు చక్కదిద్దుతుంది ఒక్కొక్కటిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేరుస్తున్నట్ల వారు తెలిపారు. పొదుపు సంఘాలను ఏకం చేసి ఆర్థికంగా ఎదిగేలా రెండు వేల సంవత్సరం నుండి అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 23 వేలకు పైగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు రూ 30 కోట్ల వడ్డీ లేని రుణాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని 23 వేల స్వయం సహాయక సంఘాలకు 30 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరైనట్లు తెలిపారు. ఏడాది 460 ఇందిరా మహిళా శక్తి యూనిట్ల ఏర్పాటు కోసం ప్రణాళికల రూపొందించినట్లు తెలిపారు చిన్న చిన్న వ్యాపారాలను పెద్దపెద్ద వ్యాపారులుగా మార్చడానికి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం తోడ్పాటు అందిస్తుంది అన్నారు ఒకరికొకరు సహాయం చేసుకోవాలి మరియు మీకు మెప్మా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనికి తోడు అదనంగా బీమా కూడా మహిళా స్వయం సహకార సంఘాల సభ్యులకు అందుబాటులో ఉందన్నారు. అనంతరం మంత్రుల చేతులమీదిగా సంగారెడ్డి నియోజక వర్గం లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను , మహిళా సంఘ సబ్యులకు ఋణ బీమా, ప్రమాద బీమా చెక్కులను, మహిళాసంఘాలకు బ్యాక్ లింకెజీ ఋణాలను, అర్హులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , పిడి డిఆర్‌డిఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా

# సరఫరాకు చర్యలు చేపట్టండి

**2034 నాటికి ఇది 33,773 మెగావాట్ల డిమాండ్ ఏర్పడుతుంది**

**సబ్ స్టేషన్లకు భూమి ఇచ్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించండి**

**విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**




భవిష్యత్ లో ఏర్పడే విద్యుత్ డిమాండ్ ను అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీడీసీఎల్ లో విద్యుత్ శాఖల ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజలకు అత్యంత నాణ్యమైన కరెంట్ ను రెప్పపాటు కాలంకూడా అంతరాయం లేకుండా ప్రజలకు అందిస్తున్నాం అని చెప్పారు. గత ఏడాది మార్చి 24న 308.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను సరఫరా చేయగా.. ఈ ఏడాది 18 మార్చిన 335.19 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. ఇది రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికం అని అన్నారు. గత ఏడాది 8 మార్చి 8న 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడగా.. ఈ ఏడాది మార్చి 20న 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడిందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. సుమారు 2000 మెగావాట్ల అదనపు డిమాండ్ ఏర్పడినప్పటికీ రెప్పపాటు కాలం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయగలిగామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత విద్యుత్ డిమాండ్ ఏర్పడిన.. ఎక్కడా కోతలు లేకుండా ప్రజలకు నిరంతరం కరెంట్ ను అందించిన ఘనత ప్రజా ప్రభుత్వంకు చెందుతుందని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ 2024 నుంచి 9.8 శాతం చొప్పున పెరుగుతోందని.. 2034 నాటికి ఇది 33,773 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర సంస్థలు విశ్లేషించినట్టు తెలిపారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, అంచనాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కొత్త సబ్ స్టేషన్లను నిర్మించాలని అధికారులను ఆదేశారు. కొత్త సబ్ స్టేషన్ నిర్మిస్తున్న ప్రాంతంలో భూమి కోల్పోయిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విషయంపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచన చేశారు. ఇదిలా ఉండగా ఫాస్టెస్ట్ గ్రోయింగ్ సిటీగా పేరొందిన హైదరాబాద్ మహానగరంలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ కేబుల్స్ నిర్మాణం కొరకు పూర్తిస్థాయిలో డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు స్థలం కొరత నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 12.5 మిలియన్ యూనిట్ల ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల పవర్ ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రెన్యూవబుల్ ఎనర్జీపై పూర్తిగా దృష్టి సారించాలని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్కో సిఎండి హరీష్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పెద్దధన్వాడ ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్ సీరియస్

**రైతులపై పెట్టిన అక్రమ కేసులపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ**

**రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె రామ కృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్‌పై ఆగ్రహం**

**28న హైదరాబాద్‌లో బహిరంగ విచారణ చేపట్టనున్న కమిషన్ బృందం**

**రైతుల ప్రయాణ ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఆదేశం**

జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారికంగా తెలిపింది.పిటిషనర్, బాధితులు, రైతులు, కేసులు తప్పుడు కేసులు ఎదుర్కొంటున్న వారు, వారి కుటుంబ సభ్యులు, ఇతర ప్రత్యక్ష సాక్షులు బహిరంగ విచారణలో పాల్గొనాలని కమిషన్ కోరింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక అధికారిని నియమించాలనీ ఆదేశించింది. జూలై 28న బాధితులు, వారి తరపు సాక్షులను హైదరాబాద్‌కు వచ్చేవిధంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సర్కారుకు సూచించింది. ఈ మేరకు వారంలో చర్యలు తీసుకొని అత్యవసర నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె రామ కృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్‌లను జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది.

## బనకచర్లపై చర్చించారు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

చేతలకు పొంతన ఉండదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారని ఆయన చెప్పారు. “రాష్ట్రంలో భాజపా, తెదేపా రిమోట్ పాలన కొనసాగుతోంది. కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని సీఎం రేవంత్ చెప్పడం సబబు కాదు. బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పు.. సీఎం పాల్గొనడం మరో తప్పు. 4 కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం ఎలా నిర్వహిస్తారు? రాష్ట్రానికి ద్రోహం చేస్తూ సీఎం మరణశాసనం రాశారు. బేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలి” అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## మహిళా శక్తి సంబురాలను సక్సెస్ చేయాలి

**18న చిట్యాలకు మంత్రి సీతక్క రాక**

**మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలి..**

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి..**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండల కేంద్రంలో ఈనెల 18న ఉదయం 10గంటలకు నిర్వహించే మహిళా శక్తి సంబురాలకు మంత్రి సీతక్క హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక రంగాల్లో పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందజేయడంతో పాటు, ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలియజేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని చిట్యాల మండల కేంద్రంలో మహిళా శక్తి సంబరాల కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరుకానున్నందున ఆయా గ్రామాల్లోని మహిళలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెలుగా అనేక పథకాలను ప్రవేశ పెడుతుందని, అన్ని వర్గాల శ్రేయస్సుకోసం అమలు చేస్తున్న పథకాలను నిరుపేదల చెంతకు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకోనేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ సత్తా చాటి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ఇప్పటినుండే నాయకులు కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ గంటలకు కిష్టయ్య, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, శిరుప అనిల్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిత్రమా..నేను రాజ్యసభ సభ్యుడినయ్యా

**రజనీకాంత్‌ను కలిసి ఆనందం పంచుకున్న కమల్**



**చెన్నై, జూలై 16 (జనంసాక్షి) :** తమిళ సినీ దిగ్గజాలు కమల్ హాసన్, రజనీకాంత్ ఒకేచోట కలుసుకున్నారు. దిగ్గజనటుడు కమల్ హాసన్ రాజ్యసభ ఎంపీగా ఎన్ని-కై-న సందర్భంగా ఈ శుభవార్తను తన స్నేహితుడితో పంచుకోవడానికి రజనీకాంత్ నివాసానికి వెళ్లారు. ఈ విషయాన్ని కమలే స్వయంగా ఎక్స్ వేదికగా ప్రకటించారు. నా స్నేహితుడు రజనీకాంత్‌కు రాజ్యసభ ఎంపీగా నా కొత్త ప్రయాణం గురించి తెలియ జేశాను. ఎంతో సంతోషంగా ఉంది‘ అని కమల్ హాసన్ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. దీనితో పాటు- ఫొటోలను పంచుకున్నాడు. ఈ ఫోటోలలో కమల్ హాసన్ తన రాజ్యసభ ఎంపీ ఆర్డర్‌ను రజనీకాంత్‌కు చూపిస్తూ ఉండగా, మరొక ఫోటోలో వారిద్దరూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. మక్కల్ నీది మైయం పార్టీ అధినేత కమల్ హాసన్, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ద్రవిడ మున్నేట్ర కజగం పార్టీకి మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల ఒప్పందం ప్రకారం కమల్‌హాసన్‌ని రాజ్యసభకు నామినేట్ చేయడంతో పాటు- ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది డీఎంకే. సినిమాల విషయానికొస్తే, కమల్ హాసన్‌ఇటీ-వలే మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన థగ్ లైఫ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. రజనీకాంత్ విషయానికొస్తే లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తుండగా ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. అలాగే నెల్సన్ దర్శకత్వంలో జైలర్ 2 సినిమా చేస్తున్నాడు.

## కదులుతున్న బస్సులో ప్రసవం

**పుట్టిన బిడ్డను విసిరి పడేసిన యువతి**

**డ్రైవర్ ఫిర్యాదుతో పోలీసుల అరెస్ట్**

**ముంబయి, జూలై16 (జనంసాక్షి) :** కదులుతున్న బస్సులో ఓ యువతి ప్రసవించింది. అనంతరం పసికందును బస్సు కిటికీలో నుంచి బయటకు విసిరేయడంతో బాబు చనిపోయాడు. ఈ సంఘటన మహారాష్ట్రలోని పర్భాణీ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రితిక దీరీ అనే యువతి, అల్తాఫ్ షేక్‌తో కలిసి పూణే నుంచి పర్భాణీకి వెళ్తోంది. సంత్ ప్రయాగ్ ట్రావెల్స్‌లో స్లీపర్ కోచ్‌లో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. పెత్రి-సెలూ రహదారిపై రాగానే రితికకు పురటి నొప్పులు రావడంతో పండంటి మగ బిడ్డకు జన్మనించింది. వెంటనే బాబును గుడ్డలో మూటకట్టి బస్సులో కిటికీలో నుంచి షేక్ బయటపడేశాడు. డ్రైవర్ గమనించి కిటికీలో నుంచి వస్తువు బయటపడడంతో బస్సును నిలిపివేశాడు. డ్రైవర్‌ను వారిని ప్రశ్నించగా తన భార్య రితిక వాంతులు చేసుకోవడంతో గుడ్డతో సహా బయటపడేశానని వివరణ ఇచ్చాడు. డ్రైవర్‌కు అనుమానం రావడంతో రోడ్డు వెంట పరిశీలించగా పసికందు దేహం కనిపించింది. వెంటనే డ్రైవర్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇద్దరు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఇద్దరు భార్యభర్తలమని సమాధానం చెప్పారు. దంపతులమని చెప్పడానికి సరైన ఆధారాలు వారి వద్ద లేవు. ఏడాదిన్నర నుంచి పుణేలో కలిసి ఉంటున్నామని పోలీసులకు ఇద్దరు వివరణ ఇచ్చారు. యువతిని ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బిఎన్ఎస్ సెక్షన్ల కింద 94(3)(5) కింద కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370